PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 255 | విజయవాడ, శుక్రవారం 18 ఏప్రిల్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Friday 18 April 2025 | Rs



బుమ్రా, జాక్స్ దెబ్బకు సన్‌రైజర్స్ చిత్తు

- గెలిచిన ముంబయి

8



'వక్ఫ్' ప్రత్యేక సంచిక

రాజ్యాంగ హక్కులను హరిస్తూ కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో వక్ఫ్ చట్టం నేపథ్యం, తాజా సవరణల పర్యావసనాలు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు పోరాటాల ఆవశ్యకత తదితర అంశాలతో ప్రజాశక్తి ప్రత్యేక సంచిక రూపొందించింది. నేటి సంచికతో పాటు అందుకోగలరు.

- సంపాదకులు

ఎకరం 99 పైసలు!

విశాఖ రిషికొండలో టిసిఎస్‌కు ధారాదత్తం

- ఈ కేటాయింపులు చట్ట విరుద్ధం : సర్కారుకు ఇఎఎస్ శర్మ లేఖ
- ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాలు బాధాకరమని వ్యాఖ్య



టిసిఎస్‌కు భూములు కేటాయించిన రిషికొండ ప్రాంతం ఇదే

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖపట్నంలోని రుషికొండ ప్రాంతంలో ఎకరం విలువ ఎంత? లక్షల్లోనో, కోట్లలోనో మీరు సమాధానం చెబితే లెక్క తప్పినట్టే! రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం ఇక్కడ ఎకరం భూమి ఒక్కరూపాయి కూడా లేదు! ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఎకరం విలువ కేవలం 99 పైసలు మాత్రమే! నమ్మశక్యం కావడం లేదా...కానీ... నమ్మితీరాల్సిందే! ఇంకేం... పాలోమంటూ భూమలను కొనడానికి 'చలో.. విశాఖ' అందామనుకుంటున్నారా! అదేం కుదరదు. ఆ ధరకు భూములు మీకు దక్కాలంటే మీరు టాటా కన్సెల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) యాజమానులైనా కావాలి. లేదా అంత'పేద'వారైనా అయివుండాలి. అవును..! ఎకరం అక్షరాల 99 పైసలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పనంగా 21.16 ఎకరాల భూములు అప్పగించింది టిసిఎస్‌కే! రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతున్నా ఏ మాత్రం స్పందించని ప్రభుత్వ పెద్దలు టిసిఎస్ పట్ల చూపించిన ఉదారత ఇది! రాష్ట్ర ప్రభుత్వ ఈ ధోరణి పట్ల కేంద్ర ప్రభుత్వ పూర్వ ప్రధాన కార్యదర్శి ఇఎఎస్ శర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అస్మదీయులకు ప్రజల సొమ్మును దోచిపెట్టడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ భూమలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు బాధ్యత వహించాల్సిన ప్రభు త్వాలు ఆశ్రిత పెట్టుబడిదారి విధానం (క్రోని కేపిటలిజమ్)ను అనుసరించడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

లేఖలో ఏమి రాశారంటే...



ఇఎఎస్ శర్మ

టిసిఎస్ కంపెనీకి విశాఖ రుషికొండ ప్రాంతంలో 21.16 ఎకరాల విలువైన భూమిని కేటాయించడం చట్ట విరుద్ధమని ఇఎఎస్ శర్మ తన లేఖలో పేర్కొన్నారు. ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణం వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు రాసిన లేఖ వివరాలను గురువారం ఆయన మీడియాకు వెల్లడించారు. రుషికొండలో భూముల విలువ రాష్ట్ర రిజిస్ట్రేషన్ శాఖ రేట్ల ప్రకారం ఒక చదరపు గజానికి రూ.30 వేలు ఉందని, ఆ రేటు మార్కెట్ ధరతో పోలిస్తే చాలా తక్కువని పేర్కొన్నారు. అయినా, ఆ రేట్ ఆధారంగానైనా తీసుకుంటే రుషికొండలో ఒక ఎకరం విలువ సుమారు రూ.15 కోట్లు ఉంటుందని, అంటే, టిసిఎస్‌కు ఇచ్చిన 21.16 ఎకరాల భూమి సుమారు రూ.320 కోట్లకు మించి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2012లో జారీ చేసిన జిఒఎంఎస్ 571 (రెవెన్యూ) ప్రకారం ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వకూడదన్నారు. అటువంటి భూముల వార్షిక లీజు రెంటల్ మార్కెట్ విలువ మీద పది శాతం కన్నా తక్కువ ఉండకూడదని పేర్కొన్నారు. పైగా అటువంటి లీజు రెంటల్ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి మార్కెట్ ధర ఆధారంగా సవరించాల్సి ఉందన్నారు. ఆ మిగతా 7లో

'వక్ఫ్'పై తదుపరి విచారణ వరకు

యథాతథ స్థితి

- ఎలాంటి నియామకాలు చేపట్టొద్దు
- కేంద్రానికి సుప్రీం ఆదేశం
- మే 5కి విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వక్ఫ్ సవరణ చట్టంపై అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. యథాతథ స్థితిని కొనసాగించాలని పేర్కొంది. వక్ఫ్ ఆస్తులను డీ నోటిఫై చేయవద్దని, అలాగే సెంట్రల్ వక్ఫ్ బోర్డు, రాష్ట్ర వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను నియమించవద్దని ఆదేశించింది. వక్ఫ్ సవరణ చట్టం చెల్లుబాటుపై సుప్రీంకోర్టులో గురువారం మరోసారి విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించి తమను అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు కేంద్రం వారం రోజులు గడువు కోరగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పివి సంజయ్ కుమార్, జస్టిస్ కెవి విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం అంగీకరించింది. తదుపరి విచారణ జరిగే వరకు వక్ఫ్ ఆస్తులను డీ నోటిఫై చేయబోమని కేంద్రం తెలియజేసింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ కేసు విచారణను మే 5వ తేదీకి వాయిదా వేసింది. వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను సభ్యులుగా నియమించొద్దని ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించింది.

కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ... ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా వుందన్నారు. ప్రభుత్వానికి లక్షల కొద్దీ మెమొరాండాలు, విజ్ఞప్తులు, అభ్యంతరాలు అందాయని, వాటి ఆధారంగానే తాము ఈ నిబంధనలను రూపొందించామని చెప్పారు. ఉదాహరణకు గ్రామాలకు గ్రామాలను వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించారని, ప్రజల వ్యక్తిగత ఆస్తులను కూడా అలాగే వక్ఫ్ ఆస్తులుగా తీసుకున్నారన్నారు. ఇది కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన చట్టం, ఇందులో పెద్ద సంఖ్యలో అమాయకుల భూ, ఆస్తి హక్కులకు సంబంధించిన అంశాలు వున్నాయన్నారు. ఇది ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. కొన్ని పత్రాలతో సహా కోర్టుకు సమాధానం దాఖలు చేసేందుకు వారం రోజులు సమయం కావాలని కోరారు. ఈ అంశంపై వంద సంవత్సరాల కాలంలోని మొత్తం చట్టాల పరిధి, కొత్త చట్ట నిబంధనల రూపకల్పనకు దారితీసిన, దేశవ్యాప్తంగా అందిన అనేక మెమొరాండాలతో కలిపి మొత్తంగా ప్రభుత్వ స్పందన తెలియజేస్తామని మెహతా చెప్పారు. అప్పటి వరకు బోర్డు, కౌన్సిల్ నియామకం ఉండదని సొలిసిటర్ జనరల్ హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పందిస్తూ, ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి గణనీయమైన మార్పులు చోటు మిగతా 7లో

ఎస్సి వర్గీకరణకు ఆర్డినెన్స్ జారీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

షెడ్యూల్ కులాల (ఎస్సి) వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. ఈ మేరకు న్యాయ శాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి గెజిట్ ముద్రణకు గురువారం ఆదేశాలు ఇచ్చారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆమోదం అనంతరం ఆర్డినెన్స్‌ను ప్రభుత్వం జారీ చేసింది. ఈ నెల 15వ తేదీన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ముసాయిదా ఆర్డినెన్స్‌కు మంత్రి వర్గం ఆమోద ముద్ర వేసింది. ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ ప్రక్రియ పూర్తి చేయడంతో ఎస్సిలకు జస్టిస్ రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సూచించిన విధంగా, ఉప వర్గాల వారీగా రిజర్వేషన్‌లు అమలు చేసేందుకు సిద్ధమవుతుంది.

25న గురుకుల పరీక్ష

- వెబ్‌సైట్‌లో హాల్‌టిక్కెట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 2025-26 విద్యాసంవత్సరం ప్రవేశ పరీక్ష ఈ నెల 25వ తేదిన జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి విఎన్ మస్తానయ్య వెల్లడించారు. హాల్ టిక్కెట్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 5, 6, 7, 8వ తరగతులకు ఎపిఆర్ఎస్ క్యాట్-2025 పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కళాశాలలకు ఎపిఆర్‌జెసి, డిసిసెట్-2025 పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. హాల్ టిక్కెట్లను aprs.apcfss.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. పోస్టు ద్వారా పంపడం లేదని పేర్కొన్నారు. అభ్యర్థులు వారి ఐడి, పుట్టిన తేదీ ద్వారా వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. పరీక్ష కేంద్రానికి గంట ముందుగా అభ్యర్థులు చేరుకోవాలని పేర్కొన్నారు.

'హోదా' ముగిసిన అధ్యాయం కాదు

హోదా , విభజన హామీల అమలుకు పోరాడాలి
ముఖ్యమంత్రి చంద్రబాబుకు సిపిఎం విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమని 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ పనగరియ చెప్పడంపై సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని స్వయంగా ప్రధాని వాగ్దానం చేశారని, దీనికోసం ప్రజలు గత పది సంవత్సరాలుగా ఆశతో ఎదురు చూస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆశలను అడియాశలు చేసి వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. 14వ ఫైనాన్స్ కమిషన్ ఇది తమ పరిధిలోకి రాదని చెప్పగా 16వ కమిషన్ ఛైర్మన్ ముగిసిన అధ్యాయమని చెప్పడాన్ని ఖండించారు. ప్రణాళికా సంఘం రద్దయినంత మాత్రాన ప్రభుత్వ విధానం మారదని పేర్కొన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వ పరిధిలో అంశమని, నీతి అయోగ్‌తో నిమిత్తం లేకుండా 16వ ఆర్థిక సంఘం రాష్ట్రంలో ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక హోదా కోసం సిఫారసు చేయాలని డిమాండు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఖరి మారాలి

రాష్ట్ర ప్రభుత్వం 16వ ఆర్థిక సంఘానికి సమర్పించిన మెమోరాండంలోగానీ, ముఖ్యమంత్రి వివరణలోగానీ ఎక్కడా ప్రత్యేక హోదా, రాష్ట్ర విభజన హామీలను ప్రస్తావించకపోవడం అన్యాయమని తెలిపారు. పెట్టుబడుల కోసం విదేశీ కంపెనీల చుట్టూ తిరిగి నిరాశపడే కన్నా, వారుపెట్టే ఆలివిమాలిన నిబంధనలకు లొంగి మన వనరులను దోచిపెట్టడం కన్నా ప్రత్యేక హోదా వస్తే పెట్టుబడులు వాటంతట అవే వస్తాయని పేర్కొన్నారు. పెట్టుబడి పెట్టేవాళ్లే మన చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తుందని అందువల్ల రాష్ట్ర అభివృద్ధికి ప్రత్యేక హోదా ప్రాముఖ్యత కలిగిందని తెలిపారు. గత పది సంవత్సరాల అనుభవం దీన్నే రుజువు చేస్తోందని, పదేళ్లలో ప్రత్యేక హోదా ఇవ్వకుండా ప్యాకేజీ పేరుతో మోసపోయి అప్పుల పాలై రాష్ట్రం వెనుకబడిపోయిందన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని తెలిపారు.

ఇప్పటికైనా ప్రత్యేక హోదా విభజన హామీల అమలు కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయడికి సిపిఎం విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో ఉన్న సంపన్నులు ఎవరూ కూడా ఇక్కడ పెట్టుబడి పెట్టడానికి సిద్ధపడటం లేదని, ఇతర రాష్ట్రాలకు దేశాలకు వెళ్లిపోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే పెట్టుబడులు పెట్టే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని సూచించారు.

బిజెపి మాట రాష్ట్రానికి చేటు

కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటా ప్రస్తుతం ఉన్న 41 శాతాన్ని కొనసాగించాలని 16వ ఫైనాన్స్ కమిషన్ను రాష్ట్ర బిజెపి కోరడం రాష్ట్ర అభివృద్ధికి చేటని సిపిఎం పేర్కొంది. బిజెపి వైఖరి రాష్ట్రానికి తీవ్ర నష్టమనీ తెలిపింది. బిజెపి భాగస్వామిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం పన్నుల వాటా ఇవ్వాలని మెమోరాండం సమర్పిస్తే మరోవైపు బిజెపి 41 శాతం కోరడం రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతమని శ్రీనివాసరావు తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ, ముఖ్యమంత్రి స్పందించాలని కోరారు.



గతేడాది సాయం లేనట్టేనా ?

- 2025 వేట నిషేధ కాలానికే సర్వే
- కోస్తాలో నేడు సర్వే
- 21న సచివాలయాల్లో జాబితా ప్రదర్శన

6

గ్లోబల్ యంగ్ లీడర్ల జాబితాలో రామ్మోహన్ నాయుడు



6

టారిఫోన్మాదంతో అమెరికాకూ ముప్పే..

- మాంద్యం ముంచుకురావొచ్చు
- ట్రంప్ తీరుపై యుఎస్ ఫెడ్ ఛైర్మన్ ఆగ్రహం

6

ప్రధాని పర్యటన ఖరారు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



అమరావతి నిర్మాణ పనుల పున్ణ ప్రారంభోత్సవానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటన ఖరారైంది. మే నెల 2వ తేదీన సాయంత్రం 4 గంటలకు రాజధాని నిర్మాణ పనులకు ఆయన ప్రారంభోత్సవం చేయనున్నారు. ఇందుకు సంబంధించిన వేదికను వెలగపూడిలోని సచివాలయం వెనుక వైపు ఉన్న భూముల్లో ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 500 ఎకరాల్లో ఈ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ ఏర్పాట్లను మంత్రుల కమిటీ, రాష్ట్ర ఉన్నతాధికారులు, పిఎంఒ అధికారులు సంయుక్తంగా పర్యవేక్షిస్తున్నారు. ఇక్కడే బహిరంగ సభ కూడా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి జనాన్ని తరలించేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు. ప్రధాని భద్రతా ఏర్పాట్లను స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్‌పిజి) బృందం పర్యవేక్షిస్తోంది.

మృతి చెందిన 'ఉపాధి' కూలీలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా

● ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు సమీపంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలపై వాహనం దూసుకెళ్లిన ఘటనలో మృతి చెందిన ఇద్దరు కూలీల కుటుంబాలకు రూ.25 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజకు, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు గురువారం లేఖ రాశారు. మొగల్తూరు ఘటనలో మృతి చెందిన కడలి పావని, గుబ్బల గంగల కుటుంబంలో వివాహం కావాల్సిన పిల్లలు ఉన్నందున ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో ఇద్దరికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. మెరుగైన వైద్యం పూర్తి ఉచితంగా అందించాలని లేఖలో కమిషనర్‌ను కోరారు.

సచివాలయాల్లో సీనియార్టీ జాబితాలు ప్రకటించాలి

● ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు సంబంధించి ప్రతి జిల్లాలో విభాగాల వారీగా తక్షణమే సీనియార్టీ జాబితాలు విడుదల చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎండి జానిపాషా, బత్తుల అంకమ్మరావు కోరారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ప్రతి జిల్లాలో సచివాలయ ఉద్యోగులకు విభాగాల వారీగా సీనియార్టీ జాబితాలను తక్షణం ప్రదర్శించాలని సచివాలయాల శాఖ ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినప్పటకీ అన్ని జిల్లాల్లో పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదన్నారు. ఉద్యోగుల మెరిట్ ర్యాంక్, ఉద్యోగంలో చేరిన తేదీ, సర్వీస్ తదితర అంశాల ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో, అన్ని విభాగాల వారికి ఒకే పద్ధతిలో సినియార్టీ జాబితాలు తయారు చేసి, ప్రదర్శించాలని కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

'చిరుత' మృతిపై విచారణ

● ఉపముఖ్యమంత్రి ఆదేశాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అన్నమయ్య జిల్లా పొన్నూటిపాళెం సమీపంలో ఉచ్చులో చిక్కుకొని చిరుతపులి మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణ చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖమంత్రి పవన్‌కల్యాణ్ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. పిసిసిఎఫ్ చలపతిరావును విచారణ అధికారిగా గురువారం నియమించారు. ఘటన చోటు చేసుకున్న అనంతరం సంబంధిత అధికారులు ఏ విధంగా స్పందించారనే విషయాన్ని తెలియజేయాలని ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లోనూ, సమీప గ్రామాల్లోనూ జంతువుల కోసం ఉచ్చులు వేసే వేటగాళ్లు, ఆ తరహా నేరాలు చేస్తున్న వారిపై నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ ఘటనపై విచారణను పర్యవేక్షించాలని అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావుకు దిశానిర్దేశం చేశారు.

న్యాయవాదుల సమక్షంలో ఎంపి మిధున్‌రెడ్డి విచారణ

● సిట్‌కు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి, అమరావతి

మద్యం కొనుగోళ్ల కేసులో రాజంపేట ఎంపి పివి మిధున్‌రెడ్డిని ఆయన లాయర్ల సమక్షంలో విచారించాలని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో ముందుస్తు బెయిల్ కోసం మిధున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను ఇటీవల హైకోర్టు కొట్టివేసింది. దీంతో న్యాయవాదుల సమక్షంలో తనను సిట్ అధికారులు విచారణ చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ మిధున్‌రెడ్డి వేసిన మరో పిటిషన్‌ను జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు గురువారం విచారించారు. పిటిషనర్ వాంగ్మూలాన్ని నమోదు చేసే ప్రదేశంలో పది మీటర్ల దూరంలో ఒక న్యాయవాది ఉండేందుకు అనుమతించాలన్నారు. సిట్ దర్యాప్తు మొత్తం న్యాయవాదికి కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. ఒక న్యాయవాది సమీపంలో, మరొక న్యాయవాది కూడా సిట్ దర్యాప్తునకు సమీపంలో ఉండేలా చేయాలని ఆదేశించారు. అయితే వాంగ్మూల నమోదు ప్రక్రియలో న్యాయవాది జోక్యం చేసుకోరాదన్నారు. మద్యం కొనుగోళ్ల వ్యవహారంలో ఈ నెల 19న తమ ముందు హాజరు కావాలంటూ సిట్ అధికారులు ఈ నెల 16న నోటీసులిచ్చారు. ఈ విచారణ లాయర్ల సమక్షంలో నిర్వహించేలా చేయాలని, అలాగే ఆ ప్రక్రియను ఆడియో, వీడియో రికార్డింగ్ చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని మిధున్‌రెడ్డి తరపు సీనియర్ లాయర్ నిరంజన్‌రెడ్డి కోరారు. సిట్ తరపున అడ్వొకేట్ జనరల్ (ఎజి) దమ్మాలపాటి శ్రీనివాస్ ప్రతివాదన చేస్తూ, సాక్షుల వాంగ్మూలాలను ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలనే నిబంధన చట్టంలో లేదన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

● కలెక్టర్లకు సిఎస్ ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సరఫరా, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై సచివాలయం నుంచి కలెక్టర్లతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 332 మండలాల్లోని 3,438 అవాసాల్లో నీటి ఎద్దడి ఉండే అవకాశమున్నట్లు గుర్తించామని, ఈ ప్రాంతాల్లో తాగు నీటికి ఇబ్బందులు రాకుండా చూసేందుకు రూ.67.31 కోట్లతో ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత పెరిగి.. వడగాడ్పులకు అవకాశం ఉందని, వీటిని అధిగమించేందుకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కరువు ప్రభావిత మండలాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయడంతో పాటు అవసరమైన చోట్ల ప్రయివేటు తాగునీటి వనరులను అద్దె ప్రతిపాదికన తీసుకొని ప్రజల దాహార్తిని తీర్చాలని చెప్పారు. తాత్కాలిక నీటి సరఫరా వ్యవస్థల పునరుద్ధరణ, మరమ్మత్తులు, తాగునీటి చెరువులను నీటితో నింపడం, చేతి పంపులను మరమ్మత్తులు నిర్వహించాలని వెల్లడించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రత్యేక మానిటరింగ్ సెల్‌లను ఏర్పాటు చేసి తాగునీటి సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించి తక్షణమే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిగా నీటితో నింపాలని తెలిపారు. జలవనరుల శాఖతో సమన్వయం చేసుకుని కాలువలకు అడ్డుకట్ట వేసి చెరువులకు నీటిని మళ్లించాలని తెలిపారు. నీటి పొదుపు అవశ్యకతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు. దాతలు, ఇతర సంస్థల సహకారంతో అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేకంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నీటి కాలుష్యం వల్ల వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయానంద్

సక్రమంగా స్వచ్ఛాంధ్ర

స్వచ్ఛాంధ్ర దినోత్సవాన్ని సక్రమంగా నిర్వహించడం ద్వారా కార్యాలయాలు, పరిసరాలన్నింటినీ పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని సిఎస్ విజయానంద్ అన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువుల వ్యర్థాల (ఇ-వ్యర్థాలు) సేకరణ, సక్రమ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇ-వ్యర్థాల సేకరణపై శిక్షణ ఇవ్వాలని తెలిపారు.

ఈ సమావేశంలో సాధారణ పరిపాలన ముఖ్యకార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, పరిశ్రమల శాఖ డైరెక్టర్ అభిషిక్త్ కిషోర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండి అనిల్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

సిలిండర్ ఇచ్చిన వెంటనే సబ్సిడీ

● సమీక్షలో మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దీపం పథకంలో భాగంగా మార్చి 31వ తేదీలోపు బుక్ చేసుకున్న లబ్ధిదారులకు సిలిండర్ ఇచ్చిన వెంటనే సబ్సిడీ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేయాలని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. విజయవాడలోని సివిల్ సప్లై భవన్‌లో ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూసబ్సిడీ జమ చేసే విషయంలో సాంకేతిక సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.. ఈ పథకానికి సంబంధించి లబ్ధిదారులకు ఏవైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబరు 1967 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్, ఎండి మంజీర్ జిలానీ, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతులకు బ్యాంకర్లు సహకరించాలి

ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలకు సక్రమంగా చెల్లింపులు జరిపేందుకు సహకారం అందించాలని బ్యాంకర్లను మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. విజయవాడలోని సివిల్ సప్లై భవన్‌లో బ్యాకర్లతో సమావేశం అయిన ఆయన గడిచిన 9 నెలల్లో రూ.24 వేల కోట్లను, ధాన్యం విక్రయించిన రైతులకు చెల్లించినట్లు చెప్పారు. వాట్సాప్‌ను వినియోగించుకుని 17 వేల మంది రైతులు ధాన్యం విక్రయించినట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో ఆరు లక్షల మంది రైతుల నుంచి 38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేశామని చెప్పారు. నూతన సాంకేతిక విధానంలో కొత్త రేషన్ కార్డులు అందించనున్నట్లు చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఉపయోగించి ప్రతి వేర్ హౌస్ గోదాము వద్ద ఎఐ సిసి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్, ఎండి మంజీర్ జిలానీ వివిధ బ్యాంక్‌ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

● పంటలకు మద్దతు ధర కల్పించాలి

● మంత్రి అచ్చెన్నాయుడుకు ఎపి రైతు, కౌలు సంఘాల లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మిర్చి, పత్తి, పొగాకు, మినుము, పెసర, శనగ, కంది, ధాన్యం వంటి వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పతనంతో తీవ్ర ఆందోళనలో ఉన్న రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్రప్రభుత్వాన్ని ఉమ్మడిగా కోరాయి. ఈ మేరకు వ్యవసాయ శాఖమంత్రి కె అచ్చెన్నాయుడుకు ఆయా సంఘాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర రెడ్డి, వై రాధాకృష్ణ, ఎం హరిబాబు గురువారం సంయుక్తంగా లేఖ రాశారు. గత ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్ సీజన్‌లో వేసిన మిర్చి, పొగాకు, పత్తి, మినుము, కంది, ధాన్యం వంటి ప్రధాన పంటలు దిగుబడి ఎంతో కొంత వచ్చినా పెరిగిన వ్యవసాయ పెట్టుబడులకు అనుగుణంగా పంటల ధరలు లేకపోవడంతో రైతాంగం తీవ్రమైన ఆందోళనలో ఉన్నారని తెలిపారు. మద్దతు ధరలు లభించక తక్కువ ధరలకే అమ్ముకోవాల్సిన దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి రైతులను ఆదుకుంటామని జనవరిలో ముఖ్యమంత్రి హామీ ఇచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్వింటాకు రూ.11,781 మద్దతు ధర ప్రకటించాయని తెలిపారు. కానీ అంత కంటే తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తే ధర వ్యత్యాసాన్ని రైతులకు అందిస్తామని ప్రభుత్వాలు హామీ ఇచ్చాయని, కానీ ఇప్పటివరకు ఎలాంటి విధి, విధానాలు రూపొందించలేదని పేర్కొన్నారు. గతేడాది పొగాకు పంటకు క్వింటాలుకు రూ.15 వేలు లభించిందని, దీంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగిందని వెల్లడించారు.

బ్లాక్ బెర్రి పొగాకును కొనుగోలు చేయకుండా పొగాకు కంపెనీలు రైతులను బ్లాక్ మెయిల్ చేస్తున్నాయని, వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నల్లబెర్లి పొగాకు క్వింటాలుకు రూ.15 వేలు తగ్గకుండా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మినుములు, పప్పుశనగ, కందిపంటలకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలతో రైతుల దగ్గర ఉన్న నిల్వలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని తెలిపారు. అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20వేలను తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలుపుకోవాలని కోరారు.

సవాళ్లు.. ప్రతిసవాళ్లతో తిరుపతిలో ఉద్రిక్తత

● వైసిపి, టిడిపి నాయకుల హంగామా

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

శ్రీ వేంకటేశ్వర గోశాలలో గోవుల మృతిపై కరుణాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలను నిరూపించాలని రాష్ట్ర టిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాసయాదవ్ సవాల్ విసరడంతో నిరూపణ పరిశీలనకు టిడిపి ఎమ్మెల్యేలు డాక్టర్ థామస్, గురజాల జగన్‌మోహన్ నాయుడు, షాజహాన్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టిటిడి పాలక మండలి సభ్యులు జి.భానుప్రకాష్‌రెడ్డి ఉదయం తొమ్మిది గంటలకల్లా గోశాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు గోశాల వద్ద పోలీసు బందోబస్తు, డ్రోన్‌కెమెరాలతో ప్రత్యేక నిఘా ఉంచారు. గోశాల మెయిన్ గేటు వద్ద ఎమ్మెల్యేలతో పాటు ముగ్గురిని మాత్రమే పోలీసులు లోపలికి అనుమతించారు. మిగిలిన టిడిపి నాయకులు రోడ్డుపైనే నిల్చున్నారు. బుధవారం రాత్రి నుంచి పోలీసులు గృహ నిర్బంధం చేశారని మండిపడుతూ ఆయన ఇంటి వద్దనే భూమన కరుణాకర్‌రెడ్డి నిరసన తెలిపారు. తాను టిడిపి సవాల్‌ను స్వీకరించానని, వైసిపి నేతలతో కలిసి ఎంపి మద్దిల గురుమూర్తి, నారాయణ స్వామితో కలిసి గోశాల వద్దకు భూమన చేరుకున్నారు. లోపలకి పోలీసులు అనుమతించకపోవడంతో నేలపై పడుకుని నిరసన తెలిపారు. ఆరోపణలు నిజం కాకపోవడం వల్లనే గోశాలకు వచ్చేందుకు కరుణాకర్‌రెడ్డి భయపడి డ్రామాలాడుతున్నారని ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి, పూతలపట్టు మురళీమోహన్, ఆరణి శ్రీనివాసులు విమర్శించారు. గోశాలను పరిశీలిస్తే గోవుల మృతి విషయం వెలుగులోకి రాదని, గోవులను పూడ్చిన ప్రాంతాన్ని పరిశీలిస్తే అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని భూమన కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. చివరకు వైసిపి నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. సొంతపూచీకత్తుపై సాయంకాలం వారిని విడుదల చేశారు. అంతకుముందు 'గోవుల సంరక్షణ పేరిట ఒకరిపై ఒకరు పోటాపోటీగా చేసుకుంటున్న విమర్శలను, సవాళ్ల, ప్రతి సవాళ్ల ఆపి వాస్తవాలను భక్తులకు, ప్రజలకు తెలియజే యాలని టిటిడి ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో కోరారు.



రోడ్డుపై పడుకుని నిరసన తెలుపుతున్న భూమన కరుణాకర్‌రెడ్డి, వైసిపి నాయకులు

డాక్టర్ పివి రాఘవశర్మ వాంగ్మూలం నమోదు

● గుంటూరు జిల్లా జడ్జికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి, అమరావతి

తప్పుడు మెడికల్ సర్టిఫికేట్లు సమర్పించి కోర్టు నుంచి బోరుగడ్డ అనిల్ మధ్యంతర బెయిల్ ఉత్తర్వులు పొందిన కేసులో లలిత సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డాక్టర్ పివి రాఘవశర్మ వాంగ్మూలాన్ని నమోదు చేయించాలని గుంటూరు ప్రధాన జిల్లా జడ్జిని హైకోర్టు ఆదేశించింది. ఒక జుడీషియల్ మేజిస్ట్రేట్ చేత రికార్డ్ చేయించిన వాంగ్మూలాన్ని నివేదించాలని స్పష్టం చేసింది. ఆ తర్వాతే బెయిల్‌పై తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపింది. తదుపరి విచారణను 2 వారాలకు వాయిదా వేస్తూ జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు గురువారం ఆదేశాలిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌లపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టారనే కేసులో అనంతపురం పోలీసులు బోరుగడ్డను అరెస్టు చేశారు. అయితే రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న అనిల్ తన తల్లి అనారోగ్యంతో బాధపడుతున్నారని పేర్కొంటూ గుంటూరు లలిత ఆసుపత్రి ఇచ్చిన సర్టిఫికేట్లను సమర్పించి హైకోర్టు నుంచి మధ్యంతర బెయిల్ పొందారు. ఆ సర్టిఫికేట్లు తప్పుడువని పోలీసులు, ఆపై డాక్టర్ రాఘశర్మ కూడా ధ్రువీకరణ చేశారు. ఈ వ్యవహారం గురువారం విచారణకు రావడంతో హైకోర్టు పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది.

ఎయిమ్స్‌కు 535 పోస్టులు మంజూరు

పెమ్మసాని వినతికి కేంద్రం స్పందన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మంగళగిరిలోని ఎయిమ్స్ హాస్పిటల్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఎయిమ్స్ ఆస్పత్రి సామర్ధ్యానికి అనుగుణంగా 534 ఉద్యోగాలను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని కోరుతూ ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన వినతిపత్రం అందించారు. 960 పడకల సామర్ధ్యంతో నిర్మించిన ఎయిమ్స్‌కు శాశ్వత ఉద్యోగులులేక అనేక ఇబ్బందులు వస్తున్నాయని కేంద్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రులకు విన్నవించగా వారు సానుకూలంగా స్పందించారు. కొత్తగా మంజూరైన పోస్టుల్లో అసోసియేట్ ప్రొఫెసర్‌లు 10, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు 40, సీనియర్ రెసిడెన్స్‌లు 100, జూనియర్ రెసిడెన్స్ 100, డిప్యూటీ నర్సింగ్ సూపరిండెంట్‌లు 3, అసిస్టెంట్ నర్సింగ్ సూపరిండెంట్ 10, నర్సింగ్ ఆఫీసర్స్ - 100 పోస్టులు మంజూరు అయ్యాయని పెమ్మసాని ఒక ప్రకటనలో వివరించారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మహత్యా...లాకప్‌డెత్తా..!?

● కడపలో అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

● కస్టోడియల్ కేసు నమోదు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైఎస్ఆర్ జిల్లా కడప రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. పోలీసులు, మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కడప నగరంలోని నకాష్ వీధికి చెందిన సోను (23)పై రెండు గంజాయి కేసులు ఉన్నాయి. ఆ కేసుల్లో సోనూను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌లో ఉంచారు. రాత్రి ఆయనకు కడుపు నొప్పి రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ మృతి చెందారు. కానీ, సోను పోలీస్‌స్టేషన్‌లోనే బాత్ రూము కిటికి గ్రిల్‌కు తన చొక్కాతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారని వార్తలు వెలువడ్డాయి. నిందితుడు వాస్తవంగా కడుపు నొప్పిని భరించలేకే ఆత్మహత్య చేసుకున్నాడా? పోలీసుల విచారణలో భాగంగా లాకప్‌డెత్‌కు గురయ్యాడా? అనే అంశం సందేహంగా మారింది. సోను మృతిపై ఎస్‌పి స్పందించి సిసి పుటేజ్‌లు, ఇతర ఆధారాలను పరిశీలించారు. 196 బిఎన్ఎస్ సెక్షన్ కింద కస్టోడియల్ కేసుగా నమోదుకు ఆదేశించారు. అనంతరం జమ్మలమడుగు డిఎస్‌పిని విచారణాధికారిగా నియమించారు. మృతుని తల్లి మాత్రం తన కుమారుడు కడుపునొప్పిని భరించలేకే మృతి చెందినట్లు పేర్కొనడం గమనార్హం. మృతుని తల్లి మాటల వెనుక పోలీసుల ఒత్తిడి ఏమైనా ఉన్నదా? అనే విషయం తెలియాల్సి ఉంది.

రు 3.73 లక్షల కోట్లు కావాలి

● ఆర్థికసంఘాన్ని కోరిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రానున్న ఐదేళ్ల కాలంలో రాష్ట్రాభివృద్ధి కోసం 3.73 లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని కేంద్ర ఆర్థిక సంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఆర్థిక సంఘానికి అందచేసిన నివేదికలో ఈ విజ్ఞప్తికి సంబంధించిన వివరాలను పొందుపరిచింది. వీటి ప్రకారం నదుల అనుసంధానానికి రు80,112 కోట్లు కావాలని కోరారు. గ్రామీణ స్థానిక సంస్థలకు 62,516 కోట్లు, పట్టణ స్థానిక సంస్థలకు 31,198 కోట్లు కేటాయించాలని కోరడం విశేషం. ఇక లాజిస్టిక్స్ రంగంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు, రహదారుల నిర్మాణానికి, పర్యాటకం, సాంకేతిక రంగం, విద్య, గ్రోత్ హబ్స్ వంటి వాటికి కూడా భారీగానే నిధులు కేటాయించేలా సిఫార్సులు చేయాలని కోరారు. ఇక రాజధాని నిర్మాణానికి 47 వేల కోట్లు కేటాయించాలని ప్రతిపాదించారు. ప్రకృతి వైపరీత్యాల నివారణకు మరో 16,181 కోట్లు కేటాయింపులు ఉండాలని కోరారు. ఇంత భారీగా నిధులు కోరినప్పటికీ ఆర్థిక సంఘం ఏ మేరకు సిఫార్సు చేస్తుందన్న దానిపై అధికారుల్లోనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వివిధ రంగాలకు రాష్ట్రం కోరిన సాయం వివరాలు

రంగం	నిధులు
నదుల అనుసంధానం	80,112
తాగునీరు	10,000
రోడ్లు	38,413
ఓడరేవులు	9,422
ఫిషింగ్ హార్బర్లు	1,176
లాజిస్టిక్స్ పార్కులు	4,290
గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు	5,630
ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్	6,919
పోర్టు సమీప అభివృద్ధి	7,414
క్వాంటమ్ వ్యాలీ	1,000
రతన్‌టాటా ఇన్నోవేషన్	750
స్కిల్ డెవలప్‌మెంట్	1,500
విద్య	9,647
పర్యాటకం	10,000
ప్రాంతీయ గ్రోత్ హబ్స్	30,000
రాజధాని నిర్మాణం	47,000
గ్రామీణ స్థానిక సంస్థలు	62,516
పట్టణ స్థానిక సంస్థలకు	31,198
ప్రకృతి వైపరీత్యాలు	16,181
మొత్తం	**3,73,168**

విశాఖ ఉక్కుపై కేంద్రం కుట్రలను తిప్పికొడతాం : సిఐటియు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కును ప్రయివేటీకరించేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను పోరాటాలతో తిప్పికొడతామని సిఐటియు నాయకులు ఎన్.రామారావు, డిసి హెచ్.వెంకటేశ్వరరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1526వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం శతవిధాలా ప్రయత్నిస్తోందన్నారు. సొంత గనులు కేటాయించడం లేదని, కార్మికులకు ప్రతినెలా సక్రమంగా జీతాలు ఇవ్వడంలేదని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తోందని మండిపడ్డారు. మోడీ సర్కారు అనుసరిస్తోన్న విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులు ఐక్యంగా పోరాడుతున్నారని, వారికి రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులపై జరుగుతున్న దాడులను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

కారణం చెప్పకుండా నిర్బంధమా..?

● పోలీసులపై హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి, అమరావతి

ఏ కేసులో అదుపులోకి తీసుకున్నదీ, నేరాభియోగం ఏమిటో కూడా తెలియజేయకుండా 60 ఏళ్ల వద్దుడ్ని నిర్బంధించడాన్ని, తిరుపతి నుంచి విజయవాడకు తీసుకురావడంపై పోలీసులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నెల 21న స్వయంగా తమ ముందు హాజరుకావాలని ఆ వద్ధుడిని హైకోర్టు ఆదేశించింది. కోర్టు ఎదుట హాజరయ్యే ముందు ఈ నెల 20, 21వ తేదీల్లో ఏ అధికారి ఎదుట, దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకానవసరం లేదని ఆ వద్ధుడికి స్పష్టం చేసింది. అలాగే, తిరుపతిలోని ఇంటి నుంచి వృద్ధుడ్ని తీసుకువెళుతున్న ఫొటోలోని పోలీసులను గుర్తించి ఆ వివరాలు అందజేయాలని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఆదేశించింది. విచారణను ఈ నెల 21కి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ రావు రఘునందన్రావు, జస్టిస్ కె. మన్మథరావు ధర్మాసనం గురువారం ప్రకటించింది.

ఈ కేసు వివరాల ప్రకారం రిటైర్డు పోలీస్ అధికారి టి.బాల సుబ్రహ్మణ్యంరెడ్డి (60)ని గుర్తు తెలియని పోలీసులు ఈ నెల 16వ తేదీ అర్ధరాతి 11.50 గంటలకు తిరుపతిలోని ఆయన ఇంటి వద్ద నుంచి తీసుకెళ్లారని, అతని ఆచూకీ తెలియడం లేదంటూ వైసీపీ నేత మేకా వెంకటరామిరెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరుపున సీనియర్ లాయర్ ఎస్.శ్రీరామ్ వాదిస్తూ మఫ్టీలో వచ్చిన పోలీసులు రెడ్డిని అన్యాయంగా రహస్య ప్రదేశంలో నిర్బంధించారని చెప్పారు. విజయవాడలోని సిట్ ఆఫీసుకు తెచ్చారని చెప్పారు. దీనిపై గవర్నమెంట్ స్పెషల్ ప్లీడర్ విష్ణు తేజ ప్రతివాదన చేస్తూ, పోలీసులు రెడ్డిని నిర్బంధించలేదన్నారు. ఒక కేసులో సాక్షిగా ఈ నెల 17న తమ ముందు హాజరు కావాలని ఈ నెల 14న సిట్ ఆఫీసర్లు నోటీసులు ఇచ్చారన్నారు. సిట్ ఆఫీసులో ఆయన వాంగ్మూలం నమోదు చేస్తున్నారని తెలిపారు. అనంతరం హైకోర్టు పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది.

ఆన్‌లైన్ విచారణలో అరుపులు, కేకలు

● వంశీ బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా

ప్రజాశక్తి, అమరావతి

కేసులతో సంబంధం లేని కొందరు హైకోర్టు ఆన్‌లైన్ విచారణకు హాజరై అవరోధం కలిగించడంపై ధర్మాసనం ఆరా తీసింది. ఆన్‌లైన్ విచారణకు హాజరై పెద్దగా అరుస్తూ కోర్టు ప్రక్రియకు ఆటంకం కలిగించిన వాళ్లపై ఆరా తీసి చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేసింది. అరుపులు, కేకలు పెద్దగా వినిపించడంతో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ బెయిల్ పిటిషన్ విచారణను ఈ నెల 23కి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు గురువారం ప్రకటించారు. గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదుదారు సత్యవర్ధన్‌ను వల్లభనేని వంశీ తదితరులు కులంపేరుతో దూషించారంటూ ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు అయ్యింది. ట్రయల్ కోర్టు బెయిల్ నిరాకరించడంతో వంశీ హైకోర్టును ఆశ్రయించారు. అయితే విచారణ సమయంలో ఆన్‌లైన్‌లోకి వచ్చిన కొందరు అరుపులు, కేకలు వేయడంతో విచారణను వాయిదా వేసింది.

4900మంది ఖైదీలకు మయన్మార్ క్షమాభిక్ష

బ్యాంకాక్: మయన్మార్ సాంప్రదాయ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని దాదాపు 4,900మంది ఖైదీలకు మయన్మార్ మిలటరీ ప్రభుత్వ అధిపతి క్షమాభిక్ష ప్రకటించారని ప్రభుత్వ మీడియా తెలిపింది. సైనిక పాలన వ్యతిరేకిస్తున్నందుకు ఎంతమంది రాజకీయ ఖైదీలు జైళ్లలో మగ్గుతున్నారో స్పష్టంగా తెలియరాలేదు. పాలక మిలటరీ కౌన్సిల్ అధిపతి జనరల్ మిన్ ఆంగ్ హ్లాయింగ్ 4,893 మంది ఖైదీలకు క్షమాభిక్ష ప్రకటించారని ఎంఆర్‌టివి గురువారం తెలిపింది. 13మంది విదేశీయులు కూడా ఈ సందర్భంగా విడుదల కానున్నారని వారిని మయన్మార్ నుండి పంపివేస్తారని విడిగా మరో ప్రకటనలో వార్తా సంస్థ తెలిపింది. హత్యలు, అత్యాచారాలు లేదా ఇతర భద్రతా అభియోగాల్లో దోషులుగా తేలిన వారు మినహా మిగిలిన ఖైదీలకు శిక్షలను కూడా తగ్గించారు. ఇలా విడుదలైన వారిలో ఎవరైనా మళ్ళీ చట్టాన్ని ఉల్లంఘిస్తే వారు తిరిగి తమ అసలు శిక్షా కాలాన్ని పూర్తిగా అనుభవించాల్సి వుంటుందని ప్రభుత్వం విడుదలచేసిన ప్రకటన పేర్కొంది. ప్రభుత్వాన్ని లేదా మిలటరీని విమర్శిస్తే వారికి మూడేళ్ళపాటు జైలుశిక్ష విధించడం పరిపాటి. చాలా మంది రాజకీయ ఖైదీలు ఇలా జైళ్లకు వచ్చినవారే.

మోసం కేసులో దోషిగా భారత సంతతి వైద్యుడు

న్యూయార్క్ : ఆరోగ్య సంరక్షణలో మోసాలకు పాల్పడిన కేసులో భారత సంతతి వైద్యుడ్ని అమెరికా ఫెడరల్ జ్యూరీ దోషిగా నిర్ధారించింది. పెన్సిల్వేనియాలోని బెన్సాలెంకు చెందిన 48 ఏళ్ల నీల్ కె. ఆనంద్ రోగులకు అనవసరమైన ప్రిస్క్రిప్షన్, చట్టవిరుద్ధంగా నియంత్రిత పదార్థాలను పంపిణీ చేస్తున్నట్లు రుజువయింది. అమెరికా ఆఫీస్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఒపిఎం) అందించే ఆరోగ్య పథకాలు, ఇండిపెండెన్స్ బ్లూ క్రాస్ (ఐబిసి) అందించే వైద్య సహాయంలో డాక్టర్ నీల్ కె. ఆనంద్ ఈ మోసాలకు పాల్పడేవాడు. తన యాజమాన్యంలోని ఇన్-హౌస్ ఫార్మసీ ద్వారా డాక్టర్ ఆనంద్ ఈ ప్రిస్క్రిప్షన్, మందులు రోగులకు పంపిణి చేసినట్లు అమెరికా న్యాయశాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

భోగాపురం నుంచి విమానం ఎగిరేనా?

మరో 15 నెలల్లో విమానాశ్రయం ప్రారంభోత్సవంపై నీలినీడలు

ప్రధాన పనుల కోసం సేకరించిన భూమికి నేటికి అందని పరిహారం



కొనసాగుతున్న ప్రధాన టెర్మినల్ భవనం పనులు

ప్రజాశక్తి–భోగాపురం (విజయనగరం జిల్లా)

భోగాపురం విమానాశ్రయం నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ 2026 జూన్ నాటికి మొదటి విమానం ఎగురుతుందని ప్రభుత్వం ఖరాఖండిగా చెబుతున్నా ఆ నాటికి ప్రారంభోత్సవం అవుతుందో లేదోనన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. విమానాశ్రయం లోపల పనులు వేగంగా జరుగుతున్నప్పటికీ విమానాశ్రయానికి వెళ్లేందుకు అవసరమైన ప్రధాన రహదారి పనులు నత్తనడక సాగుతున్నాయి. హైవేపై నిర్మించాల్సిన వంతెన నిర్మాణానికి సంబంధించి సేకరించిన భూమికి నష్ట పరిహారం ఇంకా ఇవ్వలేదు. దీంతో ఈ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. విద్యుత్ సరఫరా చేసే సబ్‌స్టేషన్ నిర్మాణానికి సేకరించిన భూమికి, అలాగే భద్రతా సిబ్బంది నివాస గృహాలకు సంబంధించి సేకరించిన భూమికి పరిహారం ఇంకా రైతుల ఖాతాల్లో జమకాలేదు. నందిగాం వద్ద నిర్మించిన తాగునీటిని సరఫరా చేసే ప్లాంటు వద్ద నేటికీ విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. విమానాశ్రయం ప్రారంభోత్సవానికి గడువు మరో 15 నెలలే ఉంది. ఇవన్నీ పూర్తి చేస్తేనే అనుకున్న సమయానికి విమానం ఎగురుతుంది. ఈ సమస్యలను అధిగమించి అనుకున్న సమయానికి ప్రారంభోత్సవం జరుగుతుందా? అనే దానిపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

హైవేపై నేటికి నోచుకోని ప్రధాన రహదారి వంతెన పనులు

ప్రధానంగా ఇటు విశాఖ, విజయనగరం వైపు నుంచి అటు శ్రీకాకుళం నుంచి వచ్చేవారు విమానాశ్రయానికి వెళ్లాలంటే హైవేపై ఉప్పాడపేట జంక్షన్ వద్ద ట్రంపెట్ ఆకారంలో వంతెన నిర్మించాల్సి ఉంది. ఇదే విమానాశ్రయానికి ప్రధానమైన కనెక్టవిటీ రహదారి. కాని, నేటికీ ఇక్కడ పనులే ప్రారంభం కాలేదు. ఇది పూర్తయితేనే విమానాశ్రయానికి వెళ్లేందుకు వీలుపడుతుంది. ఇక్కడ హైవేను ఆరు లైన్లుగా విస్తరించిన సమయంలో విమానాశ్రయానికి వెళ్లేందుకు కేవలం బ్రిడ్జి నిర్మించి వదిలేశారు. ఇక్కడ సుమారు 13 ఎకరాలను భూమిని గతంలో సేకరించారు. ఇందులో ఒకవైపు సేకరించిన భూములకు హైవే అథారిటీ సంస్థ, విమానాశ్రయం వైపు వెళ్లే భూములకు ప్రభుత్వం పరిహారం ఇచ్చేందుకు అప్పట్లో నిర్ణయించారు. అయితే, ఇక్కడ భూముల విలువ అధికంగా ఉండడంతో ఇప్పుడంత పరిహారం ఇవ్వలేమని హైవే అథారిటీ సంస్థ చేతిలెత్తేసింది. దీంతో ఈ భారం కూడా ప్రభుత్వం పైనే పడింది. చివరకు ఇటీవల ఇందులో ఆరు ఎకరాలకు పరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. ఇంకా రైతుల ఖాతాల్లో జమ చేయలేదు. మిగతా భూమికి పరిహారం ఎప్పుడు వేస్తారో? ఆఘమేఘాలపై జరగాల్సిన ట్రంపెట్ వంతెన పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో? తెలియని పరిస్థితి నెలకొంది.

పరిహారం ఇచ్చేదెప్పుడు... పనులు ప్రారంభమయ్యేదెప్పుడు?

సబ్‌స్టేషన్, భద్రతా సిబ్బంది నివాస గృహాలకు సంబంధించిన భూమికి ఇంకా రైతుల ఖాతాల్లో నష్ట పరిహారం జమకాలేదు. ముక్కాం వెళ్లే రహదారిలో కొండ్రాజుపాలెం సబ్‌స్టేషన్ వద్ద సుమారు రెండేళ్ల కిందట భూసేకరణ చేశారు.

ఇక్కడ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించి విమానాశ్రయానికి విద్యుత్తు సరఫరా చేయాల్సి ఉంది. రైతులకు వారం రోజుల క్రితం పరిహారం వారి ఖాతాల్లో పడింది. కానీ పనులు మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. విమానాశ్రయానికి నిత్యం మూడు షిఫ్టుల్లో పనిచేసే భద్రతా సిబ్బందికి నివాస గృహాలను నిర్మించాల్సి ఉంది. దల్లిపేట పంచాయతీ గాలిపేట వద్ద భూసేకరణ చేశారు. ఇక్కడ కూడా రైతుల ఖాతాల్లో నష్టపరిహారం పడలేదు. విమానాశ్రయానికి తాగునీటిని సరఫరా చేసేందుకు నందిగాం సమీపంలో చంపావతి నదిలో తాగునీటి బావుల నిర్మాణం రెండు నెలలు కిందటే పూర్తయింది. కానీ, ఇక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం సుమారు రూ.3 కోట్లు ఇంకా చెల్లించలేదు. దీంతో, ప్రస్తుతం నీటిని సరఫరా చేసే అవకాశం లేకపోవడంతో ఇటీవల ట్రయల్ రన్ కోసం జనరేటర్‌ను ఉపయోగించాల్సిన పరిస్థితి వచ్చింది. విమానాశ్రయం బయట జరగాల్సిన ఇలాంటి చిన్న చిన్న పనులు కూడా జరగకపోవడంతో విమానాశ్రయం మరో 15 నెలల్లో ఎలా పూర్తవుతుందని పలువురు అంటున్నారు. ఉప్పాడపేట వద్ద ప్రధాన కనెక్టివిటీ రహదారికి అనుసంధానమైన వంతెనను హైవేపై పూర్తి చేయాల్సి ఉంది. ఇన్ని పనులు ఇంకా పెండింగ్‌లో ఉండడంతో వచ్చే జూన్ నాటికి విమానాశ్రయం ప్రారంభంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

'డిఎస్‌సి' విడుదల చేయకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు

- డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న

ప్రజాశక్తి–కడప అర్బన్



కలెక్టరేట్ ఎదుట ఉన్న షాపుల నుంచి భిక్షాటన చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు టిడిపి కూటమి ప్రభుత్వం వెంటనే డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న డిమాండ్ చేశారు. డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగులు గురువారం కడప జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఖాళీ ప్లేట్లతో నిరసన వ్యక్తం చేసి భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేస్తామని డిఎస్‌సి నోటిఫికేషన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి సంతకం చేశారని, కానీ నేటికీ నోటిఫికేషన్ విడుదల కాలేదని తెలిపారు. డిఎస్‌సి విడుదలలో కాలయాపన చేస్తూ టిడిపి కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు. నోటిఫికేషన్ లేక లక్షలాది మంది నిరుద్యోగులు లక్షలాది రూపాయలు వెచ్చించి కోచింగ్ తీసుకుంటున్నారని తెలిపారు. వెనుకబడిన రాయలసీమ లాంటి ప్రాంతంలో ఉద్యోగాలు రాక వలస బాట పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరణాల శివకుమార్, నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

పక్షులపై విషప్రయోగం

- దేవుదల ఉన్నత పాఠశాలలో మరణించిన కాకులు, పావురాలు
- స్వల్ప అస్వస్థతకు గురైన విద్యార్థులు

ప్రజాశక్తి– రేగిడి (విజయనగరం జిల్లా)



పాఠశాల ఆవరణంలో మృతి చెందిన పక్షులు

విజయనగరం జిల్లా రేగిడి మండలంలోని దేవుదల జెడ్‌పి ఉన్నత పాఠశాలలో కాకులు, పావురాలను పట్టుకునేందుకు పాలకొండ నుంచి వచ్చిన నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు గురువారం క్లాస్ రూమ్‌ల వద్ద, చెట్లపైన విషంతో కూడిన పౌడర్ చల్లడంతో కాకులు, పావురాలు మృతి చెందాయి. ఈ విష ప్రయోగంతో కొందరు విద్యార్థులు సైతం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్నం భోజనంలో ఈ విషం కలిసిందేమోనన్న అనుమానంతో పాఠశాలలో చదువుతున్న 121 మంది విద్యార్థులు భోజనం తినేందుకు నిరాకరించారు. దీంతో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాఠశాల చుట్టూ పరిశీలించారు. చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు పాఠశాల గ్రౌండ్‌లోనూ ఎక్కడపడితే అక్కడ కాకులు, పావురాలు మృతి చెంది ఉండటాన్ని గమనించారు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాగ్యలక్ష్మి ఫిర్యాదు చేశారు. స్థానిక వైసిపి నాయకులు కుప్పిలి గవరయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకొని పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారంతా గాలింపు చేయగా నలుగురు గుర్తు తెలియని వ్యక్తుల్లో ముగ్గురు తప్పించుకోగా ఒకరిని పట్టుకున్నారు. అతనిని పోలీసులకు అప్పగించారు.

పొగాకు రైతుల నిరసన

- ధర దక్కలేదని తగలబెట్టిన వైనం

ప్రజాశక్తి–మద్దిపాడు (ప్రకాశం జిల్లా)



జాతీయ రహదారిపై పొగాకును తగలబెడుతున్న రైతులు

తెల్లబర్లీ పొగాకుకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదంటూ వాటిని తగలబెట్టి రైతులు నిరసన తెలిపారు. నకరికల్లు, నూజెండ్ల, దొనకొండ, సంతమాగులూరు, ఈపూరు, వినుకొండ తదితర మండలాల నుంచి పొగాకు బేళ్లను మద్దిపాడు వేలం కేంద్రానికి గురువారం రైతులు తీసుకువచ్చారు. వేలం జరిగే క్రమంలో బొమ్మిడాల కంపెనీ పలు షరతులు విధించింది. వేలం జరిగేటప్పుడు రైతులు ఉండరాదని, అలా ఉంటే తాము కొనుగోలు చేయలేమని చెప్పింది. దీంతో రైతులందరూ వేలం కేంద్రం నుంచి బయటకు వచ్చారు. మొత్తం 600 బేళ్లలో 500 బేళ్లను కొనుగోలు చేసేందుకు కంపెనీ వారు నిరాకరించారు. మిగిలిన బేళ్లను కేజీ చొప్పున రూ.40 నుంచి రూ.60గా ధర నిర్ణయించింది. దీంతో రైతులు ఆగ్రహించారు. కంపెనీ వారు చెబితేనే వేలం కేంద్రం వద్దకు పొగాకును తీసుకువచ్చామని, తీరా ఇక్కడికి వచ్చిన తర్వాత కొనుగోలు చేయకుండా ధర తగ్గించడం దారుణమని మండిపడ్డారు. తమకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ మద్దిపాడు–వెల్లంపల్లి గ్రామాల మధ్య జాతీయ రహదారిపై రైతుల ఆందోళనకు దిగారు. పొగాకు బేళ్లను రహదారిపైకి తీసుకువచ్చి తగలబెట్టారు. విషయం తెలుసుకున్న మద్దిపాడు పోలీసులు రైతులతో మాట్లాడి.. ఆందోళన విరమింపజేశారు.

రేపు శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల జూలై కోటా విడుదల

ప్రజాశక్తి – తిరుపతి డెస్క్

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల జూలై నెల కోటాను శనివారం టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల లక్కీ డిప్ రిజిస్ట్రేషన్ కోసం ఏప్రిల్ 19 ఉదయం 10 గంటల నుండి 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. లక్కీ డిప్ ద్వారా ఈ టికెట్లు పొందిన యాత్రికులు ఏప్రిల్ 21 నుండి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లిస్తే వారికి టికెట్లు మంజూరవుతాయి. 22న ఆర్జిత సేవా టికెట్లను, 23న అంగప్రదక్షిణం టోకెన్లను, శ్రీవాణి టికెట్ల ఆన్‌లైన్ కోటాను, వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటాను, 24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

విద్యుత్ రంగానికి చీకటి రోజులు

- వైసిపి ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ విమర్శ
- ప్రజలపై రూ.15,485 కోట్ల భారం

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్ రంగానికి చీకటి రోజులు వచ్చాయని వైసిపి ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ విమర్శించారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఛార్జీలు పెంచబోమని చెప్పిన టిడిపి అధినేత చంద్రబాబు ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యాక ప్రజలపై ఏకంగా రూ.15,485 కోట్ల భారం వేశారని తెలిపారు. వాడుకున్న విద్యుత్ కంటే బిల్లు ఎక్కువ వస్తోందని, ఏడాదైనా గడవకముందే భారాలు మోపుతున్నారని అన్నారు. గత ఏడాదితో పోలిస్తే 50 శాతం ఎక్కువగా కరెంటు ఛార్జీలు పెరిగాయని తెలిపారు. ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేస్తామని చెప్పి వంచించారని, మరోవైపు టైమ్ ఆఫ్‌ది డే, విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో దొడ్డిదారిన బిల్లులు పెంచి వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. సాయంత్రం ఆరుగంటల నుండి పదిగంటల వరకూ ఒకరేటు, మిగిలిన సమయంలో మరోరేటుతో వినియోగదారులపై ఎనలేని భారాలు మోపుతున్నారని పేర్కొన్నారు. ప్రతి యూనిట్‌పై రూ.0.40 భారం వేస్తున్నారని అన్నారు. చిరువ్యాపారుల పరిస్థితి మరీ ఘోరంగా తయారైందని యూనిట్‌కు రూపాయి వరకూ భారం వేస్తున్నారని వివరించారు. ప్రజలపై వేసే భారాలను ముక్కలు ముక్కలుగా చేసి వసూలు చేయాలని చంద్రబాబు ప్లాను చేశారని అన్నారు. 2014–19లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో యూనిట్ విద్యుత్‌కు రూ.4.84కు ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. సోలార్ ఎనర్జీలో 35 పిపిఏలు, విండ్ పవర్‌లో 133 పిపిఏలు చేసుకున్నారని పేర్కొన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత రూ.2.49కే ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. సెకీతో ఒప్పందం చేసుకోకపోయి ఉంటే ప్రజలపై రూ.50 వేల కోట్ల భారం పడేదని అన్నారు. చంద్రబాబు పాలనలో డిస్కమ్‌లు నష్టాల పాలయ్యాయని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్
- పలు జిల్లాల్లో మున్సిపల్ కార్మికుల ఆందోళనలు


ప్రజాశక్తి–యంత్రాంగం



విజయవాడ నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

మున్సిపాల్టీ, కార్పొరేషన్, నగర పంచాయతీల్లో పనిచేసే మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంటే భవిష్యత్తులో పోరాటాన్ని చవిచూడాల్సి ఉంటుందని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ హెచ్చరించింది. సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా పలుజిల్లాల్లో ఆందోళనలు చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఆప్కాస్‌ను రద్దు చేసి మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించవద్దని, మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ చెల్లించాలని, పనిముట్లు, సేఫ్టీ పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో అధికారులతో చర్చల సందర్భంగా కుదుర్చుకున్న నిర్ణయాలకు జిఒలు విడుదల చేయాలన్నారు. విజయవాడ నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం విఎంసిలోని అన్ని విభాగాల అధికారులకు వినపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షుడు ఎస్.జ్యోతిబసు, నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ పాల్గొని మాట్లాడారు. విశాఖలోని జివిఎంసి జోనల్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టారు. జివిఎంసి జోన్ 4 కార్యాలయం ఎదుట జరిగిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సంఘం అధ్యక్షులు టి.నూకరాజు మాట్లాడారు. భీమిలి, మధురవాడ, వేపగుంట ప్రాంతాల్లోని జోనల్ కార్యాలయాల ఎదుట నిరసనలు తెలిపి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద, పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నాలు చేశారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలోని పలు మున్సిపాల్టీల్లో కార్మికులు నిరసన తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ధర్నా నిర్వహించారు.

త్వరలో కెనడాలో ఆర్థిక మాంద్యం..!



అటావా : అమెరికా ప్రేరేపించిన వాణిజ్య యుద్ధం తమ దేశంలో తీవ్ర ప్రతికూలతలను చూపనుందని బ్యాంక్ ఆఫ్ కెనడా ఆందోళన వ్యక్తం చేసింది. అధిక టారిఫ్‌లతో నెలకొన్న తీవ్ర అనిశ్చితి కారణంగా ఈ ఏడాది ద్వితీయార్థంలో తమ దేశం ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొనే అవకాశాలున్నాయని అంచనా వేసింది. ట్రంప్ వాణిజ్య విధానాలతో కెనడాతో పాటు ప్రపంచ వృద్ధి తాత్కాలికంగా బలహీనపడుతుందని పేర్కొంది. కెనడాలో ద్రవ్యోల్బణం పెరగనుందని ఆందోళన వ్యక్తం చేసింది.

సుంకాలు దీర్ఘకాలిక ప్రపంచ వాణిజ్య యుద్ధానికి దారితీయడం ద్వారా కెనడా భారీ మాంద్యంలోకి ప్రవేశించనుందని పేర్కొంది. మార్చి త్రైమాసికంలో జిడిపి 1.8 శాతానికి తగ్గొచ్చని పేర్కొంది. ఇంతక్రితం 2 శాతం వృద్ధి అంచనాతో పోల్చితే తక్కువేనని తెలిపింది. మాంద్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వ వ్యూహాత్మక ఆర్థిక జోక్యాలు అవసరమని సూచించింది.

రూ.7500 కోట్ల నిధుల సేకరణకు ఆమోదం

- ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ వెల్లడి

ముంబయి : రూ.7500 కోట్ల నిధుల సమీకరణకు తమ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపిందని ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ వెల్లడించింది. గ్లోబల్ గ్రోత్ ఇన్వెస్టర్ వార్‌బర్గ్ పింకస్ ఎల్ఎల్‌సి అనుబంధ సంస్థ అయిన కరెంట్ సి ఇన్వెస్ట్‌మెంట్స్ బివికి సుమారు రూ.4,876 కోట్ల విలువైన ఈక్విటీ క్యాపిటల్ (సిసిపిఎస్) ప్రిఫరెన్షియల్ ఇష్యూను, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఎడిఐఎ) అనుబంధ సంస్థ అయిన ప్లాటినం ఇన్విక్టస్ బి 2025 ఆర్ఎస్ సి లిమిటెడ్‌కు సుమారు రూ.2,624 కోట్లు విలువైన ఈక్విటీ క్యాపిటల్ (సిసిపిఎస్) ప్రిఫరెన్షియల్ ఇష్యూను జారీ చేయనున్నట్లు పేర్కొంది. ప్రతిపాదిత ఇష్యూల జారీ వాటాదారులు, నియంత్రణ ఆమోదాలకు లోబడి ఉంటాయని వెల్లడించింది.

తెలుగు రాష్ట్రాల్లో షోరూంలను విస్తరిస్తాం

- ఓయిలర్ మోటార్స్ వాణి రిఖీ వెల్లడి

ప్రజాశక్తి – హైదరాబాద్

కార్గో విద్యుత్ వాహనాల తయారీలో ఉన్న ఓయిలర్ మోటార్ తెలుగు రాష్ట్రాల్లో తమ విక్రయ కార్యకలాపాలను మరింత విస్తరించనున్నట్లు ఆ సంస్థ సేల్స్ అండ్ మొబిలిటీ వైస్ ప్రెసిడెంట్ వాణి రిఖీ మెహ్రా తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం తమకు హైదరాబాద్‌లో మూడు, విజయవాడ, నెల్లూరులో ఒక్కటి చొప్పున షోరూంలు ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాదిలో ఇక్కడ మరో 10 అవుట్‌లెట్‌లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం తమ పోర్టుపోలియోలో త్రిచక్ర ఎలక్ట్రిక్ కార్గో రిక్షా, మరో నాలుగు చక్రాల ట్రక్ ఇవి ఉందన్నారు. తమ పవర్‌ఫుల్ రిక్షా సింగిల్ చార్జింగ్‌తో 120 కిలోమీటర్ల మేర ప్రయాణించగలదన్నారు. దీని ధరను రూ.4.5 లక్షలుగా తెలిపారు. ట్రక్ 1.2 టన్ను సరుకు సరఫరా సామర్థ్యం కలిగి ఉందన్నారు. దీని ధర రూ.9 లక్షల నుంచి ప్రారంభమవుతుందన్నారు.

ఇన్ఫోసిస్ లాభాల్లో 12 శాతం పతనం

బెంగళూరు : దేశంలోనే రెండో అతిపెద్ద ఐటి కంపెనీ ఇన్ఫోసిస్ ఆర్థిక ఫలితాలు నిరాశజనకంగా చోటు చేసుకున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం (2024–25) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 12 శాతం పతనంతో రూ.7,033 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.7,969 కోట్ల లాభాలు సాధించింది. ఇదే సమయంలో రూ.37,923 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ4లో 8 శాతం పెరిగి రూ.40,925 కోట్లకు చేరింది.

ప్రస్తుత 2025–26 రెవెన్యూలో 0–3 శాతం వృద్ధి నమోదయ్యే అవకాశాలున్నాయని ఆ కంపెనీ అంచనా వేసింది. 2024–25కు గాను ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.22 చొప్పున తుది డివిడెండ్‌ను ప్రకటించింది.

దలాల్ స్ట్రీట్‌లో కొనసాగిన జోష్

- సెన్సెక్స్ 1500 పాయింట్ల ర్యాలీ

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు కొనుగోళ్ల మద్దతుతో పరుగులు పెట్టాయి. గురువారం ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. కాసేపట్లోనే లాభాల వైపు సాగాయి. ఆ తర్వాత ఎక్కాడ తగ్గకుండా అన్ని రంగాల సూచీలకు మద్దతు లభించింది. తుదకు బిఎస్ఇ సెన్సెక్స్ 1509 పాయింట్లు లేదా 1.96 శాతం పెరిగి 78,553కు చేరింది. ఆసియాలోనే అత్యంత పురాతనమైన బిఎస్ఇ తన 150వ వార్షికోత్సవం వేళ భారీగా లాభపడటం విశేషం. ఎన్ఎస్ఇ నిఫ్టీ 414 పాయింట్లు లేదా 1.8 శాతం పెరిగి 23.852 వద్ద ముగిసింది. టెలికాం, పిఎస్‌యు, బ్యాంక్, ఆయిల్, గ్యాస్, ఫార్మా, ఆటో, ఎనర్జీ, ప్రయివేటు బ్యాంక్ రంగాల సూచీలు 2 శాతం వరకు పెరిగాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 0.5 శాతం చొప్పున లాభపడ్డాయి.

వర్మి కంపోస్టుపై అవగాహన అవసరం

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఇడి అర్జున్‌రావు

ప్రజాశక్తి – ఉంగుటూరు (ఏలూరు జిల్లా)

అన్ని రకాల చెత్తను వేరు చేసి, వాటిని సంపద తయారీ కేంద్రాల ద్వారా వర్మి కంపోస్టును తయారు చేసేలా పంచాయతీలు దృష్టి సారించాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ (ఎస్ఎసి) కార్యనిర్వహణ డైరెక్టర్–2 డాక్టర్ ఎ.అర్జున్‌రావు అన్నారు.

ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు సంపద తయారీ కేంద్రాన్ని పలు శాఖల అధికారులు, జిల్లా కో ఆర్డినేటర్లతో కలిసి ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అర్జున్‌రావు మాట్లాడుతూ గతంలో జరిగిన పొరపాట్లు మళ్లీ జరగకుండా చూడాలన్నారు. గ్రామాల్లో చెత్తను ఎస్‌డబ్ల్యూపి షెడ్డుకు వచ్చేలా క్లాప్ మిత్ర, గ్రీన్ అంబాసిడార్లతో పంచాయతీ కార్యదర్శులు సమన్వయం చేసుకోవాలని తెలిపారు.

వర్మి కంపోస్టుపై ప్రతి గురువారం సచివాలయాల్లో వ్యవసాయ శాఖ సహాయకుల ద్వారా రైతులకు అవగాహన కల్పించి పొలాల్లో సేంద్రీయ ఎరువుగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తద్వారా మందులు లేని స్వచ్ఛమైన ఆహార ఉత్పత్తులతో అందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. గ్రామ సర్పంచ్ బండారు సింధు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్, విస్తరణ అధికారి చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి బి.రవిచంద్రకుమార్ పాల్గొన్నారు.

పాస్టర్లకు గౌరవ వేతనం విడుదల

- మంత్రి ఎన్ఎండి ఫరూక్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పాస్టర్లకు గౌరవ వేతనం చెల్లించేందుకు ప్రభుత్వం రూ.30 కోట్లు మైనార్టీ సంక్షేమ శాఖకు విడుదల చేసినట్లు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. 2024 మే నుంచి నవంబరు వరకూ 7 నెలల పాటు గౌరవ వేతనం చెల్లింపునకు ఈ మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. రాష్ట్రంలో 8,427 మంది పాస్టర్లకు త్వరలోనే క్రిస్టియన మైనార్టీ కార్పొరేషన్ నుంచి గౌరవ వేతనం అందజేయనున్నట్లు తెలిపారు.

ప్రత్యేక మేజిస్ట్రేట్‌లకు గౌరవ వేతనం పెంపు

ప్రత్యేక జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ (క్లాస్ 2)ల గౌరవ వేతనాన్ని పెంచినట్లు న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఉత్తర్వులను న్యాయశాఖ జారీ చేసినట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

పెంచిన గౌరవ వేతనం వివరాలు వెల్లడిస్తూ... ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ గౌరవ వేతనాన్ని నెలకు రూ.30 వేలు నుంచి 45 వేలకు పెంచినట్లు, అదేవిధంగా రవాణా వ్యయం చెల్లింపులో భాగంగా నెలకు రూ.5 వేలు మొత్తాన్ని అందిస్తామన్నారు. గౌరవ వేతనం పెంపుదల 2019 ఏప్రిల్ 1వ తేదీ నుంచి వర్తించే విధంగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసినట్లు మంత్రి తెలిపారు.

ప్రొద్దుటూరులో 15 కిలోల బంగారం పట్టివేత

ప్రజాశక్తి – ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరులో భారీగా బంగారం పట్టుబడింది. వాహన తనిఖీల్లో 15 కిలోల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కడప వన్‌టౌన్ సిఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరులోని రామేశ్వరం జాతీయ రహదారిపై పోలీసులు గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ప్రొద్దుటూరు నుంచి తాడిపత్రి వైపునకు వెళ్తున్న కారును తనిఖీ చేయగా అందులో బంగారు ఆభరణాలను గుర్తించారు. ఆభరణాలను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా హైదరాబాద్‌కు చెందిన అనుమోల్ కంపెనీ ప్రతినిధులు మార్కెటింగ్ కోసం తీసుకెళ్తున్నట్లుగా నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న ఆభరణాలను ఆదాయ పన్ను శాఖ, రెవెన్యూ అధికారుల సమక్షంలో వాటి విలువను లెక్కించి జిఎస్‌టి అధికారులకు అప్పగించారు.

'చెత్త నుంచి సంపద కేంద్రం' భేష్

- 16వ ఆర్థిక కమిషన్ బృందం కితాబు

ప్రజాశక్తి – తిరుపతి డెస్క్



తూకివాకంలోని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ పనితీరు బాగుందని 16వ ఆర్థిక కమిషన్ బృందం కితాబిచ్చింది. గురువారం ఉదయం తూకివాకం నందలి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ (చెత్త నుండి సంపద కేంద్రం) ను 16వ ఆర్థిక కమిషన్ బృంద సభ్యులు రిత్విక్ పాండే, అన్నే జార్జ్ మ్యాథ్యూ, కేకే మిశ్రా, అభయ్ మీనన్, ఆదిత్య పంత్, అమృత తదితరులు పరిశీలించారు. ప్లాంట్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ, తడి చెత్త నిర్వహణ, కంపోస్టు, బయో మెథనైజేశన్ ప్లాంట్, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ తదితర యూనిట్ల గురించి ప్రిన్సిపల్ సెక్రటరీ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సురేష్ కుమార్, జె.నివాస్, తిరుపతి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య వివరించారు. నగరంలో ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే సుమారు 25 టన్నుల భవన నిర్మాణ వ్యర్థాలను ఆరు రకాలుగా వేరుచేస్తామని, తడి చెత్త 150 టన్నులు, 75 టన్నులు పొడి చెత్త నిర్వహణ చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే ట్రీటెడ్ వేస్ట్ నీటిని పరిశ్రమలకు విక్రయించడం జరుగుతుందని ఆర్థిక కమిషన్ బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీకాళహస్తి భాను ప్రకాష్ రెడ్డి, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

సంపాదకీయం

పొదుపు.. అప్పు...


దాచుకున్న సొమ్మంతా ఖర్చయిపోయి, సరైన ఉపాధి లేక రోజువారీ ఖర్చుల కోసం సామాన్యుడు ఎడాపెడా అప్పులు చేస్తుండడం ఆందోళనకరం. అపర కుబేరులు 217 మంది జిడిపిలో మూడో వంతు సంపదను అనుభవిస్తుంటే, దాదాపు 142 కోట్ల ప్రజానీకం మిగిలిన సంపదను పంచుకుంటూ... దుర్భర దారిద్ర్యంలో కూరుకుపోతోంది. తాజాగా విడుదలైన రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫైనాన్షియల్ స్టెబిలిటీ రిపోర్ట్‌తోపాటు ఆక్స్‌ఫామ్ సహా అనేక సర్వేలు, నివేదికలు ఈ వాస్తవాలను వెల్లడిస్తున్నాయి. ప్రపంచంలోనే మూడో ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నామని, 2047-వికసిత్ భారత్ అంటూ నిత్యం మోడీ అండ్ కో, గోడీ మీడియా ఊదరగొట్టే ప్రచారం ముంచెత్తుతోంది.

ప్రపంచం మొత్తం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన సందర్భంలో సైతం మన దేశానికి రక్షగా నిలిచింది దేశీయ పొదుపు, దేశీయ మదుపు, దేశీయ మార్కెట్. వాటిలో ప్రధానమైన దేశీయ పొదుపు 2011-12లో 68.2 శాతం ఉంటే, ప్రస్తుతం 60.9 శాతానికి పడిపోయింది. ఏడు శాతానికి పైగా పొదుపు పడిపోవడం ఆందోళనకరం. జిడిపిలో 2011-12లో 23.6 శాతం ఉన్న పొదుపు 2022-23 నాటికి 18.4 శాతానికి పడిపోయింది. దేశ ఆర్థికాభివృద్ధికి భరోసా ఇచ్చే పొదుపు హరించుకుపోవడం ప్రమాద ఘంటికే.

కరోనా తరువాత కోట్లాదిమంది ప్రజల ఉద్యోగాలు పోయాయి. ఉన్నవారికి జీతాల్లో పెరుగుదల రేటు గణనీయంగా పడిపోయింది. కార్పొరేట్, ప్రైవేట్ సంస్థల ఆదాయాలు గణనీయంగా పెరుగుతున్నా... ఉద్యోగుల జీతాల కోసం చేసే ఖర్చు కుంచించుకుపోయినా... ప్రభుత్వాలు మిన్నకుండి పోవడం బాధ్యతా రాహిత్యమే! ఆదాయాలు లేక, ఉద్యోగాలు లేక, ఉన్నా ఎప్పుడు పోతాయో తెలీని అభద్రతా భావంతో ఉన్న సామాన్యుడికి దాచుకునే అవకాశమే ఉండటం లేదు. ఆకాశాన్ని తాకుతున్న ద్రవ్యోల్బణం ఉన్న కొద్దిపాటి ఆదాయాన్ని మింగేయడంతో రోజువారీ అవసరాల కోసం, పిల్లల చదువుల కోసం, వైద్యం కోసం, పాత అప్పులు తీర్చడం కోసం... వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డులు, ప్రైవేటు రుణాలు చేసి, తీర్చలేక నానా అవస్థలు పడుతున్నారు. వ్యక్తిగత రుణాలు స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో 42.9 శాతం ఉన్నాయని ఆర్‌బిఐ గణాంకాలు చెబుతున్నాయి. 2023-24 నుంచి వ్యక్తిగత రుణాలు 30 శాతం పెరిగిపోయాయి. ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి రుణాలు తగ్గిపోవడంతో ప్రైవేటు రుణాలు తీసుకుంటున్న రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉసురు తీసుకుంటున్నారు. మోడీ పాలనలో బలవన్మరణానికి పాల్పడిన అన్నదాతలు నాలుగు లక్షలకు పైగా ఉన్నారని అధికారిక గణాంకాలు చెబుతుండగా, వాస్తవాలు పరిశీలిస్తే అంతకు అనేక రెట్లు అధికం. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ చమురు ధర 40 డాలర్ల వరకూ పడిపోయినా, పెట్రోల్, గ్యాస్ సహా అన్ని ధరలు పెంచేసి, సర్‌ఛార్జీల పేరుతో కేంద్రం భారం మోపడం, జిఎస్‌టి బాదుడు ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోయడమే కదా! ఇంత చేసినా దేశం అప్పులేమైనా తగ్గాయా అంటే అదీ లేదు. 2014 నాటికి రూ.82.74 లక్షల కోట్లుగా ఉన్న స్వదేశీ, విదేశీ అప్పులు....151 శాతం పెరిగిపోయి రూ.208 లక్షల కోట్లకు ఎగబాకాయి. ఈ మొత్తాన్ని దేశంలోని 142 కోట్ల మందికీ వర్తింపజేస్తే సగటున ప్రతి ఒక్కరిపై ఉన్న భారం అక్షరాలా లక్షా 48 వేల రూపాయలు.

కేంద్రం చేసిన అప్పులు దేనికి ఖర్చు చేస్తోంది? దేశంలో ఒక్క భారీ పరిశ్రమ కానీ, భారీ నీటి ప్రాజెక్టు కానీ ఏర్పాటు చేయలేదే! కార్పొరేట్లకు రూ.16.35 లక్షల కోట్ల రుణాల మాఫీకి, రూ.4.53 లక్షల కోట్ల రాయితీలివ్వడం తదితరాలకు..., జాతీయ రహదారులు, విమానాశ్రయాలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించడానికే ఖర్చు చేసింది. అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించిన తరువాత 'నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్' పేరుతో ధారాదత్తం చేసేది మళ్లీ కార్పొరేట్లకే. ఇంత చేస్తున్నా...వీరి సంపద దేశానికేమైనా ఉపయోగపడుతుందా? వీరి అప్పు రూ.87.13 లక్షల కోట్లు. ఇది అన్ని రాష్ట్రాల అప్పుల కంటే అత్యధికం. కేంద్రం, రాష్ట్రాల అప్పు జిడిపిలో 81 శాతం అని, ఇది ప్రమాదకరమని అంతర్జాతీయ సంస్థలు చెబుతున్న మాట. ఈ పేరుతోనే విద్యుత్, ఆస్తి సహా పన్నుల భారం, సంక్షేమ పథకాల కోతకు, హామీల ఎగవేతకు ప్రభుత్వాలు పాల్పడుతున్నాయి. వీటిపై ఉద్యమించాల్సింది 99 శాతంగా ఉన్న ప్రజానీకమే!

మహనీయుల మాట



పెట్టుబడిదారుల లాభాపేక్ష, వారి మధ్య పోటీ వల్ల...పెట్టుబడి కేంద్రీకరణ, ఉపయోగంలో అస్థిరత చోటుచేసుకుని రోజురోజుకూ తీవ్రమైన ఆర్థిక మాంద్యాలు ఏర్పడ్డానికి దారితీస్తుంది. ఈ పోటీ చివరికి శ్రమ వ్యర్థం కావడానికి కారణమౌతుంది. ఆ మేరకు వ్యక్తుల సామాజిక చైతన్యం నీరుగారిపోవడానికి కూడా అది దారితీస్తుంది.

- ఆల్బర్ట్ ఐన్‌స్టిన్,
ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త.

Albert Einstein

వ్యవసాయాన్ని ముంచనున్న సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు!

విశ్లేషణ

కరువు జిల్లాల్లో ఉత్పత్తి అవుతున్న సోలార్, గాలి, హైడ్రో విద్యుత్ ఉత్పత్తి వల్ల ఈ ప్రాంత విద్యుత్ చార్జీలు తగ్గవు. వేల ఎకరాల భూములు కోల్పోయిన గ్రామీణ యువతకు ఈ ప్రాజెక్టులలో ఉద్యోగాలు వచ్చే అవకాశాలు లేవు. కంపెనీలు పొందుతున్న లాభాలు ఇక్కడ ఖర్చు కావు. కానీ వీరి లాభాలన్నీ ఈ జిల్లా అభివృద్ధిలో చూపించి తలసరి ఆదాయం పెరిగిందని పొంతన లేని లెక్కలు చెబుతున్నారు. రైతుల చేతుల్లో వుండాల్సిన భూమి ఇలా కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్ళే వినాశకర సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల వల్ల కరువు ప్రాంతాలు ఎలా అభివృద్ధి అవుతాయో పాలకులను ప్రశ్నించాలి.





వి. రాంభూపాల్

విద్యుత్ లేని ఆధునిక సమాజాన్ని ఊహించలేము. నిత్య జీవితంలో విద్యుత్ వాడకం పెరుగుతున్నది. దానికి తగ్గట్టుగా ఉత్పత్తి పెరగాలి. శాస్త్ర విజ్ఞాన పరిశోధనల ఫలితంగా గాలి, సూర్యరశ్మి, అణుశక్తితో విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. దేశంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌లో 72 శాతం బొగ్గుతో తయారయ్యేది. ఇది చాలా ఖర్చుతో కూడుకోవడమే కాక, పర్యావరణాన్ని కూడా దెబ్బతీస్తుంది. అందుకే గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నాయి. అందుకు ఎవరికీ అభ్యంతరం లేదు. అయితే ఈ గ్రీన్ ఎనర్జీ పేరుతో వ్యవసాయాన్ని బలి పెట్టడాన్ని ప్రశ్నించాలి. గ్రామీణ వ్యవస్థను తీవ్రంగా ఛిద్రం చేసే ఈ సోలార్ ఉత్పత్తి రాష్ట్రాభివృద్ధికా? కార్పొరేట్ల కోసమా? తక్కువ ఖర్చుతో ఉత్పత్తి అయ్యే గాలి, సూర్యరశ్మి విద్యుత్‌ను ప్రభుత్వం ఉత్పత్తి చేయకుండా ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడం మోడీ పాలనా కాలంలో భారీగా పెరిగింది. అదానీ, అంబానీ, టాటా, బిర్లా లాంటి అతి పెద్ద కార్పొరేట్ కంపెనీలు సోలార్ విద్యుత్ ఉత్పత్తిలోకి వచ్చి, కేంద్ర ప్రభుత్వ అండదండలతో రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి తమకు అనుకూలంగా విధానాలను అమలు చేయించుకునే స్థితికి చేరాయి. ఆంధ్ర రాష్ట్రాన్ని తమ ప్రయోగశాలగా మార్చుకున్నాయి. రాష్ట్రంలో వెనుకబడిన రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చాటున లక్షల ఎకరాల భూములను ఈ కంపెనీలు కొనడం లేదా లీజు పద్ధతుల్లో స్వాధీనం చేసుకుంటున్నాయి. వ్యవసాయాన్ని ముంచేందుకు ఈ సోలార్ కంపెనీలు సిద్ధమవుతున్నాయి.

కరువు జిల్లాల్లోనే సోలార్ ప్రాజెక్టులు ఎందుకు?

ప్రజల జీవితాలను ఛిద్రం చేసే కరువును కూడా 'కొందరు' ప్రేమిస్తారని చాలా సంవత్సరాల క్రితం ప్రముఖ జర్నలిస్టు పాలగుమ్మి సాయినాథ్ చెప్పారు. కరువును అవకాశంగా తీసుకుని పెద్ద ఎత్తున అవినీతికి, అక్రమాలకు పాల్పడే అధికారులు, పేదలకు ఇచ్చే బియ్యం అమ్ముకుని కార్లు, బంగ్లాలు కొనే రాజకీయ నాయకులు, కరువు పనుల పేరుతో చేయని పనులకు బిల్లులు పెట్టుకుని కొల్లగొట్టే కాంట్రాక్టర్లు కరువును ప్రేమిస్తారని ఆయన పరిశోధనాత్మకంగా విశ్లేషించారు. ప్రస్తుతం కార్పొరేట్ కంపెనీలు, ప్రభుత్వాలు కరువును ప్రేమిస్తున్నాయి. కరువు నుండి ప్రజలను కాపాడాల్సిన ప్రభుత్వాలు సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా కార్పొరేట్ కంపెనీలను పెంచి పోషిస్తున్నాయి. భూముల నుండి రైతులను ఖాళీ చేయిస్తున్నాయి. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో సగటు వర్షపాతం తక్కువగా వుంటుంది. అందువల్ల వేడి ఎక్కువగా వుంటుంది. సంవత్సరంలో సుమారు 324 రోజులు సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఈ ప్రాంతంలో వుంది. ఇక్కడి పగటి వేడి, రాత్రి, పగలు వీచే గాలులు విండ్ మిల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అత్యంత అనుకూలంగా వున్నాయి. అందువల్ల సోలార్, గాలిమరల విద్యుత్ ఉత్పత్తి గత పది సంవత్సరాల్లో ఈ జిల్లాల్లో భారీగా పెరిగింది. అనంతపురం జిల్లాలో 2022-23 నాటికి డిస్కమ్ (డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్) పరిధిలో 3,755.26 మెగావాట్ల సోలార్ విద్యుత్, 3,693.55 మెగావాట్ల గాలిమరల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న సోలార్ విద్యుత్‌లో 89 శాతం అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల్లోనే తయారవుతుంది. అనంతపురం జిల్లాలో 43 శాతం, కర్నూలు 28, కడప 18 శాతం సోలార్ ఉత్పత్తి అవుతుంది. నీటి పంపింగ్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే ఐదు హైడ్రో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను కూడా ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల్లోనే ఏర్పాటు చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం జరిపిన అన్ని మంత్రివర్గ సమావేశాలు ఈ ప్రాంత భూములను సోలార్, విండ్ మిల్ కంపెనీలకు కేటాయించాయంటే కరువును వారు ఎంతగా ప్రేమిస్తున్నారో తెలుస్తుంది.

ప్రస్తుతం రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న సోలార్, గాలిమరల విద్యుత్ ప్రాజెక్టులు కాకుండా అదనంగా మరో 38 గిగావాట్ల విద్యుత్‌ను సోలార్ ద్వారా ఉత్పత్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఒక గిగావాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి కావాలంటే 5 వేల ఎకరాలు కావాలి. అంటే 38 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి 1,90,000 ఎకరాలు భూమి కావాలి. ఇందుకోసం కర్నూలు జిల్లాలో 31,450 ఎకరాలు, అనంతపురం జిల్లాలో 29,983, కర్నూలు జిల్లాలో 29,549, ప్రకాశం జిల్లాలో 9,630 ఎకరాలు మొత్తం 1,00,612 ఎకరాల సర్వే పూర్తి చేశారు. ఇందులో అదానీ కంపెనీకి 75,000 ఎకరాలు, అంబానీ కంపెనీకి 46,555 ఎకరాల భూమిని ఇవ్వనున్నారు. ఇది కాకుండా అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలో 10 వేలు, కళ్యాణదుర్గంలో 15 వేలు, పుట్టపర్తిలో 15 వేలు, రాప్తాడులో 5 వేల ఎకరాలు సేకరించనున్నారు. ఈ రకంగా భూములు సేకరించడాన్ని ప్రతిపక్షంలో వున్నప్పుడు విమర్శించిన తెలుగుదేశం ప్రస్తుతం అదే ఒప్పందాలను కొనసాగిస్తూ భూ సేకరణకు సిద్ధపడింది.

లీజు పేరుతో భూముల సేకరణ

సోలార్ కంపెనీలు ప్రారంభ రోజుల్లో భూములను కొనుగోలు చేసి విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేవారు. భూముల ధరలు పెరగడంతో పాటు కంపెనీలు కావాలనుకున్నంత భూమి ఒకే చోట సమీకరించుకోవడం కంపెనీలకు కష్టమైంది. దీంతో లీజు ఒప్పందాలు అని కంపెనీలు, ప్రభుత్వాలు కలిసి కొత్త అవతారం ఎత్తాయి. రెవిన్యూ శాఖ మరియు ఎన్.ఆర్.ఇ.డి.సి.ఎ.పి (న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా ప్రభుత్వం ఈ కంపెనీలకు సంపూర్ణంగా తోడ్పడుతున్నది. పంటలు పండకపోవడం, పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ఇప్పటికే కరువు జిల్లాల రైతులు వ్యవసాయం మీద విశ్వాసాన్ని కోల్పోయారు. నిరాశ, నిస్పృహలతో ఈ సోలార్ కంపెనీలకు లీజుకు ఇవ్వడానికి పోటీలు పడుతున్నారు. రైతులకు సాగునీరు ఇచ్చే అవసరం, పంట నష్టపరిహారాలు ఇవ్వాల్సిన అవసరం, గిట్టుబాటు ధరలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు లేకుండా పోతుంది. అందుకే పాలకులు వ్యవసాయ వినాశకరమైన ఈ విధానాన్ని పెంచిపోషిస్తున్నారు.

ఎకరాకు రూ.30 వేలు లీజు, 30 సంవత్సరాల వరకు అని కంపెనీలు ఒప్పందాలు చేసుకుంటున్నాయి. అధికార పార్టీల ఎం.ఎల్.ఎ లు, ఎంపీలు, స్థానిక పలుకుబడి కలిగిన నాయకులు రైతులను మభ్యపెడుతూ భూములు లీజుకు ఇచ్చేటట్లు ఒప్పిస్తున్నారు. రైతుల్లో వున్న సందేహాలు తీర్చకుండానే పెద్ద రైతులు భూములు ఇచ్చారని చెబుతూ మానసిక ఒత్తిళ్ళను పెంచి ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఈ లీజు ఒప్పంద పత్రాలు ఇంగ్లీషులో వుండడమే కాక, కనీసం 20-30 పేజీలు వుంటున్నాయి. ఇందులో వారు ఏం రాసుకున్నారో రైతులకు తెలిసే అవకాశం తక్కువ. కంపెనీలు రైతులతో చేసుకుంటున్న ఈ ఒప్పందాల్లో ప్రభుత్వ బాధ్యత ఏమిటో స్పష్టంగా లేకపోవడం అనేక సందేహాలను కలిగిస్తుంది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి లీజు మొత్తాన్ని పెంచుతామని కంపెనీలు అంటున్నాయి. ఒకవేళ లీజు మొత్తం సకాలంలో ఇవ్వకపోయినా, పెంచకపోయినా కోర్టుకు వెళ్లవచ్చు అని ఈ పత్రాల్లో రాశారు. కంపెనీ కేంద్ర కార్యాలయం ఎక్కడ వుంటే ఆ ప్రాంత కోర్టులో కేసు వేసుకోవాలని ఇందులో వుంది. ఉదాహరణకు అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలంలో లీజు ఒప్పందం చేసుకున్న 'అక్మే (ఎ.సి.ఎం.ఇ) ఉర్జా ఒన్' అనే కంపెనీ కేంద్ర కార్యాలయం హర్యానాలోని గుర్గావ్‌లో వుంది. ఈ కంపెనీపై వివాదం వస్తే సాధారణ రైతు అక్కడికి వెళ్లి కేసు వేయాల్సి వుంటుంది. ఇది ఆచరణ సాధ్యమేనా? లీజుకు ఇచ్చిన రైతు ఆ భూమిని అమ్మినా లేదా వాటాలుగా పంచుకున్నా కొన్నవారు లేదా వాటాదారులు భూమిని స్వాధీనం చేసుకోవడానికి వీలులేదు. కొత్త భూ యజమాని కూడా పాత ఒప్పందానికే కట్టుబడి వుండాలి. వందల మంది రైతుల నుండి తీసుకున్న వేల ఎకరాల భూమిని కంపెనీలు పూర్తిగా చదును చేస్తాయి. హద్దులు చెదిరిపోతాయి. 30 సంవత్సరాల తర్వాత ఎవరి భూమి ఎక్కడుందో గుర్తు పట్టడం అసాధ్యమవుతుంది. 30 సంవత్సరాలు భూమికి దూరమైన వ్యవసాయదారులు తిరిగి వ్యవసాయం చేయడం సాధ్యం కాదు. కావున తమ భూములను కంపెనీలకు అమ్మడం అనివార్యంగా మారుతుంది. ఈ రకంగా వెనుకబడిన జిల్లాల్లోని లక్షల ఎకరాల భూమి ఇలా కొన్ని కంపెనీల చేతుల్లోకి వెళ్ళి లక్షలాది రైతులు నిరాశ్రయులుగా మారతారు. గ్రామీణ వ్యవస్థ ధ్వంసం అవుతుంది.

వందల మంది రైతుల నుండి తీసుకున్న వేల ఎకరాల భూమిని కంపెనీలు పూర్తిగా చదును చేస్తాయి. హద్దులు చెదిరిపోతాయి. 30 సంవత్సరాల తర్వాత ఎవరి భూమి ఎక్కడుందో గుర్తు పట్టడం అసాధ్యమవుతుంది. 30 సంవత్సరాలు భూమికి దూరమైన వ్యవసాయదారులు తిరిగి వ్యవసాయం చేయడం సాధ్యం కాదు. కావున తమ భూములను కంపెనీలకు అమ్మడం అనివార్యంగా మారుతుంది. ఈ రకంగా వెనుకబడిన జిల్లాల్లోని లక్షల ఎకరాల భూమి ఇలా కొన్ని కంపెనీల చేతుల్లోకి వెళ్ళి లక్షలాది రైతులు నిరాశ్రయులుగా మారతారు. గ్రామీణ వ్యవస్థ ధ్వంసం అవుతుంది.

సాగునీటి వనరులను కొల్లగొడుతున్న హైడ్రో గ్రీన్ ఎనర్జీ

పైనుండి నీటిని యంత్రాల మీదకు వేగంగా పడేటట్టు చేసి విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం పాత పద్ధతి. కొత్త సాంకేతికతను ఉపయోగించి కింద నుండి పైకి నీటిని కొట్టేలా వేగంతో విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం ఈ హైడ్రో విద్యుత్ ఉత్పత్తి పద్ధతి. దీని కోసం నీరు కావాలి. కరువు జిల్లాల్లో నీటి వనరులే తక్కువ. ఉన్న కొద్దిపాటి నీటి వనరుల నుండి హైడ్రో విద్యుత్ కంపెనీలకు నీటిని కేటాయిస్తున్నారు. తీవ్ర కరువు వున్న శ్రీసత్యసాయి జిల్లాలో చిత్రావతి నది నుండి అదానీ హైడ్రో కంపెనీకి ఒక టి.ఎం.సి నీటిని కేటాయించారు. అనంతపురం జిల్లా శింగనమల చెరువుకు హంద్రీ నీవా కాలువ నుండి ఒక టి.ఎం.సి నీటిని గత ప్రభుత్వం కేటాయించింది. ఇది తమ ఘనత అని వైసిపి, టిడిపి పోటీలు పడి ప్రచారం చేసుకున్నాయి. అయితే కేటాయించిన ఈ ఒక్క టి.ఎం.సి నీటిని అక్కడ నిర్మిస్తున్న హైడ్రో ప్రాజెక్టుకు కేటాయించారు. ప్రతి సంవత్సరం తప్పనిసరిగా ఈ హైడ్రో కంపెనీలకు నీటిని ఇస్తామని ప్రభుత్వాలు ఒప్పందాలు చేసుకున్నాయి. అంటే రైతుల భూములను, గ్రామ చెరువులను ఎండబెట్టి అయినా ఈ కంపెనీకి నీరు ఇస్తారు.

సోలార్ కంపెనీల వల్ల కరువు జిల్లాలకు ప్రయోజనం ఏమిటి ?

కరువు జిల్లాల్లో ఉత్పత్తి అవుతున్న సోలార్, గాలి, హైడ్రో విద్యుత్ ఉత్పత్తి వల్ల ఈ ప్రాంత విద్యుత్ చార్జీలు తగ్గవు. వేల ఎకరాల భూములు కోల్పోయిన గ్రామీణ యువతకు ఈ ప్రాజెక్టులలో ఉద్యోగాలు వచ్చే అవకాశాలు లేవు. కంపెనీలు పొందుతున్న లాభాలు ఇక్కడ ఖర్చు కావు. కానీ వీరి లాభాలన్నీ ఈ జిల్లా అభివృద్ధిలో చూపించి తలసరి ఆదాయం పెరిగిందని పొంతన లేని లెక్కలు చెబుతున్నారు. రైతుల చేతుల్లో వుండాల్సిన భూమి ఇలా కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్ళే వినాశకర సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల వల్ల కరువు ప్రాంతాలు ఎలా అభివృద్ధి అవుతాయో పాలకులను ప్రశ్నించాలి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

'మధ్యాహ్న భోజనం' ఆకలి తీర్చేలా వుండాలి...

విమర్శ



ఈ పథకం విజయవంతం కావాలంటే ప్రభుత్వం మరింత చిత్తశుద్ధి చూపాలి. ఒక్కో విద్యార్థికి కనీసం రూ.30 కేటాయించి, సన్న బియ్యం, స్థానిక రుచులతో నాణ్యమైన భోజనం అందించాలి. మహిళా సంఘాల ద్వారా కాలేజీల్లోనే వంట వండించడం వల్ల ఆహారం వేడిగా, తాజాగా ఉంటుంది. వారానికోసారి పోషకాహారం గురించి అవగాహన కల్పించాలి. మెనూలో పండ్లు, రాగి జావ, పప్పు రకాలు, పండ్లు జోడించి పోషక విలువలు పెంచాలి. ఇది విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు వారికి చదువుపై ఆసక్తిని పెంచుతుంది.



జంపాల ప్రవీణ్

రాష్ట్రంలోని 475 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పేద విద్యార్థులకు ఉచితంగా డొక్కా సీతమ్మ పేరు మీద మధ్యాహ్న భోజనం అందించాలనేది ప్రభుత్వ సంకల్పం. తద్వారా హాజరు శాతం పెంచడం, డ్రాపౌట్ రేటు తగ్గించడం, విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపరచడం, సామాజిక సమానత్వం అంశాలను ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గతంలో ప్రభుత్వ పాఠశాలలకే పరిమితమైన ఈ పథకాన్ని ఇంటర్మీడియట్ స్థాయికి విస్తరించడం ద్వారా, పేదరికం వల్ల చదువు మానేసే విద్యార్థుల సంఖ్యను తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాది జనవరిలో ఏపీ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించి ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.29.39 కోట్లు, వచ్చే ఏడాదికి రూ.85.84 కోట్ల బడ్జెట్‌ని కేటా యించింది. అయితే ప్రభుత్వం అనుకున్న లక్ష్యాలు ఆచరణలో ఎంతవరకు నెరవేరుతున్నాయో తెలుసు కోవడానికి పీపుల్స్ పల్స్ రీసర్చ్ సంస్థ చేసిన అధ్యయనంలో ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి.

రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రలోని 48 కాలేజీల్లో 1200 శాంపిల్స్‌తో సర్వే నిర్వహించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 15 నుంచి మార్చి 7 వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, వంట సిబ్బంది, తల్లిదండ్రులతో తగిన నిష్పత్తిలో చర్చించి సమగ్ర నివేదిక తయారు చేసింది. సర్వే ప్రకారం మధ్యాహ్న భోజనం ప్రవేశపెట్టిన తర్వాత హాజరు 15 శాతం పెరిగినట్లు తేలింది. "మా అమ్మాయి ఇంట్లో తినకపోయినా కాలేజీలో తింటుందని నమ్మకం" అని శ్రీకాకుళంలో ఓ తల్లి చెప్పింది. కానీ, ఆమె నమ్మకానికి తగ్గట్టుగా కాలేజీలో భోజనం ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది.

ఈ పథకానికి మొదటి పెద్ద సమస్య నిధుల కొరత! ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం ఒక్కో విద్యార్థి భోజనానికి కేటాయించిన రూ.14.50 ధర దేనికీ సరిపోదు. మార్కెట్లో ప్రస్తుత ధరలు చూస్తే, కూరగాయలు కిలో రూ.40-50, నూనె లీటర్ రూ.130, గ్యాస్ సిలిండర్ రూ.1000 వరకు ఉన్నాయి. ఈ ఖర్చులను పరిగణనలోకి తీసుకుంటే, ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్‌తో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం సాధ్యమేనా? అందుకే, కూరలు నీళ్లలా, అన్నం మెత్తగా ఉంటోంది. ఈ నేపథ్యంలో 61.2 శాతం మంది విద్యార్థులు ఇక్కడ తింటున్నామని, 32.5 శాతం మంది అప్పుడప్పుడు తింటామని, 1.3 శాతం మంది అసలు తినడం లేదని చెప్పారు.

"అన్నం చూస్తే ఆకలి పోతోంది, గుడ్డు తప్ప ఏదీ తినలేను" అని కడపలో రమేష్ అనే విద్యార్థి అన్నాడు. అంటే పరిస్థితి ఎలా ఉందో అంచనాకు రావొచ్చు. "ఈ డబ్బుతో కూరలు కొనడమే కష్టం, రుచిగా వండడం ఎలా?" అని వంట సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. పైగా వంట సిబ్బందికి నెలకు కేవలం రూ.3000 జీతం, అది కూడా ఆరు నెలల బకాయిలు చెల్లించలేదు. గ్యాస్ సిలండర్‌కి కూడా ప్రభుత్వం డబ్బులు ఇవ్వడం లేదని, అప్పులు తెచ్చి వండుతున్నామని చెప్తున్నారు. కాబట్టి, పిండి కొద్దీ రొట్టె అన్న సామెతలాగా పథకానికి తగిన నిధులు కేటాయించకుండా ఆశించిన లక్ష్యాలు చేరుకోవడం సాధ్యం కాదనేది స్పష్టం.

రెండో సమస్య జీవో 40లో స్పష్టత లేకపోవడం. సమీప పాఠశాలల్లో వండి కాలేజీలకు తెస్తున్న ఆహారానికి రవాణా ఖర్చులు, పోషకాహార పరిమాణం, తనిఖీ విధానాల గురించి ఈ జీవోలో స్పష్టమైన మార్గదర్శకాలు లేవు. దీంతో పాటు అక్షయ పాత్ర, ఇతర స్వచ్ఛంద సంస్థలు సెంట్రలైజ్డ్ కిచెన్ల నుంచి సరఫరా చేసే ఆహారం కాలేజీకి చేరేసరికి చల్లారిపోతోంది. ప్రతి రోజూ గుడ్డు, ఒకేరకమైన రుచి కలిగిన కూరలు వస్తుండటంతో 66.5 శాతం మంది విద్యార్థులు మెనూలో మార్పులు చేయాలని కోరుకుంటున్నారు. ఒకేరకమైన కూరలు చూస్తే విసుగు వస్తోందని, పండ్లు, రాగి జావ ఇస్తే బాగుంటుందని విద్యార్థులు కోరుతున్నారు. మెనూను కూడా సరిగ్గా పాటించడం లేదని విద్యార్థులు రాష్ట్ర వ్యాప్తంగా ఏకాభిప్రాయంగా చెప్పారు.

ఈ గందరగోళం వల్ల విద్యార్థుల్లో అసంతృప్తి పెరుగుతోంది. 31.4 శాతం కాలేజీల్లో తాగునీరు సరిగా లేదు. 32 శాతం కాలేజీల్లో కూర్చొని తినడానికి సరైన స్థలం లేదు. చాలా చోట్ల నేలపైనే కూర్చుని తినాల్సి వస్తోంది. శుభ్రత, తాగునీరు లేకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

ఈ పథకంలో మరో ప్రధాన సమస్య పర్యవేక్షణ లోపం. 79.8 శాతం మంది విద్యార్థులు తమ కాలేజీల్లో ఎలాంటి తనిఖీలు జరగడం లేదని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పథకం ప్రారంభించిన రోజు హడావిడి చేశారు తప్ప ఆ తర్వాత పట్టించుకోలేదని చెప్పారు. భోజనం విషయంలో తమ సమస్యలను చెప్పుకోవడానికి విద్యార్థులకు కనీసం ఫిర్యాదు చేసే వ్యవస్థ కూడా లేదు.

ఈ పథకం విజయవంతం కావాలంటే ప్రభుత్వం మరింత చిత్తశుద్ధి చూపాలి. ఒక్కో విద్యార్థికి కనీసం రూ.30 కేటాయించి, సన్న బియ్యం, స్థానిక రుచులతో నాణ్యమైన భోజనం అందించాలి. మహిళా సంఘాల ద్వారా కాలేజీల్లోనే వంట వండించడం వల్ల ఆహారం వేడిగా, తాజాగా ఉంటుంది. తమిళనాడులో ఈ విధానం విజయవంతమైంది.

ఆకస్మిక తనిఖీలు, టోల్‌ఫ్రీ నంబర్‌తో ఫీడ్‌బ్యాక్ వ్యవస్థ, సోషల్ ఆడిట్లతో పర్యవేక్షణ బలోపేతం చేయాలి. రాష్ట్ర స్థాయి సలహా కమిటీ, కాలేజీ స్థాయి పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేసి, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఇందులో భాగస్వాములను చేయాలి. డైనింగ్ హాళ్లు, తాగునీరు సౌకర్యాల కోసం స్థానిక దాతలను, సంస్థలను ప్రోత్సహించాలి. కేరళలో స్థానిక సంస్థలు ఇలా సహకరిస్తున్నాయి.

వంట సిబ్బందికి నెలకు రూ.10,000 జీతం, శిక్షణ, యూనిఫామ్, సకాలంలో బకాయిలు చెల్లించాలి. వారానికోసారి పోషకాహారం గురించి అవగాహన కల్పించాలి. మెనూలో పండ్లు, రాగి జావ, పప్పు రకాలు, పండ్లు జోడించి పోషక విలువలు పెంచాలి. ఇది విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు వారికి చదువుపై ఆసక్తిని పెంచుతుంది.

ఈ పథకం డొక్కా సీతమ్మ పేరుప్రతిష్ఠలను పెంచేలా, పేద విద్యార్థుల భవిష్యత్తుకు పునాదిగా నిలవాలి. పథకంలోని లోపాలను సరిదిద్దితే విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి తోడ్పడుతుంది.

/ వ్యాసకర్త పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ రీసెర్చర్ /

జనవాక్యం

విద్యార్థులకు వేదాలు బోధించాలా?

మొన్న 12వ తేదీన భూపాల్ లోని 'నేషనల్ లా ఇన్‌స్టిట్యూట్ యూనివర్శిటీ' నిర్వహించిన ఒక సదస్సులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి పంకజ్ మిట్టల్ మాట్లడుతూ వేదాలను, పురాణాలను, ఇతిహాసాలను, గీతను విద్యార్థులకు పాఠ్యాంశాలుగా బోధించాలని హితవు పలికారు! వాటిలో యువత నేర్చుకోవాల్సిన అంశాలు ఉన్నాయని చెప్పారు! ఒక సుప్రీంకోర్టు న్యాయమూర్తి దేశ ప్రజలకు ఆదర్శంగా ఉండాలి. ఆయన వ్యక్తిగతమైన భావాలను ప్రజలపై రుద్దాలనుకోవడం సరైనది కాదు. ఆయన కోర్టు తీర్పులు ఇచ్చేటపుడు రాజ్యాంగం ప్రకారం తీర్పు ఇస్తారా? లేక వేదాలలో, పురాణాలలో ఏముందో వాటి ప్రకారం తీర్పులిస్తారా? అసలు వేదాలలో, పురాణాలలో ఏముందో ఇలా మాట్లాడేవారికి తెలుసా! వాటి ముఖం ఎపుడైనా చూశారా? లేక కేంద్రంలో ఉన్నవారి మెప్పుకోసమా!!

సైన్సు ఇంతగా పెరిగిన రోజుల్లో, ఇంకా వేదాలు చదవండి, పురాణాలు చెప్పండి అనే వారిని ఆ యా పదవుల నుండి తొలగించాలి. సుప్రీంకోర్టు చాలా ఉన్నతమైనది. అలాంటి స్థానంలో ఉండి ఒక సామాన్య మతవాదిలా మాట్లాడడం ఆ పదవికే మచ్చ. పురాణాలన్నీ కూడా బ్రాహ్మణ ఆధిపత్యాన్ని ప్రచారం చేయటంకోసం, ఆధిపత్యాన్ని నిలపటం కోసం రాసినవి. వేదాల నిండా ఎక్కువ శ్లోకాలు ఇంద్రుడి గురించి ఉంటాయి. ఈయన దేవతలకు అధిపతి. సోమపాన ప్రియుడు. చెరువులు చెరువుల సోమపానం తాగుతాడు. ఒక రాక్షసుడిని చంపేందుకు మూడు చెరువుల సోమపానాన్ని తాగాడట. బహుశా ఆ రోజుల్లో చెరువుల్లో సోమపానం నిల్వ ఉండేదేమో! అతనే చెప్పాలి. ఇంద్రుడు తాగి తాగి రోగమొస్తే, దేవతలు యాగం చేసి రోగం పోగొట్టారట. అంతేకాదు, ఇంద్రుడు మారువేషంలో అహల్యను చెరపట్టాడట. ఇలాంటివన్నీ వేదాల్లో ఉన్నాయి. వీటిని విద్యార్థులకు నేర్పి భావితరాల పౌరులను చెడగొట్టాలనా ఈయన ఉద్దేశం? ఏదైనా ప్రకటన ఇచ్చేటపుడు ఆలోచించాలి. ఎందుకంటే అయన సుప్రీంకోర్టు న్యాయమూర్తి. శాస్త్రీయమైన విద్యను విద్యార్థులకు అందించినపుడే ఈ సమాజం అభివృద్ధి చెందుతుంది.

- నార్నె వెంకట సుబ్బయ్య,
ఎ.పి హేతువాద సంఘం అధ్యక్షులు.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

బెంగాల్ ఉపాధ్యాయులకు ఊరట

న్యూఢిల్లీ : ఇటీవలతొలగించిన పశ్చిమబెంగాల్ ఉపాధ్యాయులకు సుప్రీంకోర్టు గురువారం స్వల్ప ఊరటనిచ్చింది. తాజాగా ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే వరకు వారు బోధన చేసేందుకు అనుమతించింది.

ఆవిష్కరణలకు గ్రహణం !

- కరువైన ప్రభుత్వ ప్రోత్సాహం
- లాభాలే తప్ప ఆధునీకరణను పట్టించుకోని కంపెనీలు
- స్టార్టప్‌లతో దూసుకుపోతున్న చైనా

న్యూఢిల్లీ : నూతన ఆవిష్కరణల విషయంలో దేశం బాగా వెనుకబడి పోతోంది. ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం లభించకపోవడంతో ప్రతిభావంతులైన యువతీయువకులు సైతం ఆ దిశగా ఆలోచించడం లేదు. 'స్టార్టప్ మహాకుంభ్'లో కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఫుడ్ డెలివరీ యాప్స్‌కు రూపకల్పన చేయాలని సలహా ఇచ్చారు. తద్వారా ఆయన నిరుద్యోగ యువతను చౌకగా లభించే కార్మికులుగా మార్చే ప్రయత్నం చేశారు. ఓ వైపు దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు అంతర్జాతీయ కంపెనీలను ఆహ్వానిస్తూ మరోవైపు వారికి చౌకగా సిబ్బందిని సమకూర్చడానికి పాలకులు సిద్ధపడుతున్నారు. 'ఇక్కడికి రండి. ఇక్కడ నిపుణులైన సిబ్బంది, అద్భుతమైన వ్యాపార అవకాశాలు ఉన్నందుకు కాదు. ఇక్కడ కార్మికులు చౌకగా దొరుకుతారు. చట్టాలు సరళంగా ఉంటాయి. అందుకే మా దేశంలో పెట్టుబడులు పెట్టండి' అనేది మన ప్రభుత్వ విధానంగా కన్పిస్తోంది.

చైనాలో దూసుకుపోతున్న తలసరి ఆదాయం

మూడు దశాబ్దాల క్రితం చైనాలో కార్మికులు తక్కువ వేతనాలకే దొరికేవారు. అయితే వారి జీవితాలను మార్చాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రపంచబ్యాంక్ డేటా ప్రకారం 1980లో భారత తలసరి ఆదాయం 266 డాలర్లు కాగా చైనాలో 194 డాలర్లు మాత్రమే. కానీ 2000వ సంవత్సరం నాటికి పరిస్థితులు మారిపోయాయి. మన తలసరి ఆదాయం 1357 డాలర్లకు చేరితే చైనాలో తలసరి ఆదాయం దానిని దాటేసి 4450 డాలర్లకు చేరుకుంది. 2022 నాటికి ఈ వ్యత్యాసం మరింత పెరిగింది. భారత్‌లో తలసరి ఆదాయం 2388 డాలర్లు కాగా చైనాలో 12,720 డాలర్లుగా నమోదైంది.

ముడుపులే ముద్దు

డీప్‌టెక్, సెమీకండక్టర్లు, కృత్రిమ మేధ వంటి రంగాల్లో యువత స్టార్టప్‌లు ప్రారంభించాలని పీయుష్ సూచించారు. సలహాలు బాగానే ఉన్నాయి కానీ ప్రభుత్వం వైపు నుంచి ప్రోత్సాహం మాత్రం నిరాశాజనకంగా ఉంటోంది. సెమీకండక్టర్ల తయారీకి ముందుకు వచ్చిన ఓ విద్యావంతుడు తన స్టార్టప్‌కు పన్ను రాయితీలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కానీ గోయల్ నిర్వహిస్తున్న మంత్రిత్వ శాఖ ఆయన దరఖాస్తును రెండేళ్ల పాటు పెండింగులో పెట్టి చివరికి తిరస్కరించింది. మరికొన్ని అదనపు పత్రాలు ఇవ్వాలంటూ చావు కబురు చల్లగా చెప్పింది. ఈ సమాచారం పంపిన కొన్ని గంటల తర్వాత ఓ వ్యక్తి ఆయన వద్దకు వచ్చి 'పత్రాలను సిద్ధం చేసుకోవడంలో మీరు మా సాయాన్ని తీసుకుంటే మీకు మంచి ఫలితాలు వస్తాయి' అని ప్రలోభపెట్టాడు. దీనర్థం ముడుపులు ఇస్తే పని జరుగుతుంది తప్ప నిబంధనల ప్రకారం కాదు. ఇలాంటి పరిస్థితుల్లో స్టార్టప్‌లు నెలకొల్పడానికి ఎవరు మాత్రం ముందుకు వస్తారు?

పాత మూసలోనే...

అసలు మన స్టార్టప్ వ్యవస్థలోనే ఏదైనా సమస్య ఉన్నదా? డీప్-టెక్ రంగాల్లో ఒకటైన ఆటోమొబైల్ పరిశ్రమను తీసుకుందాం. కొన్నేండ్లుగా కార్ల ధరలు పెరుగుతున్నాయి. అయినప్పటికీ వాటి ఆధునీకరణ జరగడం లేదు. దేశంలోని 60 శాతం కార్లు కేవలం పది జెనరిక్ ఇంజిన్లతోనే నడుస్తున్నాయంటే ఆశ్చర్యం కలుగుతుంది. కంపెనీలు మారుతున్నా, మోడల్స్ మారుతున్నా ఇంజిన్లు మాత్రం అలాగే ఉంటున్నాయి. మరి ఆవిష్కరణలు ఎటు పోతున్నాయి? ఆటోమొబైల్స్‌ను తయారు చేస్తున్నది పెద్ద కంపెనీలే. పరిశోధనలు చేయడానికి కూడా వాటి వద్ద నిధులు లేవా? ఆ కంపెనీలు పదేండ్ల క్రితం కార్లను ఎలా తయారు చేశాయో ఈ రోజు కూడా అదే విధంగా తయారు చేస్తున్నాయి. ఇవాళ అందుబాటు ధరలో ఉన్న మోడల్స్ కూడా పదేండ్ల క్రితం నాటివే. మారుతీ ఆల్టో, స్విఫ్ట్, టాటా... ఇవే కంపెనీలు. మార్కెట్‌లోకి ఏ కొత్త కంపెనీ కూడా విజయవంతంగా అడుగు పెట్టలేకపోయింది.

లాభాల పైనే దృష్టి

మరి చైనాలోనో ? అక్కడ కార్ల తయారీదారుల సంఖ్య 200కు పైనే. అవి అనేక రకాల కార్లను ఉత్పత్తి చేస్తున్నాయి. 600 డాలర్ల ధరతో మొదలుకొని టెస్లా యజమానులు అసూయపడేలా అధిక ధర కలిగిన లగ్జరీ కార్ల వరకూ వాటి కర్మాగారాల్లో తయారవుతున్నాయి. ఇప్పుడు మన దేశంలో అత్యంత చౌకైన ఈవీ కారు ఎంజీ కంపెనీ తయారు చేస్తున్న కామెట్. దీని ప్రారంభ ధరే ఏడు లక్షల రూపాయల నుంచి మొదలవుతుంది. దీన్ని బట్టి చూస్తుంటే కార్ల ఉత్పత్తిదారులు తమ లాభాలను పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నారే తప్ప ఆవిష్కరణలను గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదని అర్థమవుతోంది. చైనా కార్లను భారత మార్కెట్లలోకి అనుమతిస్తే మన కార్ల ముఖం చూసే వారు కూడా ఉండరు.

ముందుచూపుతో ముందడుగు

గతంలో మనం చైనా యాప్‌లను నిషేధించడంలోనూ, ఆ దేశం నుంచి దీపావళి లైట్లను దిగుమతి చేసుకోవడంలోనూ బిజీగా ఉన్నప్పుడు అది అనేక వస్తువులను ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీగా మారింది. సెమీకండక్టర్లు, ఏఐ డ్రోన్లు, ఎలక్ట్రిక్ కార్లు, సోలార్ ప్యానల్స్ వంటి ఉత్పత్తుల తయారీని 2015లోనే లక్ష్యంగా చేసుకుని 'మేడ్ ఇన్ చైనా 2025' ప్రాజెక్టును ప్రారంభించింది. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ ప్రముఖ పోటీదారుగా నిలవడమే దాని ఉద్దేశ్యం. లక్ష్యానికి అనుగుణంగానే ఇప్పుడు ఈ రంగాలన్నింటిలోనూ చైనా అగ్రగామిగా ఉంది. ప్రపంచ దేశాల్లో జరుగుతున్న సౌర ఫలకాల ఉత్పత్తిలో 80 శాతం, లిథియం-అయోన్ బ్యాటరీలు, డ్రోన్లు, సొంత వాణిజ్య వాహనాల ఉత్పత్తిలో 75 శాతం అక్కడే జరుగుతోంది.

ఎంత తేడా?

భారత్ విషయానికి వస్తే 2023లో స్టార్టప్ నిధులలో కేవలం ఐదు శాతం మాత్రమే డీప్ టెక్‌లోకి వెళ్లాయి. అదే చైనా పెట్టుబడులలో 35 శాతం ఆ రంగంలోనే. గతేడాది చైనా పలు హైటెక్ సంస్థలకు పన్నులు, రుసుములు భారీగా మాఫీ చేసింది. గత ఏడాది పరిశోధనలు, అభివృద్ధిపై చైనాలో అయిన ఖర్చు 496 బిలియన్ డాలర్లు. అదే మన దేశంలో ప్రస్తుత బడ్జెట్‌లో దీనికి కేటాయించింది 23.45 బిలియన్ డాలర్లు మాత్రమే. భారతీయ స్టార్టప్‌లు నేటికీ నిధుల కొరతతో ఇబ్బందులు పడుతున్నాయి. ఇక నిబంధనలు, నియంత్రణలు సరేసరి. చైనాలో ప్రభుత్వమే స్టార్టప్ కంపెనీల్లో పెట్టుబడులు పెడుతోంది. ఏ దేశంలో అయినా వ్యాపారానికి అనువైన వాతావరణం కల్పించాలంటే విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు అవసరం. కీలక రంగాల్లో ప్రభుత్వం పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. ఒకప్పుడు మన దేశంలోని నవరత్న కంపెనీలు ఉక్కు నుంచి ఔషధాల వరకూ ఉత్పత్తి చేసేవి. అవి నేటికీ పాఠశాలలు, ఆస్పత్రులు, పార్కులు, టౌన్‌షిప్పులు నిర్వహిస్తున్నాయి.

అక్కడ పిఎస్‌యులు బలోపేతం

ప్రభుత్వ రంగ సంస్థల్లో సమర్థత లోపించిందన్న సాకు చెప్పి ప్రభుత్వం వాటిని విక్రయించుకుంటూ పోతోంది. అయినప్పటికీ అవి మన ఆర్థిక వ్యవస్థకు చేయూత అందిస్తూనే ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో పిఎస్‌యులు రూ.74 వేల కోట్ల డివిడెండ్లు ఇచ్చాయి. ఒక్క కోల్ ఇండియాయే రూ.10 వేల కోట్ల డివిడెండ్ ఇచ్చింది. పిఎస్‌యుల కారణంగానే ఇప్పుడు బెంగళూరు నగరం దినదినాభివృద్ధి చెందుతోంది. లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తోంది. చైనాలో నేటికీ ప్రభుత్వ రంగ సంస్థలు బలంగా ఉన్నాయి. టాప్-10 గ్లోబల్ ఫార్చ్యూన్ కంపెనీల్లో మూడు చైనా పిఎస్‌యులే. 2023లో 135 చైనా కంపెనీలు ఫార్చ్యూన్ 500 జాబితాలో ఉన్నాయి. వీటిలో 85 కంపెనీలు పిఎస్‌యులు కావడం విశేషం.

మన దేశంలో సెమీకండక్టర్ పరిశ్రమ సంగతేమో కానీ పేపర్ లీకేజీల పరిశ్రమ మాత్రం దినదినాభివృద్ధి చెందుతోంది. ఏ పరీక్షలో చూసినా ప్రశ్నాపత్రాల లీకేజీలే కన్పిస్తున్నాయి. ఇక మత విద్వేషాలు వ్యాపింపజేసే పరిశ్రమ కూడా పరిఢవిల్లుతోంది. సామాజిక మాధ్యమాల్లో ఇన్‌ఫ్లుయన్సర్ల హవా నడుస్తోంది. కీలక రంగాల్లో ప్రభుత్వ పెట్టుబడులు నానాటికి తీసికట్టు అన్నట్టు పడిపోతున్నాయి. ఇలాంటి వాతావరణంలో నూతన ఆవిష్కరణలు ఎలా సాధ్యం?

'ఇడి సమన్లు రాజకీయ ప్రతీకార చర్య'



న్యూఢిల్లీ : ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సమన్లు రాజకీయ ప్రతీకార చర్యగా వ్యాపారవేత్త, ప్రియాంకగాంధీ భర్త రాబర్ట్ వాద్రా అభివర్ణించారు. ప్రతిపక్షాల గొంతు అణచివేసేందుకు మోడీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విచారణకు హాజరయ్యారు. ఆయన వెంట భార్య ప్రియాంకగాంధీ కూడా ఉన్నారు. వరుసగా మూడవ రోజు విచారణ కోసం ఇడి కార్యాలయానికి చేరుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. బిజెపియేతర పార్టీల నేతలు లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇడి నిష్పాక్షికత ఏముందని ప్రశ్నించారు. అన్యాయంపై తన పోరాటం కొనసాగుతుందని అన్నారు. గురుగ్రామ్ భూమి కేసులో రాబర్ట్‌వాద్రాకు ఇడి సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. విచారణ కొనసాగుతోందని, తాను 2019లో సమాధానం ఇచ్చిన ప్రశ్నలనే తిరిగి అడిగారని అన్నారు. ఈ కేసులో బిజెపికి చెందిన మాజీ ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తనకు రెండుసార్లు క్లీన్‌చిట్ ఇచ్చారని గుర్తు చేశారు. మళ్లీ సమన్లతో వేధిస్తున్నారని అన్నారు.

22 మంది మావోయిస్టులు అరెస్ట్

- పేలుడు పదార్థాలు స్వాధీనం

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా నుండి మొత్తంగా 22 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నట్లు సీనియర్ పోలీస్ అధికారి గురువారం ప్రకటించారు. వారి నుండి పేలుడు పదార్థాలను కూడా స్వాధీనం చేసుకున్నామని అన్నారు. సిఆర్‌పిఎఫ్‌కి చెందిన కోబ్రా, స్థానిక పోలీసుల బృందం సంయుక్తంగా ఈ ప్రాంతంలో ఆపరేషన్ నిర్వహించినట్లు పేర్కొన్నారు.

ఉసూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని టెక్మెట్ల గ్రామ సమీపంలోని అడవిలో మావోయిస్టులలో దిగువస్థాయి కేడర్‌కి చెందిన ఏడుగురిని మంగళవారం అరెస్ట్ చేశామని ఆ అధికారి తెలిపారు. అదే ప్రాంతంలోని జంగ్లా పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామం నుండి మరో ఆరుగురిని, నెలస్నార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కందకర్కా గ్రామం నుండి తొమ్మిది మంది కార్యకర్తలను అరెస్ట్ చేశామని అన్నారు. వీరంతా 19 నుండి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉన్నారని అన్నారు. వీరి నుండి జెలెటిన్‌స్టిక్స్, టిఫిన్‌బాక్స్ బాంబులు, డిటోనేటర్లు, విద్యుత్ వైర్లు, బ్యాటరీలు, కరపత్రాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఆ అధికారి తెలిపారు.

ముర్షిదాబాద్‌లో పరిస్థితి అదుపులోనే ఉంది : బెంగాల్ ప్రభుత్వం

కోల్‌కతా : ముర్షిదాబాద్ హింసాకాండపై బెంగాల్ ప్రభుత్వం కోల్‌కతా హైకోర్టుకు గురువారం నివేదిక సమర్పించింది. ముర్షిదాబాద్ జిల్లాలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని పేర్కొంది. మత ఘర్షణలు చెలరేగిన ముర్షిదాబాద్ జిల్లాలో బాంబు పేలుళ్లు జరిగాయని, ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ)కి అప్పగించాలంటూ బిజెపి నేత సువేందు అధికారి కోల్‌కతా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సౌమన్ సేన్, జస్టిస్ రాజా బసు చౌదరిలతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం విచారణ చేపట్టింది. ఆ జిల్లాలో అధికార యంత్రాంగం, పోలీసులు తగిన చర్యలు తీసుకున్నారని ఆ నివేదిక పేర్కొంది. బాధిత కుటుంబాలు ఇప్పటికే వారి నివాసాలకు చేరుకున్నారని తెలిపింది.

ముర్షిదాబాద్‌లోని క్షేత్రస్థాయి పరిస్థితుల సున్నితత్వాన్ని పరిగణనలోకి తీసుకుని, అక్కడ సిఎపిఎఫ్ మోహరింపును మరికొంత కాలం పొడిగించాలని కేంద్రం తరపున హాజరైన న్యాయవాది కోర్టును కోరారు. ముర్షిదాబాద్‌లోని సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రస్తుతం 17 కంపెనీల బలగాలను కేంద్రం మోహరించింది.

హార్వర్డ్ యూనివర్శిటీపై ట్రంప్ యంత్రాంగం కక్షసాధింపు

వాషింగ్టన్ : హార్వర్డ్ యూనివర్శిటీపై ట్రంప్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగింది. ట్రంప్ ప్రభుత్వ డిమాండ్లను తోసిపుచ్చడంతో హార్వర్డ్ యూనివర్శిటీకి సుమారు 230 కోట్ల డాలర్ల ఫెడరల్ నిధులను నిలిపివేసిన సంగతి తెలిసిందే. తాజాగా విదేశీ విద్యార్థుల ప్రవేశ అర్హతను రద్దు చేస్తామని హార్వర్డ్ యూనివర్శిటీని యుఎస్ హోంల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ (డిహెచ్ఎస్) బెదిరించింది.

అంతర్జాతీయ విద్యార్థి వీసా కలిగిన వారి చట్టవ్యతిరేక, హింసాత్మక కార్యకలాపాల వివరణాత్మక రికార్డులను ఏప్రిల్ 30లోగా ప్రభుత్వానికి అందించాలని యూనివర్శిటీని హెచ్చరించింది. హార్వర్డ్ యూనివర్శిటీకి 270కోట్ల డాలర్లకు పైగా విలువైన రెండు డిహెచ్ఎస్ గ్రాంట్లను రద్దు చేస్తున్నట్లు హోంల్యాండ్ సెక్యూరిటీ (డిహెచ్ఎస్) కార్యదర్శి క్రిస్టీ నోయెమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తీవ్రవాద భావజాలంతో యూనివర్శిటీ పన్ను మినహాయింపు హోదాను కోల్పోయిందని పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేపట్టిన విద్యార్థుల వివరాలు అందించకుంటే స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్ (ఎస్ఇవిపి) అర్హతను కోల్పోవాల్సి వుంటుందని బెదిరిస్తూ క్రిస్టీ నోయెమ్ యూనివర్శిటీకి లేఖను రాశారు. 800,303 డాలర్ల ఇంప్లిమెంటేషన్ సైన్స్ ఫర్ టార్గెటెడ్ వయిలెన్స్ ప్రివెన్షన్ గ్రాంట్, 1,934,902 డాలర్ల బ్లూక్యాంపెయిన్ ప్రోగ్రామ్ ఎవల్యూషన్ అండ్ వయొలెన్స్ అడ్జెస్ట్‌మెంట్ గ్రాంట్లు రద్దు చేసిన వాటిలో ఉన్నాయని డిహెచ్ఎస్ పేర్కొంది.

బాణసంచా పేలుడులో మరొకరు మృతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)


జల్లూరి నాగరాజు (ఫైల్)

అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో ఈ నెల 13న బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడి విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న జల్లూరి నాగరాజు (58) గురువారం ఉదయం మరణించారు. ఈయన కోటవురట్ల మండలం రాట్నాలపాలెం గ్రామానికి చెందినవారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాగరాజు మరణంతో బాణసంచా పేలుడు సంఘటనలో మృతుల సంఖ్య తొమ్మిదికి చేరింది. ప్రమాదం జరిగిన రోజు ఎనిమిది మంది అక్కడికక్కడే మరణించగా మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు.

వేతనాలు ఇచ్చాకే సమ్మె విరమణ

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు
- 12వ రోజుకు తాగునీటి సరఫరా కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులకు బకాయి పడ్డ వేతనాలు, పిఎఫ్ డబ్బులను ఖాతాల్లో జమ చేసిన తర్వాతనే సమ్మెను విరమిస్తామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్ స్పష్టం చేశారు. శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె గురువారం 12వ రోజుకు చేరుకుంది. అందులో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో తాగునీటి కార్మికులు అనంతపురం ఇపిఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. మండుటెండను లెక్కచేయకుండా కార్మికులు కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ.. కార్మికులు చేసిన పనికి వేతనాలు అడుక్కునే దుస్థితి నెలకొనడం విచారకరం అన్నారు. ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారి వేతనాల కోసం రోడ్డెక్కి ఆందోళన చేసే దుస్థితి ఉందన్నారు. అధికారులు మాత్రం కాంట్రాక్టర్లు చెల్లించాల్సి ఉంటుందని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఒక్కో కాంట్రాక్టర్ ఒక్కో విధంగా పిఎఫ్, వేతన బకాయిలు చెల్లించక ఇబ్బందులు పెట్టారని తెలిపారు. చాలా సందర్భాల్లో సమ్మె కాలపు ఒప్పందాలను ఎవరూ అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. పిఎఫ్ వేతనాలు బకాయి పెట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. బకాయి వేతనాలు, పిఎఫ్ చెల్లించేదాకా విధులకు హాజరయ్యేది లేదన్నారు. ప్రాజెక్టుల వారీగా కార్మికులకు బకాయి పెట్టిన కాంట్రాక్టర్లు శివారెడ్డి, కలాం నాయుడు, శివశంకర్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మూకుమ్మడికి పిఎఫ్ దరఖాస్తులను అధికారులకు అందజేశారు. స్పందించిన ఇపిఎఫ్ కార్యాలయ అధికారి పరిశీలించి కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు, శ్రీ రామిరెడ్డి తాగునీటి కార్మికుల సంఘం అధ్యక్షులు ఎర్రిస్వామి, కార్యదర్శి జి.రాము, కోశాధికారి వన్నూరుస్వామి, మాజీ అధ్యక్షులు రామాంజి, కొండా రెడ్డి, అశోక్, గంగాధర, ప్రకాష్, సంజీవప్ప, తదితరులు పాల్గొన్నారు.

మిక్స్‌డ్‌లో సురుచి-సౌరభ్‌కు స్వర్ణం

లిమా (పెరూ): భారత యువ షూటర్ సురుచి సింగ్ ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్‌లో రెండు స్వర్ణాలతో సత్తా చాటింది. మహిళల 10మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత ఈవెంట్‌లో విజేతగా నిలిచిన సురుచి.. గురువారం జరిగిన మిక్స్‌డ్ ఈవెంట్‌లో సౌరభ్ చౌదరితో కలిసి స్వర్ణం పతకాన్ని చేజిక్కించుకుంది. వ్యక్తిగత ఈవెంట్‌లో సురుచి 243.6 పాయింట్లు స్కోరు చేసి బంగారు పతకం దక్కించుకుంది. 242.3 పాయింట్లతో మనూ భాకర్ రెండోస్థానంలో నిలిచి రజతానికి పరిమితమైంది. చైనా షూటర్ యావో కియాన్‌గ్జున్ కాంస్యం అందుకుంది. ఇక, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్ స్వర్ణ పతక పోరులో 17-9తో చైనా జోడిని ఓడించి పసిడి దక్కించుకుంది.

నీరజ్ చోప్రాకు స్వర్ణం

పోర్చ్‌స్ట్రోమ్(దక్షిణాఫ్రికా): దక్షిణాఫ్రికా వేదికగా జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్స్ పోటీల్లో భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా స్వర్ణ పతకంతో సత్తా చాటాడు. బుధవారం రాత్రి జరిగిన ఫైనల్లో నీరజ్ 84.52మీ. దూరం బల్లెం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. ఆరుగురు త్రోయర్ల మధ్య జరిగిన ఫైనల్లో నీరజ్ ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో దక్షిణాఫ్రికా స్టార్ త్రోయర్ డౌ స్మిత్ 82.44మీ. రెండో స్థానానికి పరిమితమయ్యాడు. ఇక డంకన్ రాబర్ట్‌సన్ 71.22మీ. మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం చేజిక్కించుకున్నాడు. ఈ ఏడాది జరుగుతున్న తొలి అథ్లెటిక్స్ మీట్‌లోనే నీరజ్ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. వ్యక్తిగత బెస్ట్ 89.94మీ. మార్కును మాత్రం చేరుకోలేకపోయాడు. స్మిత్ 83.29మీ. త్రోయర్‌తో నీరజ్‌కు దగ్గరగా వచ్చినా.. అది ఫౌల్ కావడంతో నీరజ్‌కు పతకం ఖాయమైంది. మే 16నుంచి దోహా వేదికగా జరిగే డైమండ్ లీగ్‌లో నీరజ్‌కు కఠినమైన ప్రత్యర్థులు ఎదురుకానున్నారు. అందులో పాకిస్తాన్‌కు చెందిన అర్షాద్ నదీమ్(92.97మీ.) బరిలోకి దిగే ఛాన్స్ ఉంది.

గతేడాది సాయం లేనట్టేనా ?

- 2025 వేట నిషేధ కాలానికే సర్వే
- కోస్తాలో నేడు సర్వే
- 21న సచివాలయాల్లో జాబితా ప్రదర్శన



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

గతేడాదికి సంబంధించిన చేపల వేట నిషేధ పరిహారం వస్తుందని ఎదురుచూసిన మత్స్యకారులు ఆశలు నెమ్మదిగి సడలిపోతున్నాయి. పరిహారం అందిస్తామంటూ టిడిపి కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలలుగా కాలయాపన చేసిన ప్రభుత్వం ఆ విషయం తేల్చకుండానే కొత్తగా సర్వేకు సిద్ధమైంది. ఈ మేరకు ఈ నెల 16న జారీ చేసిన మార్గదర్శకాల్లో 2025 చేపల వేట నిషేధ కాలానికి మాత్రమే పరిహారం అందించనున్నట్లు పేర్కొంది. దీంతో గతేడాదికి సంబంధించిన పరిహారం అందడంపై తీవ్ర స్థాయిలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి 2024 సంవత్సరానికి సంబందించి వేట నిషేధ సాయం కోసం గతేడాది మే రెండో తేదీన మొదటిసారి సర్వే నిర్వహించారు. ప్రాథమికంగా 1,05,385 మందిని అర్హులుగా గుర్తించారు. మత్స్యకారుల జాబితాపై రీ సర్వే చేయాలని టిడిపి ప్రభుత్వం అక్టోబర్‌లో ఆదేశించడంతో, అధికారులు అధికారులు నవంబరులో అదనంగా 17,581 మందితో మరో జాబితా పంపారు. దీంతో మొత్తం 1,22,968 మంది అర్హులుగా తేలారు. తమకు ఆలస్యమైనా పరిహారం అందుతుందన్న ఆశాభావం కొద్దిరోజుల క్రిందటి వరకు వారిలో వ్యక్తమైంది. అయితే, తాజాగా జారీ చేసిన మార్గదర్శకాల్లో గత ఏడాదికి సంబంధించిన మొత్తంపై ఎటువంటి ప్రస్తావన లేకపోవడం, ప్రస్తుత సంవత్సరాన్నే పేర్కొనడం మత్స్యకారుల్లో చర్చనీయాంశంగా మారింది.

నేడు సర్వే... ఒక్కరోజులోనే పూర్తి

ప్రభుత్వం ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజుల పాటు చేపల వేటపై నిషేధం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాదికి సంబంధించి ఈనెల పదో తేదీన జిఒ నంబరు 129 విడుదల చేసింది. చేపల వేటకు దూరంగా ఉంటున్న మత్స్యకారులకు ప్రభుత్వం 61 రోజుల కాలానికి రూ.పది వేలు చొప్పున అందిస్తుండగా, సాయాన్ని ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం రూ.20 వేలకు పెంచింది. వేట నిషేధ సాయానికి అర్హులను గుర్తించేందుకు సర్వే చేపట్టాలని ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల్లో పేర్కొంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా కోస్తా జిల్లాల్లో నేడు (శుక్రవారం-18వ తేది) ఒకే రోజు ఎ సర్వే చేపట్టనున్నారు. గ్రామాల్లో సర్వే చేపట్టేందుకు మత్స్యశాఖ సిబ్బంది, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్, సాగరమిత్రలతో కూడిన బృందాలను ఏర్పాటు చేశారు.

సర్వే పూర్తయిన తర్వాత ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు డేటా వెరిఫికేషన్, నమోదు చేయనున్నారు. తర్వాత 21న గ్రామ, వార్డు సచివాలయాలు గానీ రైతు సేవా కేంద్రాల్లో గానీ ప్రాథమిక జాబితాను ప్రదర్శించనున్నారు. ఈనెల 22, 23న అభ్యంతరాలను స్వీకరించనున్నారు. 23న జిల్లా కలెక్టర్లు వాటికి ఆమోదం తెలపనున్నారు. మత్స్యకారుల ఇకెవైసి డేటాను 24 నుంచి 25 లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈనెల 26న నగదు బదిలీ పథకం ద్వారా పరిహారం డబ్బులను మత్స్యకారుల ఖాతాల్లో జమ చేయనుంది.

ఇవీ మార్గదర్శకాలు...

వేట నిషేధ సాయం పొందేందుకు మెకనైజ్డ్, మోటారైజ్డ్, సంప్రదాయ బోట్లు ఈనెల 14వ తేదీ లోపు రిజిస్టర్ అయి ఈ ఏడాది జూన్‌వరకు లైసెన్స్ కాలపరిమితి ఉండాలని సూచించింది. గతేడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు బోట్లకు ఏమైనా అపరాధ రుసుము విధిస్తే అటువంటి వారిని అనర్హులుగా పేర్కొంది. పరిహారం కోసం వంద లీటర్ల డీజిల్ వాడాలనే నిబంధనను ప్రభుత్వం అమలు చేస్తుందని చర్చ సాగినా, సబ్సిడీ డీజిల్ వినియోగంతో సంబంధం లేకుండా అందరికీ పరిహారం ఇస్తామని తెలిపింది. ఎప్పటిమాదిరిగానే కుటుంబంలో ఒకరికే పరిహారం అందిస్తామని పేర్కొంది. పరిహారం పొందేందుకు మత్స్యకారులు 18 నుంచి 60 ఏళ్ల వయస్సు ఉండాలని పేర్కొంది. ఎన్‌టిఆర్ భరోసా ఫించన్ పొందుతున్న వారిని అనర్హులుగా పేర్కొంది. వేట నిషేధ సాయానికి ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలనే ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం అనుసరించింది. విద్యుత్ వినియోగం, ఆదాయపు పన్ను, ఇంటిలో ఎవరైనా ఉద్యోగం చేస్తున్నా, పల్లం భూమి అయితే మూడెకరాలు, మెట్టు అయితే పది ఎకరాలు వంటి నిబంధనలను అమలు చేసింది.

టారిఫోన్మాదంతో అమెరికాకూ ముప్పే..

- మాంద్యం ముంచుకురావొచ్చు
- ట్రంప్ తీరుపై యుఎస్ ఫెడ్ ఛైర్మన్ ఆగ్రహం

వాషింగ్టన్ : ట్రంప్ వాణిజ్య విధానాలతో అమెరికాకు తీవ్ర పరిణామాలు తప్పవని స్వయంగా ఆ దేశ సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్ జోరోమ్ పావెల్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ అవలంభిస్తోన్న అధిక టారిఫ్‌ల విధానంతో అమెరికాకు తీవ్ర ముప్పేనని అన్నారు. చికాగోలో జరిగిన ఓ కార్యక్రమంలో పావెల్ మాట్లాడుతూ.. ట్రంప్ యంత్రాంగం ఇప్పటి వరకూ ప్రకటించిన సుంకాలు ఊహించిన దానికంటే ఎక్కువగా ఉన్నాయన్నారు. వీటి గురించి ఎలా ఆలోచించాలో కూడా అర్థం కావట్లేదన్నారు. సుంకాల పెంపుతో ద్రవ్యోల్బణం తారాస్థాయికి చేరుకోనుందని హెచ్చరించారు. ట్రంప్ పాలనలో విధానపరమైన మార్పులు తమ కేంద్ర బ్యాంక్‌ను ముంచేశాయని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. టారిఫ్‌ల వల్ల నెలకొన్న అనిశ్చితి ఆర్థిక వ్యవస్థకు శాశ్వత నష్టాన్ని కలిగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలపై భారీ స్థాయిలో సుంకాలతో ట్రంప్ ప్రపంచ వాణిజ్య యుద్ధానికి తెర లేపారు. దీనివల్ల యుఎస్‌లోని కంపెనీలు, పరిశ్రమలపైనా పెను ప్రభావం పడనుండటంతో ట్రంప్ ఆర్థిక విధానాలపై స్వదేశంలోనూ పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పావెల్ వ్యాఖ్యలకు మరింత విశేషం నెలకొంది.టారిఫ్‌ల వల్ల నెలకొన్న అనిశ్చితి ఆర్థిక వ్యవస్థకు శాశ్వత నష్టాన్ని కలిగించే ప్రమాదం ఉందని పావెల్ పేర్కొన్నారు. టారిఫ్‌లను ఇలా పెంచుకుంటూ పోతే ప్రజలు కూడా మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. అటు ఆర్థిక మాంద్యం కూడా మొదలవుతుందని విశ్లేషించారు. స్టాక్ మార్కెట్లు కూడా తీవ్ర ఊగిసలాటకు లోనవుతా యన్నారు. ఉపాధి కల్పన, ద్రవ్యోల్బణ నియంత్రణ వంటి ఫెడ్ లక్ష్యాలకు ట్రంప్ సుంకాలు ముప్పుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలపై ఏప్రిల్ 2న ట్రంప్ అధిక సుంకాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. వివిధ దేశాల నుంచి తీవ్ర వ్యతిరేకత, అమెరికాలోనూ ఆందోళనలు చోటు చేసుకోవడంతో ట్రంప్ తన నిర్ణయాన్ని 90 రోజుల పాటు వాయిదా వేసుకున్నారు. చైనాపై మాత్రం భారీస్థాయిలో సుంకాలు పెంచుకుంటూ పోతున్నారు. రెండు అగ్రదేశాల మధ్య సుంకాల పోరు ప్రపంచ దేశాలను బెంబేలెత్తిస్తున్నాయి.

అనంతపురం - బెంగళూరు రైలుకు గ్రీన్‌సిగ్నల్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లా ప్రజలు అనేక సంవత్సరాల కోరికకు భారత రైల్వే శాఖ స్పందించింది. శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం నుంచి బెంగళూరుకు నడుస్తున్న మెము రైలును అనంతపురం వరకు పొడిగిస్తూ కేంద్ర రైల్వే బోర్డు 2025 ఏప్రిల్ 15న అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం జిల్లా ప్రజల సౌకర్యార్థం ఈ రైలును ఏర్పాటు చేయాలంటూ ఎంపి అంబికా లక్ష్మీనారాయణ పార్లమెంట్‌లో ప్రస్తావించడంతో పాటు రైల్వే మంత్రి, రైల్వే అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. కేంద్ర రైల్వే సహాయ మంత్రి వీరన్న సోమన్నను వ్యక్తిగతంగా కలుసుకుని రైలు ఏర్పాటు అంశంపై మాట్లాడారు. ఈ మేరకు రైల్వే అధికారుల నుంచి అనంతపురం నుంచి రైలు బయలుదేరేలా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ రైలు అందుబాటులోకి వస్తే అనంతపురం నుంచి బెంగుళూరుకు ప్రయాణం చేసే ప్రయాణికులకు ఉపయోగంగా ఉటుంది. ఈ రైలు ఇప్పటి వరకు ఉన్న స్టాపేజ్‌తో పాటు సోమేశ్వర, విధురాశ్వర్థం, కొత్తచెరువు, బసంపల్లి, చిగిచెర్ల, జంగాలపల్లి, ప్రసన్నాయనపల్లి స్టేషన్లలో కూడా ఈ రైలు నిలబడుతుంది. రైలు అనంతపురం స్టేషన్ నుంచి మధ్యాహ్నం 2.10 గంటలకు బయలుదేరి సాయంత్రం 7 గంటలకు బెంగళూరు స్టేషన్‌కు చేరుకుంటుంది. ఈ సందర్భంగా ఎంపి అంబికా మాట్లాడుతూ.. అతి త్వరలోనే కేంద్ర రైల్వే మంత్రి చేతుల మీదుగా అనంతపురం నుంచి రైలును ప్రారంభిస్తామని తెలియజేశారు.

మలయాళ ఉత్తమ నటుడిగా సుకుమారన్



కేరళ తిరువనంతపురం వేదికగా తాజాగా 54వ కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డుల వేడుక జరిగింది. ఈ వేడుకకు మలయాళ చిత్ర పరిశ్రమకు చెందిన నటీనటులు, ప్రముఖులు హాజరయ్యారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు అవార్డులు అందించారు. ఇందులో భాగంగా 'ఆడు జీవితం (ది గోట్‌లైఫ్)' చిత్రానికి గాను పృథ్వీరాజ్ సుకుమారన్ ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్నారు. ఈ చిత్రం మరో తొమ్మిది విభాగాల్లో కూడా అవార్డులు సొంతం చేసుకుంది. ఈ చిత్రంలో సౌదీలో కూలీలు పడే కష్టాలను చూపించారు. బ్లెస్సీ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. మైత్రీ మూవీ మేకర్స్ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేసింది. ఇందులో జిమ్మీ జీన్-లూయిస్, రిక్ అబీ సహా ఇతరులు కీలక పాత్రలు పోషించారు. విజువల్ రొమాన్స్ ఇమేజ్ మేకర్స్, జెట్ మీడియా ప్రొడక్షన్, ఆల్టా గ్లోబల్ మీడియా సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి.

వేసవి బరిలో పలు సినిమాలు

వేసవిలో ఏటేటా పెద్ద కథానాయకుల సినిమాల విడుదలు ఉండేవి. గతేడాది కూడా లేవు. ఈ ఏడాది మే 9న పవన్‌కళ్యాణ్ 'హరి హర వీరమల్లు' సినిమా విడుదల కావాల్సివుంది. గ్రాఫిక్స్ వర్క్ ఇంకా పూర్తి కాలేదని సమాచారం. ఇదే సమయంలో ఆయన కుమారుడు మార్క్ శంకర్ సింగపూర్ పాఠశాలలో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడ్డారు. ఈ క్రమంలో మరికొంత ఆలస్యమయ్యే అవకాశం ఉందని ఇండస్ట్రీలో చర్చ జరుగుతుంది. చిరంజీవి 'విశ్వంభర' సినిమా కూడా ఆలస్యం అవుతోంది. ఇప్పటికే విడుదల తేదీలు ప్రకటించినా మళ్లీ వాయిదాపడుతూ వస్తోంది. కథానాయిక అనుష్క నటించిన 'ఘాటీ' చిత్రం శుక్రవారం విడుదల కానుంది. శర్వానంద్ నటించిన 'నారీ నారీ నడుమ మురారీ' సినిమా మే 16న, వరుణ్‌తేజ్ నటిస్తున్న విటి 15 సినిమా నవంబర్ 14న, సంతోష్‌శోభన్ నటించిన ఎస్‌కెఎన్ సినిమా ఈనెల 30న, అక్కినేని అఖిల్ నటించిన 'లెనిన్' సినిమా నవంబర్ 14న విడుదల కానుంది.

అల్లు అర్జున్‌కు జోడీగా ముగ్గురు కథానాయికలు

అల్లు అర్జున్-తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమాలో ముగ్గురు కథానాయికలు నటించనున్నారు. ఇప్పటికే ప్రధాన కథానాయికగా జాన్వీకపూర్‌తోపాటుగా మిగిలిన ఇద్దరిలో దిశా పటానీ, సమంతలను ఎంపిక చేశారు. సమంత ఫుల్‌లెన్త్ రోల్‌లో నటించే అవకాశం ఉన్నట్లుగా సమాచారం. బాలీవుడ్‌కు చెందిన పెద్ద నటుడిని విలన్‌గా ఎంపిక చేయనున్నట్లుగా తెలిసింది.

అభిషేక్ నాయర్, దిలీప్‌పై వేటు



ముంబయి: భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు (బిసిసిఐ) అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్, ఫీల్డింగ్ కోచ్ దిలీప్‌ను తప్పించింది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా ఘోర పరాజయం నేపథ్యంలో బిసిసిఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఆ సిరీస్‌లో టీమిండియా 1-3 తేడాతో ఓటమిపాలైంది. అయితే, ఈ విషయమై ఇప్పటి వరకు బిసిసిఐ అధికారికంగా స్పందించలేదు. ఎనిమిది నెలల కిందట గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన సమయంలో అభిషేక్ నాయర్‌ను అసిస్టెంట్ కోచ్‌గా బిసిసిఐ నియమించింది. తాజాగా నాయర్‌ను అసిస్టెంట్ కోచ్ బాధ్యతల నుంచి తప్పించింది. ఫీల్డింగ్ కోచ్ దిలీప్‌తో పాటు స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్ సోహమ్ దేశాయ్‌లను సైతం తొలగించినట్లు సమాచారం. 2024 టి20 ప్రపంచకప్ తర్వాత రాహుల్ ద్రవిడ్ పదవీకాలం ముగిసిన తర్వాత బిసిసిఐ గంభీర్‌ను హెడ్‌కోచ్‌గా నయమించింది. న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ సిరీస్‌లో ఓటమిపాలైన టీమిండియా ఏ కోచ్ సితాన్షు కొటక్‌ను బ్యాటింగ్ కోచ్‌గా నియమించింది. ఆ తర్వాత టీమిండియా చాంపియన్స్ ట్రోఫీని గెలిచింది. ఆ సమయంలోనూ అభిషేక్, ర్యాన్ టెన్, మోర్కెల్, దిలీప్ కూడా జట్టు సిబ్బందిగా కొనసాగారు. తాజాగా అభిషేక్, దిలీప్, సోహంను తొలగించగా.. మిగతా వారు కొనసాగనున్నారు. ప్రస్తుతానికి, టి దిలీప్ స్థానంలో అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డోస్చేట్ తాత్కాలికంగా ఫీల్డింగ్ కోచ్ బాధ్యతలను నిర్వర్తించనున్నాడు.

వంద శాతానికి చేరువలో చైనాతో భారత్ వాణిజ్య లోటు

- దిగుమతులు పెరగడమే కారణం

న్యూఢిల్లీ : గడచిన ఆర్థిక సంవత్సరంలో చైనాతో భారత్‌కు 99.2 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు ఏర్పడింది. ఎలక్ట్రానిక్, వినియోగ వస్తువుల దిగుమతుల్లో పెరుగుదలే దీనికి కారణం. భారత్ సహా కీలక వాణిజ్య భాగస్వాములపై విధించిన అధిక సుంకాలకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గత వారం 90 రోజుల విరామం ప్రకటించడం, అదే సమయంలో చైనా ఉత్పత్తులపై ఎడాపెడా సుంకాలు పెంచడం వంటి పరిణామాల నేపథ్యంలో కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ బుధవారం ఈ సమాచారాన్ని విడుదల చేసింది. అమెరికా అధిక సుంకాలు విధిస్తుండడంతో చైనా కంపెనీలు ప్రత్యామ్నాయ మార్కెట్లకు ఎగుమతులు చేసే విషయంపై దృష్టి సారిస్తున్నాయన్న సమాచారం అందుతోంది. వాణిజ్య శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం...మార్చి నెలలో చైనాకు ఎగుమతులు 3 శాతం మేర తగ్గిపోయాయి. గత ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా 14 శాతానికి పైగా పడిపోయాయి. అదే సమయంలో చైనా నుంచి దిగుమతులు మార్చిలో 25 శాతం పెరిగి 9.6 బిలియన్ డాలర్లకు చేరాయి. మొత్తమ్మీద గత ఆర్థిక సంవత్సరంలో చైనా నుంచి దిగుమతులు 11 శాతం పెరిగి 113.4 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. చైనా ఉత్పత్తులపై భారత్ ఎక్కువగా ఆధారపడుతోందన్న విషయాన్ని ఈ గణాంకాలు రుజువు చేస్తున్నాయి. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, యంత్రాలు, రసాయనాలను చైనా నుంచి భారత్ ఎక్కువగా దిగుమతి చేసుకుంటోంది. ప్రధానమైన ఎనిమిది పారిశ్రామిక ఉత్పత్తుల కేటగిరీల్లో భారత్‌కు చైనా అతి పెద్ద సరఫరాదారుగా నిలిచింది. అమెరికాకు ఉత్పత్తులను ఎగుమతి చేయడం వల్ల ఖర్చులు పెరుగుతుండడంతో చైనా, వియత్నాం, ఇండోనేషియా వంటి దేశాలకు చెందిన ఎగుమతిదారులు తమ వస్తువులను భారత్‌కు సరఫరా చేసే అవకాశం ఉందని, దీనివల్ల దిగుమతులు పెరుగుతాయని వాణిజ్య శాఖ అధికారి ఒకరు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో విలువ ఆధారంగా భారత్‌కు ఎక్కువ ఉత్పత్తులను ఎగుమతి చేసిన దేశాల్లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (32.06 శాతం), చైనా (11.52 శాతం), థాయ్‌లాండ్ (43.99 శాతం), అమెరికా (7.44 శాతం), రష్యా (4.39 శాతం) మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి.

గ్లోబల్ యంగ్ లీడర్ల జాబితాలో రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



వరల్డ్ ఎకనామిక్ ఫోరానికి సంబంధించిన గ్లోబల్ యంగ్ లీడర్ల జాబితాలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు చోటు దక్కింది. ఎకనామిక్ ఫోరం విడుదల చేసిన యంగ్ గ్లోబల్ లీడర్ల జాబితాలో భారతదేశం నుంచి ఎంపిక చేసిన ఏడుగురిలో రామ్మోహన్ నాయుడు ఒకరుగా ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పలు రంగాల్లో ఉత్తమ నాయకత్వం కనబరిచిన యువ నాయకులను వరల్డ్ ఎకనామిక్ ఫోరం గుర్తించి గౌరవం కల్పిస్తుంది. గ్లోబల్ యంగ్ లీడర్ జాబితాలో ఉత్తమ నాయకత్వం కనబరిచిన టెక్ వ్యవస్థాపకులు, మానవ హక్కులు, న్యాయవాదులు తదితరులకు ఇందులో చోటు కల్పిస్తుంది. యంగ్ గ్లోబల్ లీడర్‌గా తనను ఎంపిక చేయడంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం ద్వారా 'యంగ్ గ్లోబల్ లీడర్'గా ఎంపిక కావడం తనకు గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. నిజాయితీ, నూతన ఆలోచనలు, సమగ్రతతో ప్రజలకు సేవ చేస్తున్నందుకు వచ్చిన గుర్తింపుతో తనపై మరింత బాధ్యతను పెంచిందని చెప్పారు.

గవర్నర్ల వ్యవస్థను తొలగించాలి

- ప్రతిపక్ష ప్రభుత్వాలను ఇబ్బంది పెట్టేలా పని చేస్తున్నారు
- అందుకే రాజ్ భవన్ అధికారాలను పరిమితం చేసే బిల్లు
- ఇంటర్వ్యూలో సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

"గవర్నర్లు కేంద్ర ప్రభుత్వానికి ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారు. బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆయా ప్రభుత్వాల నేతృత్వంలో అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను క్లియర్ చేయటం లేదు. అందుకే గవర్నర్ల వ్యవస్థను తొలగించాలి. నేను పార్లమెంట్‌లో రాజ్ భవన్ అధికారాలను పరిమితం చేసే ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టాను" అని సిపిఎం రాజ్యసభ పక్ష ఉపనేత జాన్ బ్రిట్టాస్ అన్నారు. ఆయన జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివిధ అంశాలను వెల్లడించారు.

ప్రశ్న : ఈ బిల్లును ప్రవేశపెట్టడానికి మీరు ఎందుకు ప్రయత్నించారు?

బ్రిట్టాస్ : గవర్నర్లు ఛాన్సలర్లుగా ఉంటూ, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల పరిపాలనను అణచివేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఛాన్సలర్ పదవి అనేది బ్రిటిష్ శకం నాటి హ్యాంగోవర్. 19 శతాబ్దంలో కలకత్తా విశ్వవిద్యాలయ ఛాన్సలర్ గవర్నర్ జనరల్. స్వాతంత్ర్యం తరువాత కూడా మనం దీనిని కొనసాగించాం. గవర్నర్లు ఛాన్సలర్లుగా మారినప్పుడు, రాష్ట్ర ప్రభుత్వాల చెమట, రక్తంతో నిర్మించిన విశ్వవిద్యాలయాల పరిపాలనను వారు అణగదొక్కుతారని ఎప్పుడూ ఊహించలేదు. అది భరించలేనిదిగా మారడం వల్లే ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రతిపాదించాను.

ప్రశ్న : మీరు ఈ బిల్లును మొదటిసారి ప్రవేశపెట్టినప్పుడు కేరళలో ఏమి జరుగుతోంది?

బ్రిట్టాస్ : అప్పటి గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ జనవరిలో బీహార్ గవర్నర్‌గా నియమితులయ్యారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పట్ల విధేయులుగా ఉన్న వ్యక్తులను వైస్ ఛాన్సలర్లుగా నియమిస్తున్నారు. వారు అన్ని రాష్ట్రప్రభుత్వ కార్యక్రమాలను అడ్డుకుంటున్నారు. అహంకారపూరితంగా ప్రవర్తిస్తూ సంబంధిత విశ్వవిద్యాలయాల పరిపాలనకు అంతరాయం కలిగిస్తున్నారు. కేరళలోని ఈ విశ్వవిద్యాలయాలకు అనేక దశాబ్దాల చరిత్ర ఉంది. వేరే ప్రాంతాల నుండి వచ్చిన వ్యక్తి తన అనుచరులను వైస్ ఛాన్సలర్‌గా నియమించుకుని ఉన్నత విద్యను ఎలా హైజాక్ చేయగలడు? ఆ నేపథ్యంలోనే నేను ఈ బిల్లును తీసుకురావాల్సి వచ్చింది.

ప్రశ్న : మీరు బిల్లును ప్రవేశపెట్టిన తరువాత ఏమి జరిగింది?

బ్రిట్టాస్ : నేను దానిని జూలై 2024లో ప్రవేశపెట్టాను. ఆ సమయంలో బిజెపి సభ్యులు మూకుమ్మడిగా ఏర్పడటంతో ప్రవేశపెట్టిన సమయంలోనే అది వీగిపోయింది. ప్రవేశపెట్టిన దశలో ప్రైవేట్ సభ్యుల బిల్లును వ్యతిరేకించడం భారతదేశ చరిత్రలో ఎన్నడూ జరగలేదు. నేను వారికి చెప్పాలనుకుంటున్నది ఏమిటంటే, వారి నాయకుడు నరేంద్ర మోడీ 2013లో చేసింది ఇదే. 2013 గుజరాత్ విశ్వవిద్యాలయాల చట్టాల (సవరణ) బిల్లు గవర్నర్‌ను ఛాన్సలర్ పదవి నుండి తొలగించడమే లక్ష్యంగా పెట్టుకుంది. కాబట్టి, గుజరాత్ ఏదైనా చేసి ఉంటే, ఇతర రాష్ట్రాలు ఎందుకు చేయలేవు? గవర్నర్ అలాంటి పదవులను నిర్వహించకూడదని నేను రాజ్యాంగంలో ఒక భాగం కావాలని కోరుకుంటున్నాను. ఎందుకంటే అది వారి పని కాదు. దేశంలో 1,100 కు పైగా విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వీటిలో ఎక్కువ భాగం రాష్ట్ర విశ్వవిద్యాలయాలు. వాటికి నిధులు రాష్ట్ర బడ్జెట్ నుండి వస్తాయి. గవర్నర్ అయిన వారు ప్రతిదీ నిర్ణయిస్తారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనల ముసాయిదాలో కూడా వైస్ ఛాన్సలర్ల కోసం సెర్చ్-కమ్-సెలక్షన్ కమిటీలో గవర్నర్‌కు అధిక ప్రాముఖ్యత ఇవ్వబడింది. కాబట్టి, ఒక నమూనా ఉంది. ముఖ్యమంత్రిగా నరేంద్ర మోడీ సమాఖ్య వ్యవస్థను సుసంపన్నం చేయడం గురించి చాలా మాట్లాడారు. ఆయన ప్రధానమంత్రి అయిన క్షణం నుండి, దానికి వ్యతిరేకంగా ప్రతిదీ చేస్తూ వస్తున్నారు.

ప్రశ్న: తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు తీర్పును మీరు ఎలా చూస్తారు?

బ్రిట్టాస్: ఇది చాలా అవసరం. సుప్రీంకోర్టు నుండి వినడానికి దేశం మొత్తం ఎదురుచూస్తోంది. సమాఖ్య సూత్రాలను నిలబెట్టాలని సిపిఎం తీవ్రంగా వాదిస్తోంది. సుప్రీంకోర్టు తీర్పు మనందరికీ గొప్ప ఉపశమనం కలిగించింది. గతంలో, గవర్నర్లు బిల్లులను పెండింగ్‌లో ఉంచకూడదని కోర్టు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. గవర్నర్లుగా పనిచేస్తున్న వ్యక్తులు సుప్రీంకోర్టు ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకునే జ్ఞానం కలిగి ఉంటారని ఆ బెంచ్‌లు ఆశించి ఉండవచ్చు. కానీ ఈ వ్యక్తులు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను అంతరాయం కలిగించడానికి మొగ్గు చూపుతున్నారు. అలాంటి చక్కదనం, నైపుణ్యం వారికి పనికి రావు. అందుకే, తమిళనాడు విషయానికి వస్తే, సుప్రీంకోర్టు నుండి ఒక స్థిరమైన, దృఢమైన తీర్పు వచ్చింది. గోడపై రాత చాలా స్పష్టంగా ఉంది. గవర్నర్ దానిని చూసి ఉండాలి.

ప్రశ్న: కేంద్రం ఇప్పుడు తమిళనాడు గవర్నర్‌ను తొలగించాలని మీరు ఎక్స్‌లో పోస్ట్ చేసారు. ఎందుకు?

బ్రిట్టాస్: ఆయనకు కాస్తంత ఆత్మగౌరవం ఉంటే, ఆయన రాజీనామా చేసి వెళ్ళిపోయేవాడు. కానీ ఈ వ్యక్తులు అలా చేస్తారని నేను ఆశించను. వారికి ఏ సంస్థల పట్ల లేదా రాజ్యాంగం పట్ల గౌరవం లేదు. వారు ఎల్లప్పుడూ సహకార సమాఖ్యవాదం గురించి మాట్లాడుతారు. కానీ కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్య రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను దోచుకోవడమే. వారు కేంద్ర ప్రాయోజిత పథకాలను ఉపయోగించి రాష్ట్ర జాబితాలోకి వచ్చే విషయాలలోకి క్రమంగా ప్రవేశిస్తున్నారు.

ప్రస్తుతం దేశంలో జరుగుతున్న అతిపెద్ద కుట్ర అదే. ఉదాహరణకు, "ఆరోగ్యం" రాష్ట్ర జాబితాలోకి వస్తుంది. వారు జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా కొంత డబ్బును బడ్జెట్‌లో పెట్టారు. ఇప్పుడు వారు ఏ రాష్ట్రమైనా ఈ పథకం కింద డబ్బు పొందాలనుకుంటే, అది కొత్త ఆదేశాలను పాటించాలని అంటున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలని పేరు పెట్టాలి. ఈ సంస్కృత పదాలన్నింటికీ కేరళకు సంబంధం ఏమిటి? కేరళకు అత్యుత్తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నడిపిన చరిత్ర ఉంది. వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల గురించి ఆలోచించకముందే, మేము వాటిని ప్రతి గ్రామంలోనూ కలిగి ఉన్నాం.



ప్రశ్న: కేరళ గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ సుప్రీం తీర్పులో గవర్నర్లకు నిర్దేశించిన సమయ పరిమితులను "న్యాయపరమైన అతిక్రమణ" అని విమర్శించారు మీ స్పందన?


బ్రిట్టాస్ : గవర్నర్ సుప్రీంకోర్టు పాత్రను అర్థం చేసుకోవాలి. కోర్టు "సాధ్యమైనంత త్వరగా" అనే పదబంధాన్ని అర్థం చేసుకుంది. రాజ్యాంగం ప్రకారం బిల్లుకు గవర్నర్ వీలైనంత త్వరగా ఆమోదం తెలియజేయాలి. ఈ "సాధ్యమైనంత త్వరగా" అనే పదాన్ని గవర్నర్లు ఎప్పుడూ పాటించలేదు. రాజ్యాంగాన్ని అన్వయించే అధికారం సుప్రీంకోర్టుకు ఉంది. వారు చేసింది అదే. ఆయన దీనిని అర్థం చేసుకోవాలి.

ప్రశ్న: గవర్నర్ పదవిని రద్దు చేయాలని మీరు అనుకుంటున్నారా?

బ్రిట్టాస్: రాజ్యాంగ నిర్మాతలకు దేశ ఐక్యత గురించి కొన్ని భయాలు ఉన్నాయి. కాబట్టి మనకు గవర్నర్లు ఉన్నారు. ఆ సమయంలో, విభజన జరుగుతోంది. కొన్నిచోట్ల హింస జరిగింది. ఇప్పుడు భారతదేశం ఒక సంఘటిత దేశంగా మారింది. అలాంటి పదవులు అసలు అవసరం లేదు. మనం గవర్నర్ పదవిని తొలగించవచ్చు. గవర్నర్ల వ్యవస్థ భారీ వ్యయంతో కూడినది. ఇది భారీ ఇబ్బందికి ఆస్కారమైనది. ప్రజల తీర్పును ఇబ్బంది పెట్టడానికి ఇది ఒక సంస్థగా మారింది. దీన్ని మనం రద్దు చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తే గవర్నర్‌కు సంబంధించిన అనేక విధులను నిర్వర్తించగలరు. ఉదాహరణకు, ముఖ్యమంత్రితో ప్రమాణ స్వీకారం చేయించడం. దీనిని ప్రధాన న్యాయమూర్తి సులభంగా చేయవచ్చు అని వివరించారు.

మణిపూర్ మాజీ సిఎం ఆడియో క్లిప్‌పై ఫోరెన్సిక్ నివేదిక సిద్ధం !

- సుప్రీంకు తెలిపిన కేంద్రం



బీరేన్ సింగ్

న్యూఢిల్లీ : రాష్ట్రంలో జాతుల మధ్య చెలరేగిన హింసాకాండలో మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ పాత్ర వున్నట్లు ఆరోపిస్తూ లీకైన ఆడియో క్లిప్పుల విశ్వసనీయతను నిర్ధారించే ఫోరెన్సిక్ నివేదిక సిద్ధమైందని కేంద్రం గురువారం సుప్రీం కోర్టుకు తెలియజేసింది. త్వరలోనే సీల్డ్ కవర్‌లో దాన్ని అందజేయనున్నట్లు తెలిపింది. ఈ మేరకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న న్యాయవాది చెప్పిన అంశాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని బెంచ్ పరిగణనలోకి తీసుకుంది. కుకీ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ (కెఒహెచ్‌యుఆర్) దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను మే 5కు వాయిదా వేసింది. ఫోరెన్సిక్ ల్యాబ్ నుండి అందిన ఈ నివేదికను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అందచేసి, వాయిదా కూడా కోరతారని న్యాయవాది తెలిపారు.

నాయకత్వ మార్పు కోసం డిమాండ్లు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర బిజెపిలో గొడవలు చెలరేగిన తరుణంలో ఫిబ్రవరి 9న బీరేన్ సింగ్ తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఈ అల్లర్లలో సింగ్ పాత్రపై కోర్టు పర్యవేక్షణలో సిట్ దర్యాప్తు జరగాలని కెఒహెచ్‌యుఆర్ కోరుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో నెమ్మదిగా పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయి. అందువల్ల ఈ అంశాన్ని ప్రస్తుతానికి వాయిదా వేద్దామని సిజెఐ వ్యాఖ్యానించారు. తర్వాత ఈ కేసును విచారించేది సుప్రీం కోర్టా లేక హైకోర్టు అనేది నిర్ణయిస్తానని సిజెఐ చెప్పారు. ఆయన మాటలతో సొలిసిటర్ జనరల్ ఏకీభవించారు. ఆ ఆడియోలోని గొంతు 93శాతం ముఖ్యమంత్రిదేనని ట్రూత్‌ల్యాబ్ నిర్ధారించిందని కుకీల తరపున వాదనలు వినిపిస్తున్న న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వ్యాఖ్యానించారు.

యుపిలో దారుణం..

- 11ఏళ్ల బధిర బాలికపై లైంగికదాడి

లక్నో: ఉత్తరప్రదేశ్ లోని రాంపూర్‌లో దారుణం చోటుచేసుకుంది. 11ఏళ్ల బధిర బాలికపై ఒక కీచకుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. నిందితుడిని గుర్తించి పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తొలుత బాలిక కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె కోసం కుటుంబసభ్యులు గాలిస్తుండగా.. పొలాల్లో తీవ్ర గాయాలతో, నగ్నంగా కనిపించింది. వెంటనే ఆ బాలికను స్థానిక ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకున్నారు. విచారణలో భాగంగా ఆ ప్రాంతంలోని సిసి టివి దృశ్యాలను పరిశీలించగా అసలు విషయం బయటపడింది. డాన్ సింగ్ (24) అనే వ్యక్తి బాలికకు మాయమాటలు చెప్పి పొలాల్లోకి తీసుకెళ్లినట్టు గుర్తించారు. దీంతో నిందితుడిని పట్టుకునేందుకు అధికారులు ప్రయత్నించగా, అతడు పోలీసుల పైకి కాల్పులు జరిపాడు. ఎదురుకాల్పుల్లో నిందితుడి కాలుకి గాయమవడంతో అదుపులోకి తీసుకున్నారు. ఆ చిన్నారికి వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ కీలక విషయాలు వెల్లడించారు. ఒకరు కంటే ఎక్కువమంది బాలికపై లైంగికదాడికి పాల్పడ్డారని, ముఖంపైన, ప్రైవేటు భాగాలపైనా తీవ్ర గాయాలున్నాయని చెప్పారు. చిన్నారులు, మహిళలపై జరుగుతున్న దారుణాలపై మహిళా సంఘాలు యోగి సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

'టైమ్' ప్రభావశీలుర జాబితాలో ట్రంప్, కెయిర్ స్టార్మర్, యూనస్, మస్క్...

- ఈసారి భారతీయులకు దక్కని చోటు

న్యూయార్క్: ప్రపంచవ్యాప్తంగా ప్రభావశీలురను గుర్తించి జాబితా రూపొందిస్తుంది ప్రముఖ మ్యాగజైన్ 'టైమ్'. ఈ ఏడాది ఆ జాబితాలోకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్ వంటి ప్రముఖులు చేరారు. వారిని ప్రభావవంతమైన వ్యక్తులుగా టైమ్ మ్యాగజైన్ ప్రకటించింది. ఈ సారి ఈ జాబితాలో భారత్‌కు చెందిన ఒక్కరికి కూడా చోటు దక్కకపోవడం గమనార్హం.2025 సంవత్సరానికి గానూ అత్యంత ప్రభావవంతమైన 100 మంది వ్యక్తుల జాబితాను టైమ్ తాజాగా వెల్లడించింది. లీడర్స్, ఐకాన్స్, టైటాన్స్, ఆర్టిస్ట్స్, ఇన్నోవేటర్స్ ఇలా పలు కేటగిరీలుగా విభజించి ఈ వార్షిక జాబితాను రూపొందించింది. లీడర్ల కేటగిరీలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, డోజ్ అధినేత ఎలాన్ మస్క్, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్, అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ ప్రభృతులు ఉన్నారు. ఏటా టైమ్ ప్రకటించే ఈ జాబితాలో సాధారణంగా భారతీయులకు స్థానం ఉండేది. గతేడాది బాలీవుడ్ నటి అలియా భట్, ఒలింపిక్ పతక విజేత, రెజ్లర్ సాక్షి మాలిక్‌లకు చోటు దక్కింది. అంతకుముందు 2023లో ప్రముఖ తెలుగు దర్శకుడు రాజమౌళి, బాలీవుడ్ నటుడు షారూక్ ఖాన్ వంటివారు ప్రభావవంతమైన వ్యక్తులుగా నిలిచారు. ఈసారి జాబితాలో భారత్ నుంచి ఒక్కరికీ చోటు దక్కకపోవడం గమనార్హం.

భారతసంతతి నాయకురాలికి చోటు

భారత సంతతికి చెందిన రేష్మ కెవల్‌రామణి టైమ్ జాబితాలో ఉన్నారు. ఆమె వర్టెక్స్ ఫార్మా సిఇఒగా వ్యవహరిస్తున్నారు. రేష్మకు 11ఏళ్ల వయసులోనే ఆమె కుటుంబం అమెరికాకు వలస వెళ్లి అక్కడే స్థిరపడింది. ఫార్మా రంగంలో రాణించిన రేష్మ అమెరికా అతిపెద్ద బయోటెక్నాలజీకి తొలి మహిళా సిఇఒగా అరుదైన ఘనత అందుకున్నారు.

పాలస్తీనాకు అండగా వుంటాం : చైనా, మలేషియా

కౌలాలంపూర్: గాజా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయిల్, హమాస్‌లు సమర్థవంతంగా, సంపూర్ణంగా అమలు చేయాలని చైనా, మలేషియా కోరాయి. ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మలేసియాలో అధికారిక పర్యటన ముగిసిన నేపథ్యంలో ఇరు దేశాలు ఈ ప్రకటనను విడుదల చేశాయి. గాజా పాలస్తీనియన్లదని, అది పాలస్తీనా భూభాగంలో విడదీయరాని భాగమని మలేషియా ప్రధాన మంత్రి అన్వర్ ఇబ్రహీం, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్పష్టం చేశారు.

ఆక్రమిత భూభాగం నుంచి వైదొలగండి

- పాక్ ఆర్మీ చీఫ్‌కు భారత్ అల్టిమేటం

న్యూఢిల్లీ : కేంద్ర పాలిత ప్రాంతంలో అక్రమంగా ఆక్రమించిన భూభాగం నుండి వారు ఖాళీ చేయడమే జమ్మూ కాశ్మీర్‌తో పాకిస్తాన్‌కు గల ఏకైక సంబంధమని భారత్ గురువారం స్పష్టం చేసింది. ఈ ప్రాంతంపై పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టింది. జమ్మూ కాశ్మీర్, పాకిస్తాన్‌లో అంతర్భాగమంటూ జనరల్ మునీర్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, అదెలా అవుతుంది ? ఆ దేశం అక్రమంగా ఆక్రమించుకున్న ఆ భూభాగాన్ని ఖాళీ చేయడమే జమ్ము కాశ్మీర్‌తో వారికి గల సంబంధమని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. పాకిస్తాన్ ఎంతగా ప్రయత్నించినా అంతర్జాతీయ తీవ్రవాదానికి కేంద్రంగా ఆ దేశం తెచ్చుకున్న పేరు ఎక్కడకూ పోదని ఆయన వ్యాఖ్యానించారు. పైగా ముంబయి పేలుళ్ల నిందితుడు రాణాను భారత్‌కు అప్పగించడం ఆ విషయాన్ని ఇంకా స్పష్టం చేస్తోందన్నారు. ఈ దాడికి పాల్పడిన ఇతరులను కూడా ఆ దేశం అప్పగించాల్సిన అవసరం వుందని ఆయన చెప్పారు.

'వక్ఫ్'పై తదుపరి విచారణ వరకు యథాతథస్థితి

మొదటిపేజి తరువాయి

చేసుకోరాదని అన్నారు. కొత్త చట్టానికి ముందుగా వక్ఫ్‌లకు సంబంధించిన పరిస్థితుల్లో కొన్ని బలహీనతలు వున్నాయని చీఫ్ జస్టిస్ అన్నారు. 2025 చట్టంలోనూ కొన్ని సానుకూల అంశాలు వున్నాయన్నారు. ఈ చట్టంపై పూర్తిగా స్టే విధించాలన్న పిటిషనర్ల అభ్యర్ధనను కోర్టు బుధవారం తిరస్కరించింది. అదే సమయంలో ఈనాడు ఏవైతే పరిస్థితులు నెలకొన్నాయో వాటిని పూర్తిగా మార్చివేసేలా, పెద్ద సంఖ్యలో ప్రజలను ప్రభావితం చేసేలా చేయాలనుకోవడం లేదని చీఫ్ జస్టిస్ స్పష్టం చేశారు. దానిపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మళ్లీ స్పందిస్తూ, వారం రోజుల్లో ఎలాంటి మార్పు ఉండదని, తాము చట్టంలోని సెక్షన్ 9, 14 కింద ఎలాంటి నియామకాలు చేపట్టబోమన్నారు. సిజెఐ జోక్యం చేసుకుంటూ తదుపరి విచారణ వరకు ఎలాంటి మార్పులు ఉండకూడదని చెప్పగా, ఎస్‌జి స్పందిస్తూ ఏ రాష్ట్రమైనా నియామకాలు చేస్తే చట్టబద్ధంగా పరిగణించకూడదన్నారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఎస్‌జి వ్యాఖ్యలు రికార్డు చేసినట్లు పేర్కొంది. కౌన్సిల్, బోర్డులో ఎలాంటి నియామకాలు జరగవని ఎస్‌జి కోర్టుకు హామీ ఇచ్చారని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. తదుపరి విచారణ వరకు ఎలాంటి నియామకాలు జరగకూడదని, వక్ఫ్ బై యూజర్‌గా పేర్కొన్న వాటితో పాటు నోటిఫికేషన్ ద్వారా రిజిస్టర్ అయినవి, డీ నోటిఫై చేయకూడదంటూ సుప్రీంకోర్టు ఆదేశించింది. కేసు విచారణను మే 5వ తేదీకి వాయిదా వేస్తూ, అప్పటి వరకు యథాతథ స్థితి కొనసాగుతుందని పేర్కొంది.

భావప్రకటనా హక్కు అణచివేత

- ప్రతిపక్ష మీడియాను అణగదొక్కే యత్నం
- జర్నలిస్టుల జీవనోపాధికి గండి
- 'నేషనల్ హెరాల్డ్'పై కేంద్రం చర్యల పట్ల డియుజె దిగ్భ్రాంతి

న్యూఢిల్లీ : నేషనల్ హెరాల్డ్ వార్తాపత్రిక ప్రచురించబడే ఢిల్లీలోని హెరాల్డ్ హౌజ్‌తో సహా దాని ఆస్తులను స్వాధీనం చేసుకోవాలన్న కేంద్రం చర్యపై ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (డియుజె) దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఇది ప్రతిపక్ష మీడియాను అణచివేయటానికి చేసిన ప్రయత్నమని విమర్శించింది. ఈ చర్యతో చాలా మంది జర్నలిస్టులు వీధిన పడతారని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రింట్ మీడియా, యూట్యూబ్ వంటి డిజిటల్ వేదికల ద్వారా అయినా.. భావప్రకటనా స్వేచ్ఛ హక్కు, సంపాదించుకునే జీవనోపాధిని అరికట్టటంలో భాగంగా ప్రభుత్వం తీసుకున్న చర్య అని డియుజె ఒక ప్రకటనలో పేర్కొన్నది. ప్రముఖ జర్నలిస్ట్ గిరిజేశ్ వశిష్ట నిర్వహిస్తున్న యూట్యూబ్ ఛానెల్ 'నాకింగ్ న్యూస్' హఠాత్తుగా మూసివేయబడిందనీ, ఈ పరిణామం పట్ల తాము దిగ్భ్రాంతి చెందామని వివరించింది. దానిని వెంటనే, బేషరతుగా పునరుద్ధరించాలని డిమాండ్ చేశామని డియుజె వివరించింది.

'మీడియా స్వేచ్ఛపై ఆంక్షలు తగవు'

ప్రింట్ మీడియా లేదా యూట్యూబ్ వంటి డిజిటల్ వేదికల విషయంలో మీడియా రంగంలో ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలపై డియుజె తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసింది. హెరాల్డ్ హౌజ్‌తో సహా నేషనల్ హెరాల్డ్ ఆస్తులను, లక్నో, ముంబయిలోని అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ భవనాలను స్వాధీనం చేసుకోవాలని కేంద్రం తీసుకున్న చర్యపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. ప్రతిపక్ష మీడియాను అణచివేయటం, నేషనల్ హెరాల్డ్ ఉద్యోగుల జీనోపాధికి ముప్పు వాటిల్లటం పట్ల తీవ్రంగా ఆందోళన చెందుతున్నట్టు డియుజె వివరించింది. మీడియా సంస్థను మూసివేయటమంటే.. ఇప్పటికే చాలా మంది నిరుద్యోగులుగా, తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న సమయంలో చాలా మంది జర్నలిస్టులు వీధిన పడతారని ఆవేదన వ్యక్తం చేసింది.

కేంద్ర దర్యాప్తు సంస్థలను వాడుకుంటూ...

కేంద్ర దర్యాప్తు సంస్థలను, సమాచార సాంకేతిక చట్టాలలో లొసుగులను వాడుకుంటూ కేంద్రంలోని మోడీ సర్కారు దేశంలోని మీడియా, పత్రికా గొంతును నొక్కేస్తున్నది. వాటి స్వేచ్ఛను హరించి వేస్తున్నది. కేంద్రం చర్యలతో ప్రతిపక్ష పాత్రను పోషించే పలు యూట్యూబ్ ఛానెళ్లు ఇప్పటికే మూతపడ్డాయి. ఇక 'న్యూస్‌క్లిక్' వంటి సంస్థలపై వేధింపులు అందరికీ తెలిసిందే. మోడీ సర్కారు కక్షపూరితమైన చర్యలకు దూరంగా ఉండాలని పలు జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. జర్నలిస్టులకు రక్షణ కల్పించేలా చట్టాన్ని తీసుకురావాలని కోరుతున్నాయి.

రాష్ట్రపతికి ఆదేశాలు జారీచేసే అధికారం సుప్రీంకోర్టుకు లేదు : ధన్‌ఖర్

న్యూఢిల్లీ : బిల్లులపై నిర్ణయం తీసుకోవడంపై రాష్ట్రపతికి గడువు విధిస్తూ ఆదేశాలు జారీ చేసే అధికారం సుప్రీంకోర్టుకు లేదని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ వ్యాఖ్యానించారు. 'ఇటీవలి తీర్పు ద్వారా రాష్ట్రపతికి ఒక ఆదేశం ఇచ్చారు. మనం ఏ దిశగా వెళుతున్నాం? దేశంలో ఏం జరుగుతోంది? మనం చాలా సున్నితంగా ఉండాలి. ఈ తీర్పుపై సమీక్ష చేస్తారా.. లేదా.. అన్నది ప్రశ్న కాదు. ఇలాంటి ప్రజాస్వామ్యాన్ని మనం కోరుకోలేదు' అని అన్నారు. రాజ్యసభ ఇంటర్న్ గ్రూపుతో మాట్లాడుతూ 'మనకు చట్టాలు చేసి, కార్యనిర్వాహక విధులు నిర్వర్తించే 'సూపర్ పార్లమెంట్'గా వ్యవహరించే జడ్జిలు ఉన్నారు. ఈ భూమిపై చట్టాలు వారికి వర్తించవు. వారికి ఎలాంటి జవాబుదారీతనం ఉండదు' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భారత రాష్ట్రపతి చాలా అతున్నతస్థాయిలో ఉంటారని, రాజ్యాంగాన్ని రక్షిస్తానని ప్రమాణం చేస్తారని ధన్‌ఖర్ గుర్తుచేశారు.

మంత్రి పొన్ముడిపై ఎఫ్ఐఆర్ నమోదుకు మద్రాస్ హైకోర్టు ఆదేశం

చెన్నయ్ : శైవులు, వైష్ణవులు, మహిళలకు వ్యతిరేకంగా బహిరంగంగా అవమానకర వ్యాఖ్యలు చేసినందుకు తమిళనాడు అటవీ శాఖ మంత్రి కె.పొన్ముడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మద్రాస్ హైకోర్టు గురువారం ఆదేశించింది. లేకపోతే పోలీసులు కోర్టు ధిక్కార చర్యలు ఎదుర్కొనాల్సి వస్తుందని పేర్కొంటూ జస్టిస్ ఎన్ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. 2023లో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో పొన్ముడిను మద్రాస్ హైకోర్టు నిర్దోషిగా విడుదల చేయడంపై జరుగుతున్న పునర్విచారణలో జడ్జి ఈ ఆదేశాలు జారీ చేశారు. మంత్రి పొన్ముడి ఇటీవల చేసిన ప్రసంగం వీడియోను జడ్జి ప్రస్తావించారు. మతాలకు వ్యతిరేకంగా మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. మంత్రి ప్రసంగంపై తమకు కూడా ఫిర్యాదులు వచ్చాయని అడ్వకేట్ జనరల్ పిఎస్ రామన్ చెప్పారు. తదుపరి విచారణను ఈ నెల 23కు వాయిదా వేశారు.



బెంగాల్‌లో సిపిఎం మతసామరస్య ర్యాలీ

మాల్దా : పశ్చిమ బెంగాల్‌లోని మల్దా పట్టణంలో సిపిఎం మతసామరస్య ర్యాలీని గురువారం నిర్వహించింది. నగరంలోని వివిధ వీధుల మీదుగా సాగిన ఈ ర్యాలీపై పలుచోట్ల ప్రజలు పూలవర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి ఎమ్‌డి సలీమ్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే కొత్త చట్టాన్ని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. వితంతువులు, అనాథలు, పేదలు, విద్య, ఆరోగ్య అవసరాల కోసం వినియోగిస్తున్న ఆస్తులను ఇతర అవసరాలకు మళ్లించే ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు సుమిత్ దేవ్ తదితరులు పాల్గొన్నారు.

రష్యన్ బందీల విడుదలపై పుతిన్ హర్షం హమాస్‌కు కృతజ్ఞతలు



రష్యన్ పౌరుడు అలెగ్జాండర్ ట్రుఫనొవ్‌తో కరచాలనం చేస్తున్న పుతిన్

మాస్కో : ఇజ్రాయిల్‌పై 2023 అక్టోబరులో దాడి చేసినప్పుడు బందీలుగా పట్టుబడిన ముగ్గురు రష్యన్లను విడుదల చేసినందుకు హమాస్‌కు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కృతజ్ఞతలు తెలిపారు. గాజా నుండి విడుదలై బుధవారం రాత్రి క్రెమ్లిన్ చేరుకున్న రష్యన్ పౌరుడు అలెగ్జాండర్ ట్రుఫనొవ్‌ను, ఆయన కుటుంబ సభ్యులు ఇద్దరిని పుతిన్ స్వాగతించారని ఇంటర్‌ఫాక్స్ వార్తా సంస్థ తెలిపింది. ట్రుఫనొవ్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదల చేశారు. పాలస్తీనియన్లతో, పాలస్తీనాకు చెందిన వివిధ సంస్థలు, సంఘాలతో రష్యా అనేక సంవత్సరాలుగా సాగిస్తున్న సుస్థిర సంబంధాలే ఈనాటి వారి విడుదలకు కారణమని పుతిన్ వ్యాఖ్యానించారు. ఈ మానవతా చర్య తీసుకున్నందుకు హమాస్ రాజకీయ విభాగానికి, నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పుతిన్ వ్యాఖ్యానించారు. విడుదలైన బందీలతో పుతిన్, రష్యా యూదు నేతలు సమావేశమయ్యారు. ట్రుఫనొవ్, ఆయన తల్లి, అమ్మమ్మ, భార్యలను ఆనాడు కిడ్నాప్ చేసి గాజాకు తీసుకెళ్లారు. కుటుంబ పెద్ద విటాలీ ట్రుఫనొవ్ ఈ దాడిలో మరణించారు. మిగిలిన ముగ్గురు 53రోజుల తర్వాత బందీల మార్పిడిలో భాగంగా చెర నుండి విడుదలయ్యారు. అలెగ్జాండర్ ట్రుఫనొవ్ ఏకంగా 500 రోజులుగా వారి చెరలోనే వుండి ఈ ఏడాది ఫిబ్రవరి 15న విడుదలయ్యారు. కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా ఆయన విడుదల జరిగింది. ఇజ్రాయిల్‌లో వున్న సెటిలర్లలో పలువురు రష్యన్ పౌరసత్వాన్ని కొనసాగించుకుంటున్నారు. మిగిలినవారి విడుదలకు కూడా తాము కృషి చేస్తామని ఈ సందర్భంగా పుతిన్ హామీ ఇచ్చారు.

బహిష్కరణకు వ్యతిరేకంగా భారత విద్యార్థిసహా నలుగురు దావా

వాషింగ్టన్ : అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ తన దుందుడుకు చర్యలతో విద్యార్థులనూ కలవరపెడుతున్నాడు. తమ స్టూడెంట్ ఇమ్మిగ్రేషన్ స్టేటస్‌ను 'చట్టవిరుద్ధం'గా రద్దు చేసినందుకు మిచిగాన్ పబ్లిక్ యూనివర్సిటీకి చెందిన నలుగురు విద్యార్థులు దావా వేశారు. రద్దు ఫలితంగా యుఎస్ నుంచి బహిష్కరణకు గురయ్యే అవకాశం ఉండటంతో వారు ఈ చర్యకు దిగారు. ఈ దావా వేసినవారిలో ఒకరు భారత్‌కు చెందినవారే కావటం గమనార్హం.

భారత్ నుంచి చిన్మయ్ డియోర్, చైనా నుంచి జియాంగ్యున్ బు, క్యుయి యాంగ్, నేపాల్ నుంచి యోగేశ్ జోషి డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డిహెచ్ఎస్), ఇమ్మిగ్రేషన్ అధికారులపై దావా వేశారు. స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎస్ఈవీఐఎస్)లో వారి స్టూడెంట్ ఇమ్మిగ్రేషన్ స్థితిని 'తగిన నోటీసు, వివరణ' లేకుండా చట్టవిరుద్ధంగా రద్దు చేశారని విద్యార్థులు ఆరోపించారు. ట్రంప్ యంత్రాంగం ఒక నోటీసు లేకుండా వారి ఎఫ్-1 స్టూడెంట్ ఇమ్మిగ్రేషన్ స్థితిని చట్టవిరుద్ధంగా, అకస్మాత్తుగా సహేతుక కారణం లేకుండా రద్దు చేయటాన్ని అత్యవసరంగా నిషేధించాలంటూ ఒక దావాను వేసినట్టు విద్యార్థుల తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ (ఎసిఎల్‌యు) తెలిపింది.

ఈ విద్యార్థులు తమ చదువులను పూర్తి చేయగలిగేలా, నిర్బంధం, బహిష్కరణ ప్రమాదాన్ని ఎదుర్కోకుండా ఉండటానికి వారి స్థితిని పునరుద్ధరించాలని దావా కోర్టును కోరుతున్నదని వివరించింది. "వారిలో ఎవరూ కూడా యుఎస్‌లో నేరానికి పాల్పడినట్టు చెప్పలేదు. దోషిగా నిర్ధారించబడలేదు. ఎవరూ ఎలాంటి ఇమ్మిగ్రేషన్ చట్టాన్నీ ఉల్లంఘించలేదు. వారు ఏ రాజకీయ అంశానికి సంబంధించి కూడా క్యాంపస్‌లో నిరసనలలో పాల్గొనలేదు" అని డిహెచ్ఎస్ సెక్రెటరీ క్రిస్టి నోయెమ్, ఐసిఇ డైరెక్టర్ టాడ్ లియోన్స్, ఐసీఈ డెట్రాయిట్ ఫీల్డ్ ఆఫీస్ డైరెక్టర్ రాబర్ట్ లించ్‌లను పేర్కొంటూ కోర్టులో దాఖలైన ఫిర్యాదు వివరించింది. దేశవ్యాప్తంగా న్యూహాంప్‌షైర్, ఇండియానా, కాలిఫోర్నియా వంటి రాష్ట్రాలలో ఇలాంటి వ్యాజ్యాలే దాఖలు కావటం గమనార్హం.

"ఈ క్రూరమైన, చట్టవిరుద్ధమైన ప్రభుత్వ చర్యలు విద్యార్థుల జీవితాలను దెబ్బతీస్తాయి. అంతేకాదు.. ప్రభుత్వ చర్యలతో భవిష్యత్తులో అంతర్జాతీయ స్కాలర్లు మిచిగాన్, యూఎస్‌లను తమ విద్యా గమ్యస్థానంగా ఎంచుకోకుండా నిరోధిస్తాయి. ఇది మన విశ్వవిద్యాలయాల ఖ్యాతిని మరింత దెబ్బతీస్తుంది. ఇవన్నీ ప్రస్తుతం ప్రమాదంలో ఉన్నాయి" అని మిచిగాన్ ఎసిఎల్‌యులో స్టాఫ్ అటార్నీ రామిస్ వాదూద్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఎకరం 99 పైసలు!

మొదటిపేజి తరువాయి

ఉత్తర్వులు ప్రభుత్వం బోర్డు స్టాండింగ్ ఆర్డర్స్ -24కు అనుగుణంగా ఇచ్చినట్టు తెలిపారు. దీన్ని బట్టి టిసిఎస్‌కు అతి చవక ధరకు ప్రభుత్వ భూమిని ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు పూర్తిగా వ్యతిరేకమని గుర్తించాలన్నారు. అంతేకాకుండా, 2జి స్పెక్ట్రమ్ కేసులో, ఇతర కేసుల్లో ప్రభుత్వ భూముల వంటి ప్రకృతి వనరుల విషయంలో ప్రభుత్వం ప్రజల ట్రస్టీగా మాత్రమే వ్యవహరించాలని, అటువంటి భూములను ప్రజా ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగించాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రైవేట్ సంస్థలకు మార్కెట్ ధర కన్నా తక్కువ ధరకు ఇవ్వకూడదని సుప్రీంకోర్టు స్పష్టంగా, పదేపదే ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. దానికి విరుద్ధంగా టిసిఎస్‌కు కేటాయింపులు జరిగాయని, దీన్ని బట్టి రాష్ట్ర ప్రభుత్వ విధానాలనే కాకుండా సుప్రీంకోర్టు ఉత్తర్వులను కూడా ఉల్లంఘించినట్లు అవుతుందని తెలిపారు. 2024లో టిసిఎస్ రూ.62165 కోట్ల లాభం గడించిందని, అటువంటి కంపెనీకి 99 పైసల లీజుకు విలువైన 21.16 ఎకరాల ప్రభుత్వ భూమిని ముట్టజెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు

ప్రభుత్వ సంస్థల పట్ల భిన్న వైఖరి

గతంలో ఇదే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సంస్థల పట్ల, ముఖ్యంగా దేశ భద్రతను నిరంతరం పరిరక్షించే భారత నావికాదళం పట్ల, ప్రభుత్వ రంగంలో పనిచేస్తూ కార్మికులకు వైద్య సౌకర్యాలు కలిగించే ఇఎస్ఐ ఆసుపత్రుల పట్ల, రాష్ట్ర ప్రజలకు అండదండగా నిలిచే ఎల్ఐసి, ఎఫ్‌సిఐ వంటి సంస్థల పట్ల టిసిఎస్‌పై చూపించిన ఆప్యాయత, ఔదార్యం చూపించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. గతంలో ప్రభుత్వ రంగ సంస్థలకు టిడిపి ప్రభుత్వ ఆధ్వర్యంలో కేటాయించిన భూముల వివరాలను, విధించిన ధరల విషయాలను శర్మ తన లేఖలో పేర్కొన్నారు. ప్రజలకు నిరంతరం సేవచేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు ప్రభుత్వ భూములను ఇవ్వడంలో ఒక విధానం, కేవలం లాభాల కోసం పనిచేసే టిసిఎస్‌కు ఇంకో విధానం అమలు చేయడాన్ని రాష్ట్ర ప్రజలు హర్షించబోరన్నారు. అటువంటి క్రోనీ క్యాపిటలిజం విధానాలను ప్రభుత్వం చేపట్టడం బాధాకరమని తెలిపారు.

ఎన్ని ఉద్యోగాలు...ఎప్పటిలోగా...?

టిసిఎస్ కంపెనీ ఒక ఐటి పరిశ్రమను పెట్టి 12 వేల ఉద్యోగాలు కల్పిస్తుందని రాష్ట్ర మంత్రి తెలియజేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. టిసిఎస్ విశాఖ యూనిట్‌లో కల్పించే ఉద్యోగాల విషయమై ప్రభుత్వానికి రాతపూర్వకంగా ఏం హామీ ఇచ్చిందో ప్రజలకు తెలియజేయాలని ఇఎఎస్ శర్మ డిమాండ్ చేశారు. ఎప్పటిలోగా ఉద్యోగాలు ఇస్తారో కూడా చెప్పాలని కోరారు. గతంలో కంపెనీల యజమానులు పెట్టుబడులు పెడతామని, ఉద్యోగాలు ఇస్తామని చౌకగా ప్రభుత్వ భూములు తీసుకుని ఇదే విధంగా హామీలు ఇచ్చాయని, నేటికి యువతకు ఉద్యోగాలు కల్పించలేదన్నారు. అదే సమయంలో ప్రయివేటు కంపెనీలు ఉద్యోగాల కల్పనలో రిజర్వేషన్లు అమలు చేయని విషయాన్ని ఆయన ప్రస్తావించారు. టిసిఎస్ నోటి మాటగా రాష్ట్ర ప్రభుత్వానికి 12 వేలు ఉద్యోగాలను విశాఖలో కల్పిస్తామని చెప్పినా ప్రస్తుతం అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఇతర ఐటి కంపెనీలతో పాటు ఉద్యోగుల సంఖ్య తగ్గించే దిశలో ఉందన్నారు చవక భూములు, అనుచితమైన రాయితీల కారణంగా, చట్టాలను సడలించే విధానాల వల్ల రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులు రాష్ట్రానికిగానీ, ప్రజలకుగానీ దీర్ఘకాలికమైన ప్రయోజనాలు కలిగించలేవని ఆయన తెలిపారు.



మీకోసం

వాటర్ బాటిళ్ల మూతలు వదులుగా మారి నీళ్లు కారిపోతుంటే బాటిల్‌కి రబ్బరు బ్యాండ్లు తొడిగితే మూత బిగుసుకుంటుంది.

జీవన సౌరభం

తన మీద పడే రాళ్లకు భయపడి పారిపోయేవాడు పిరికివాడు. ఆ రాళ్లను తప్పించుకుని ఎదురు తిరిగేవాడు ధైర్యవంతుడు. ఆ రాళ్లతోనే కోటను కట్టుకునేవాడు మేధావి.

JEEVANA జీవన the family

కాలేయాన్ని కాపాడుకుందాం

మానవ శరీరంలో ఒక ముఖ్యమైన అవయవం కాలేయం (లివర్). శరీరం లోపలి అవయవాల్లో ఇదే అతి పెద్దది. ఒకరకంగా దీన్ని అవిశ్రాంత కర్మాగారంతో పోల్చుకోవచ్చు. నిరంతరం ఒకే సమయంలో ఎన్నెన్నో పనులను నిర్వహిస్తుంటుంది. కణజాలాలు, కండరాలు పనిచేయటానికి అవసరమైన శక్తిని అందించే గ్లూకోజు మోతాదులు నియంత్రణలో ఉండటంలో కాలేయం కీలక పాత్ర పోషిస్తుంది. రక్తంలో గ్లూకోజు ఎక్కువగా ఉన్నప్పుడు దాన్ని గ్రహించి, తనలో దాచుకుంటుంది. ఎప్పుడైనా గ్లూకోజు మోతాదులు పడిపోయినప్పుడు వెంటనే విడుదల చేస్తుంది. మనం ఆహారం ద్వారా తీసుకున్న కొవ్వు పదార్థాలు జీర్ణం కావటంలోనూ పాలు పంచుకుంటుంది. ఇదొక గ్రంథి కూడా. ఇది స్పాంజిలా, చీలిక ఆకారంలో, ఎరుపు-గోధుమ రంగులో, ఫుట్‌బాల్ పరిమాణంలో ఉంటుంది. ఎత్తు, బరువు ఆధారంగా పరిమాణం మారుతూ వుంటుంది. శరీరంలోని ఇతర భాగాలకు అవసరమైన ప్రోటీన్లు, హార్మోన్లను తయారు చేస్తుంది. ఒక వ్యక్తిలో సగటున మూడు పౌండ్ల బరువు ఉండే కాలేయం అతిపెద్ద అంతర్గత అవయవం. సాధారణ పరిస్థితుల్లో, కాలేయం శరీరం యొక్క కుడి వైపున, పక్కటెముకల కింద ఉంటుంది. సిటస్ ఇన్వర్సస్ అనే స్థితిలో, కాలేయం ఎడమ వైపున ఉంటుంది.

ఒత్తిడి, ఇతరత్రా కారణాలతో కాలేయ వ్యాధులు వ్యాపిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏటేటా సుమారు 20 లక్షల మంది కాలేయ వ్యాధితో మరణిస్తున్నారంటే పరిస్థితిని ఇట్టే అర్థం చేసుకోవచ్చు. దాదాపు సగం సిర్రోసిస్ సమస్యల కారణంగానూ, ఇంకో సగం వైరల్ హెపటైటిస్, హెపాటోసెల్యులర్ కార్సినోమా కారణంగా ఈ మరణాలు సంభవిస్తున్నాయి. ఎక్కువగా ఊబకాయం, మందులు, వైరల్ ఇన్ఫెక్షన్లు, అధికంగా ఆల్కహాల్ తీసుకోవటం, జన్యుపరమైన రుగ్మతలు, అధికంగా మద్యం సేవించటం వంటివి కాలేయాన్ని దెబ్బతీస్తాయి. కాలేయ వాపు, దెబ్బతినటంతో మచ్చకణజాలం ఏర్పడటానికి కారణమవుతుంది.



నిర్ధారించే పరీక్షలు ఇవీ...

కాలేయ జబ్బును గుర్తించటానికి లివర్ ఫంక్షన్ పరీక్షలు ఉపయోగపడతాయి. అయితే ఫ్యాటీ లివర్ వీటిల్లో అంతగా బయటపడదు. పరీక్ష ఫలితాలు అన్నీ నార్మల్‌గా ఉన్నా కూడా లోపల కాలేయం దెబ్బతిని ఉండొచ్చు. అల్ట్రాసౌండ్ పరీక్షలోనైతే బాగా బయటపడుతుంది. ఇందులో లివర్ బాగా మెరుస్తున్నట్టుగా, తెల్లగా కనిపిస్తుంది. దీని ద్వారా సమస్యను తేలికగా, స్పష్టంగా, ఖచ్చితంగా గుర్తించొచ్చు. ఎలాస్టోస్కాన్ పరీక్షలో కాలేయం ఎంతవరకు దెబ్బతిన్నది? ఎంతవరకు గట్టిపడింది? అనేవీ తెలుస్తాయి. అవసరమైతే సీటీ, ఎమ్మార్ై స్కాన్ పరీక్షలు చేయాల్సి ఉంటుంది. తొలిదశలోనే గుర్తిస్తే మందులు, జీవనశైలి మార్పులతోనే జబ్బు నయమయ్యే అవకాశముంది.

అధునాతన చికిత్సా పద్ధతులు

కాలేయ జబ్బుకు సమగ్రమైన చికిత్స చాలా ముఖ్యం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడిచే ఆసుపత్రులు, క్లినిక్‌లలో మెరుగైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. మంగళగిరిలోని ఎయిమ్స్‌లో కూడా అధునాతన శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే ఎన్‌టిఆర్ ఆరోగ్య సేవా ట్రస్ట్ (ఆరోగ్యశ్రీ) ద్వారా కాలేయ వ్యాధి గ్రస్తులకు చికిత్సలు అందుబాటులోనే ఉంటున్నాయి. అందువల్ల కాలేయ వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో అధునాతనమైన చికిత్సలు, పద్ధతులు అందుబాటులో ఉన్నాయి.

కాలేయం గట్టిపడినవారికి మార్పిడి అవసరపడొచ్చు. కాలేయంలో ప్రధాన రక్తనాళం మూసుకుపోయినవారికి మరింత జాగ్రత్తగా కాలేయ మార్పిడి చేయాల్సి ఉంటుంది. కాలేయ క్యాన్సర్ గలవారికి కొంత భాగం తొలగించాల్సి రావొచ్చు. క్యాన్సర్ తొలిదశలో ఉంటే చికిత్సతోనే ఫలితం కనిపించొచ్చు. మెటబాలిక్ జబ్బు గలవారికి మందులతోనే నయం కావొచ్చు.

అనేక రకాల జబ్బులు

కాలేయ జబ్బు అని ఒకే పేరుతో పిలుచుకున్నా ఇందులో చాలా రకాలున్నాయి. వీటిల్లో ప్రధానమైనవి కాలేయానికి కొవ్వు పట్టటం (ఫ్యాటీ లివర్).. హెపటైటిస్ బి, హెపటైటిస్ సి ఇన్‌ఫెక్షన్లు.. విల్సన్స్ డిసీజ్ వంటి జీవక్రియల సమస్యలు. సుమారు 80 శాతం కాలేయ జబ్బుకు ఇవే కారణం. వీటికి తోడు క్యాన్సర్. ఇవన్నీ కాలేయాన్ని నిర్వీర్యం చేసేవే. వీటికి రకరకాల అంశాలు దోహదం చేస్తుంటాయి.

కాలేయ మార్పిడి

కిడ్నీ విఫలమైతే డయాలిసిస్‌తో రక్తాన్ని శుద్ధి చేసుకునే వీలుంది. కానీ కాలేయం పూర్తిగా విఫలమైతే ఎలాంటి ప్రత్యామ్నాయమూ లేదు. కాలేయ మార్పిడి ఒక్కటే శరణ్యం. ఇది ప్రాణాలు కాపాడే చికిత్స. దీన్ని చేయించుకున్నవారిలో 85-90 శాతం యథావిధిగా పనులు, ఉద్యోగాలు చేసుకోవటం గమనిస్తున్నాం. శస్త్రచికిత్స ఖరీదైనది కావటమే సమస్య. కానీ జబ్బు తీవ్రమై మాటిమాటికీ ఆసుపత్రిలో చేరి, చికిత్స తీసుకోవటంతో పోలిస్తే ఇదంత ఎక్కువేమీ కాదనే చెప్పుకోవచ్చు. పైగా ప్రాణాలనూ కాపాడుకోవచ్చు. ప్రస్తుతం చాలావరకు సన్నిహిత కుటుంబ సభ్యులు, బంధువుల వంటి సజీవ దాతల నుంచే కాలేయాన్ని తీసుకొని, మార్పిడి చేస్తున్నారు. శస్త్రచికిత్స అనంతరం దాతలైనా, గ్రహీతలైనా నాలుగు వారాల్లోనే తిరిగి మామూలు స్థితికి చేరుకుంటారు. కాలేయం తిరిగి త్వరగానే వద్ధి చెందుతుంది. సగం వరకు కత్తిరించినా రెండు నెలల్లోనే దాదాపుగా యథాస్థితికి చేరుకుంటుంది. కాబట్టి కాలేయ మార్పిడి, అవయవ దానం గురించి భయపడాల్సిన పనిలేదు.

సిర్రోసిస్ సంకేతాలు ఇవే..

- ఆకలి కోల్పోవడం
- బరువు తగ్గడం
- బలహీనత, కామెర్లు
- దురద, ఎగువ జీర్ణశయాంతర రక్తస్రావం సంకేతాలు
- పొత్తికడుపులో వాపు (అస్సైట్స్).
- ఉదరంలోని అవయవాల చుట్టూ ద్రవం పేరుకుపోతుంది)
- మూడ్ మార్పులు, గందరగోళం
- అసాధారణ నిద్ర విధానాలు
- కండరాల తిమ్మిరి, ఇది తీవ్రంగా ఉంటుంది
- క్రమరహిత రుతు రక్తస్రావం
- వంధ్యత్వం, మగవారిలో రొమ్ము అభివృద్ధి, స్పైడర్ సిరలు

చికిత్సలు ఎలా చేస్తారంటే...

అసిటిస్ (కడుపు వాపు)అసిటిస్ చికిత్సకు, డాక్టర్స్ డైయూరిటిక్స్ అని పిలిచే మందులను సూచిస్తారు, ఇది శరీరం అదనపు ద్రవాన్ని విసర్జించడానికి సహాయపడుతుంది. ఈ పరిస్థితి ఉన్న వ్యక్తులు వారు వినియోగించే సోడియం మొత్తాన్ని తగ్గించాలని కూడా వారు సిఫార్సు చేస్తారు. విపరీతమైన సందర్భాల్లో యుఎస్‌జి పారాసెంటెసిస్ అనే సాంకేతికతను ఉపయోగించి ఉదరం నుండి ద్రవాన్ని తీసేస్తారు. కొన్ని సందర్భాల్లో ట్రాన్స్‌జుగ్యులర్ ఇంట్రాహెపాటిక్ పోర్టోసిస్టమిక్ షంట్ (టిప్స్) అంటే కాలేయంలో ఒక స్టెంట్‌ను ఉంచడం ద్వారా రక్తం కాలేయాన్ని దాటవేయడానికి అనుమతిస్తుంది, ఇది కాలేయంలో మచ్చల కారణంగా ఏర్పడే ఒత్తిడిని కొంతవరకు తగ్గిస్తుంది.



- డాక్టర్ పి.వి.వెంకట రమణమూర్తి
ఎంఎస్, ఎఫ్ఆర్‌సిఎస్ (యుకె), చీఫ్ సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ అండ్ లాపరోస్కోపిక్ సర్జన్, సర్జికల్ గ్యాస్ట్రోలజీ, ఆంధ్రా హాస్పిటల్స్, విజయవాడ,

భలే భలే పండ్లు

బత్తాయి పండు
బంతి వలె ఉండు
తీపి పులుపు వుండు
తింటే మంచి గుండు


సపోటా పండు
భలే స్వీటు గుండు
మధురమైన రుచి కలిగి
పసందైన పండు

ఆపిల్ పండు
ఎంతో బాగుండు
ఎరుపు రంగు ఉండి
తింటే కమ్మ గుండు

అరటి పండు
అందమైన పండు
పసుపు వర్ణం కలిగి
గుజ్జు గుజ్జు నుండు

మామిడి పండు
టెంకె లోపలుండు
బంగారు వన్నెతో
ఎండాకాలం ఉండు


అల్ల నేరేడు పండు
నల్ల నల్లగుండు
వంకాయ రంగులో
నిగ నిగ లాడుతుండు



ద్రాక్ష పండు
పులుపు తీపి వుండు
తింటా ఉంటే
భలే మంచి గుండు

జామ పండు
చూస్తే బాగుండు
తింటూ ఉంటే
ఎంతో కడుపు నిండు

- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి,
94415 61655.




లెక్క తేల్చండి

పిల్లలూ, ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని అంకెలుగా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 46

నేను గీసిన బొమ్మ





తేలి రాజేశ్వరి,
7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
లక్ష్మీపూర్, ఆదిలాబాద్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

బుమ్రా, జాక్స్ దెబ్బకు సన్‌రైజర్స్ చిత్తు

- నాలుగు వికెట్ల తేడాతో ముంబయి గెలుపు

ముంబయి: వాంఖడే స్టేడియంలో ముంబయి ఇండియన్స్ బౌలర్లు సమిష్టిగా చెలరేగారు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో బుమ్రా(1/21), విల్ జాక్స్(2/14) అద్భుత బౌలింగ్ చేశారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 162 పరుగులు మాత్రమే చేయగల్గింది. అనంతరం ముంబయి జట్టు 18.1 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 166పరుగులు చేసి ఘన విజయం సాధించింది. ముంబయి బ్యాటర్లు విల్ జాక్స్(36), రికెల్టన్(31), సూర్యకుమార్(26), రోహిత్(26) సమిష్టిగా రాణించారు. అంతకుముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు అభిషేక్ శర్మ, హెన్రిక్ క్లాసెన్ రాణించారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (40; 28 బంతుల్లో 7 ఫోర్లు), హెన్రిచ్ క్లాసెన్ (37; 28 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. ట్రావిస్ హెడ్ (28; 29 బంతుల్లో 3 ఫోర్లు) దూకుడుగా ఆడలేకపోయాడు. ఇషాన్ కిషన్ (2) సింగిల్ డిజిట్ స్కోరుకే వెనుదిరిగాడు. నితీశ్ కుమార్ రెడ్డి (19) పరుగులు చేశాడు. చివర్లో అనికేత్ వర్మ (18లిబీ 8 బంతుల్లో 2 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. ముంబయి బౌలర్లలో విల్ జాక్స్ 2, హార్దిక్ పాండ్య, జస్‌ప్రీత్ బుమ్రా, ట్రెంట్ బౌల్ట్ ఒక్కో వికెట్ పడగొట్టారు. ఇన్నింగ్స్ తొలి బంతికే జీవదానం అందుకున్న ఓపెనర్ అభిషేక్ దూకుడుగా ఆడాడు. నిలకడగా బౌండరీలు బాదాడు. దీపక్ చాహర్ వేసిన ఐదో ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లు కొట్టాడు. ఈ క్రమంలో ఏడు ఓవర్లకు హైదరాబాద్ 53/0తో మెరుగైన స్థితిలో నిలిచింది. కానీ, హార్దిక్ పాండ్య బంతి అందుకున్నప్పటి నుంచి సన్‌రైజర్స్ పరుగుల వేగం నెమ్మదించింది. హార్దిక్.. ఇన్నింగ్స్ ఎనిమిదో ఓవర్‌లో అభిషేక్‌ను వెనక్కి పంపాడు. ఆ వెంటనే విల్ జాక్స్ బౌలింగ్‌లో ఇషాన్ కిషన్ స్టంపౌటయ్యాడు. ట్రావిస్ హెడ్ క్రీజులో ఉన్నా బ్యాట్ ఝుళిపించలేకపోయాడు. హెడ్‌ను జాక్స్ ఔట్ చేశాడు. నితీశ్ కూడా దూకుడుగా ఆడలేకపోయాడు. దీంతో 11-16 ఓవర్ల మధ్య 37 పరుగులే వచ్చాయి. 17వ ఓవర్‌లో నితీశ్‌ను బౌల్ట్ పెవిలియన్‌కు పంపాడు. దీపక్ చాహర్ వేసిన 18 ఓవర్‌లో క్లాసెన్ వరుసగా 6, 4, 4, 6 బాదేయడంతో స్కోరు బోర్డులో కదలిక వచ్చింది. దూకుడు మీదున్న క్లాసెన్‌ను బుమ్రా క్లీన్‌బౌల్డ్ చేశాడు. హార్దిక్ వేసిన చివరి ఓవర్‌లో అనికేత్ రెండు సిక్స్‌లు, కమిన్స్ (8లి) ఒక సిక్స్ బాదడంతో స్కోరు 160 దాటింది.



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ విల్ జాక్స్

స్కోర్‌బోర్డు...

సన్‌రైజర్స్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (సి)రాజ్‌బవ (బి)హార్దిక్ 40, హెడ్ (సి)సాంట్నర్ (బి)విల్ జాక్స్ 28, ఇషాన్ కిషన్ (స్టంప్) రికెల్టన్ (బి)విల్ జాక్స్ 2, నితీశ్ రెడ్డి (సి)తిలక్ వర్మ (బి)బౌల్ట్ 19, క్లాసెన్ (బి)బుమ్రా 37, అంకిత్ వర్మ (నాటౌట్) 18, కమిన్స్ (నాటౌట్) 8, అదనం 10. (20ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 162పరుగులు. **వికెట్ల పతనం:** 1/59, 2/69, 3/82, 4/113, 5/136 **బౌలింగ్:** దీపక్ చాహర్ 4-0-47-0, బౌల్ట్ 4-0-29-1, బుమ్రా 4-0-21-1, విల్ జాక్స్ 3-0-14-2, హార్దిక్ పాండ్యా 4-0-42-1, సాంట్నర్ 1-0-8-0.

ముంబయి ఇన్నింగ్స్: రికెల్టన్ (సి)హెడ్ (బి)హర్షల్ పటేల్ 31, రోహిత్ (సి)హెడ్ (బి)కమిన్స్ 26, విల్ జాక్స్ (సి)అన్సారి (బి)కమిన్స్ 36, సూర్యకుమార్ (సి)అన్సారి (బి)కమిన్స్ 26, తిలక్ వర్మ (నాటౌట్) 21, హార్దిక్ (సి)ఇషాన్ కిషన్ (బి)ఈషన్ మలింగ 21, నమన్ ధీర్ (ఎల్‌బి)ఈషన్ మలింగ 0, సాంట్నర్ (నాటౌట్) 0, అదనం 5. (18.1 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 166పరుగులు. **వికెట్ల పతనం:** 1/32, 2/69, 3/121, 4/128, 5/162, 6/162 **బౌలింగ్:** షమీ 3-0-28-0, కమిన్స్ 4-0-26-3, ఈషన్ మలింగ 4-0-38-2, అన్సారి 3.1-0-35-0, హర్షల్ పటేల్ 3-0-31-1, రాహుల్ చాహర్ 1-0-9-0.

ఐపిఎల్‌లో నేడు
బెంగళూరు X పంజాబ్ కింగ్స్
వేదిక: బెంగళూరు; రాత్రి 7.30గంIIలకు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68